జిల్లాకు దిత్వా తుఫాన్ గండం పొంచి ఉంది.. దీని ప్రభావంతో వచ్చే 24 గంటలు భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. రెడ్ అలర్ట్ జారీ చేసింది. ఆదివారం ఉదయం నుంచే వాతావరణంలో మార్పు వచ్చింది. పగటి పూట అత్యధిక ప్రాంతం మేఘావృతమై చలి పెరిగింది. సాధారణం కన్నా గాలుల తీవ్రత అధికమైంది. అక్కడక్కడా జల్లులు కురుస్తున్నాయి. సముద్రంలో అలలు ఎగిసిపడుతున్నాయి. సోమవారం నుంచి తీవ్రత అధికంగా ఉండనున్న నేపథ్యంలో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. జిల్లాలోని తీర ప్రాంతాలతోపాటు సమీప 14 మండలాల్లోని 168 గ్రామాలపై తుఫాన్ ప్రభావం ఉంటుందని అధికారులు అంచనా వేశారు. ఆయా ప్రాంతాల్లో ముందస్తు చర్యలు చేపట్టారు. కనపర్తి, కొత్తపట్నం, ఈతముక్కల, పాకల తదితర చోట్ల బీచ్‌ల వద్దకు ఎవ్వరూ వెళ్లకుండా నిషేధం విధించారు. ఒంగోలులోని కలెక్టరేట్‌లో కంట్రోల్ రూంను ఏర్పాటు చేశారు.

రెడ్ అలర్ట్

జిల్లాపై దిత్వా తుఫాన్ ప్రభావం

24 గంటలు భారీ వర్ష సూచన

- ప్రారంభమైన వాన... పెరిగిన చలిగాలులు
- తీర ప్రాంతంలో ఎగిసిపడుతున్న అలలు
- ముందస్తు జాగ్రత్తలపై యంత్రాంగం దృష్టి
- మత్స్యకారులు వేటకు వెళ్లకుండా చర్యలు
- కలెక్టర్ ఆదేశాలతో అధికారులు అప్రమత్తం
- కలెక్టరేట్‌లో కంట్రోలు రూం ఏర్పాటు
- 08592 281400 నంబరు కేటాయింపు
- ఎమర్జెన్సీ కోసం టోల్ ఫ్రీ నంబరు 1077

ఒంగోలు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : దిత్వా తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. కలెక్టర్ నుంచి క్షేత్రస్థాయి సిబ్బంది వరకు అందరూ ముందస్తు జాగ్రత్తలపై దృష్టి సారించారు. జిల్లాలో దిత్వా తుఫాన్ ప్రభావం ఆదివారం ఉదయం నుంచే ప్రారంభమైంది. వాతావరణం పూర్తిగా చల్లబడింది. అక్కడక్కడా జల్లులు పడుతున్నాయి. వచ్చే 24 గంటలు భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ నుంచి సమాచారం అందింది. దీంతో కీలక శాఖలతోపాటు తీరప్రాంత అధికారులను కలెక్టర్ పి.రాజాబాబు అప్రమత్తం చేశారు. ముఖ్య శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో చర్యలు ప్రారంభించారు.

తీరప్రాంత గ్రామాల్లో ముందస్తు చర్యలు

- జిల్లాలోని తీరప్రాంతాలతోపాటు సమీపంలోని 14 మండలాల్లోని 168 గ్రామాల్లో అధికారులు ముందస్తు చర్యలు చేపట్టారు.
- భారీ వర్షాలు కురిస్తే వాగులు, వంకలు పొంగి పొర్లే అవకాశాలు ఉన్న చోట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై దృష్టి సారించారు.
- మత్స్యకారులు చేపల వేటకు సముద్రం లోపలికి వెళ్లరాదని హెచ్చరించి ఆపేశారు.

గ్రామాల్లో అధికారుల పర్యటన

కలెక్టర్ రాజాబాబు ఆదేశాలతో తీరప్రాంత మండలాల స్పెషల్ ఆఫీసర్లు ఆయా మండలాల అధికారులతో కలిసి తీరప్రాంత గ్రామాల్లో పర్యటించి ప్రజలను అప్రమత్తం చేశారు. ఒంగోలుతోపాటు వివిధ పట్టణాలు, ప్రధాన గ్రామాల్లో వర్షాలతో ముంపునకు గురయ్యే లోతట్టు ప్రాంతాల్లో స్థానిక అధికారులు ముందస్తు చర్యలు చేపట్టారు. చాలాచోట్ల వరి కోతలకు రాగా.. కంది, పత్తి, మిర్చి వంటివి కాపు దశలో ఉండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.



ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొంటాం

- మండలాలకు ప్రత్యేకాధికారులు
- ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందం సిద్ధం
- కలెక్టర్ రాజాబాబు వెల్లడి
- వరి కోతలను వాయిదా వేసుకోవాలని రైతులకు సూచన


7లో

విద్యుత్ ఉద్యోగులకు సెలవులు రద్దు

7

నేడు 'మీకోసం', పోలీస్ గ్రీవెన్స్ రద్దు

7



కొత్తపట్నం తీరంలో ఎగిసిపడుతున్న అలలు

నేడు పింఛన్‌ల పంపిణీ

- కొత్తగా 345 మంజూరు
- జిల్లాలో 2,83,200 మంది లబ్ధిదారులు
- రూ.124.71 కోట్లు విడుదల

ఒంగోలు నగరం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ఎన్టీఆర్ భరోసా పింఛన్‌లు సోమవారం పంపిణీ చేయనున్నారు. ప్రభుత్వం జిల్లాకు కొత్తగా 345 పింఛన్‌లను మంజూరు చేసింది. పింఛన్ తీసుకుంటూ మరణించిన వారి భార్యలకు స్పౌజ్ కేటగిరీ కింద వీటిని ఇచ్చింది. దీంతో మొత్తం సామాజిక పింఛన్‌దారుల సంఖ్య 2,83,200కు చేరింది. వీరికి పంపిణీ చేసేందుకు ప్రభుత్వం రూ.124.71 కోట్లను విడుదల చేసింది. ఈ సొమ్మును సచివాలయాల సిబ్బంది శనివారమే డ్రా చేశారు. సోమవారం ఉదయం 6.30గంటల నుంచి పంపిణీని ప్రారంభించనున్నారు. ఈనెలలో వృద్ధులు 1,46,422, వితంతువులు 74,922, చర్మకారులు 5,232, డప్పుకళాకారులు 4,510, దివ్యాంగులు 32,655 పింఛన్‌ను తీసుకోనున్నారు. వీరితోపాటు మత్స్యకారులు 2,451 మంది, చేనేత కార్మికులు 1,720, కల్లుగీత కార్మికులు 241, హిజ్రాలు 89, కళాకారులు 56, అభయహస్తం కింద 4,668, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్నవారు 1,988 మందితోపాటు 543 మంది ఇతర కేటగిరీలకు చెందిన వారికి పింఛన్ పంపిణీ చేయనున్నారు.

నేటి నుంచి రేషన్

- పంపిణీకి పౌరసరఫరాల శాఖ అధికారుల చర్యలు
- ఈసారీ లేని కందిపప్పు... జొన్నలు కేటాయింపు

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో రేషన్ సరుకుల పంపిణీ సోమవారం నుంచి ప్రారంభవుతోంది. అందుకు అవసరమైన ఏర్పాట్లను పౌరసరఫరాల శాఖ అధికారులు చేశారు. జిల్లాలో 1,392 రేషన్‌షాపుల పరిధిలో 6.51 లక్షల మంది కార్డుదారులు ఉన్నారు. వారికి సోమవారం ఉదయం 8గంటల నుంచే సరుకుల పంపిణీ మొదలవుతుంది. బియ్యం, పంచదారతోపాటు ఈసారి జొన్నలు ఇవ్వనున్నారు. ఒక్కో కార్డుదారుడికి మూడు కిలోల చొప్పున 200 మెట్రిక్ టన్నుల జొన్నలను ప్రభుత్వం కేటాయించింది. జొన్నలు ఎన్ని కిలోలు తీసుకుంటే అన్ని కిలోల బియ్యాన్ని తగ్గించి డీలర్లు కార్డుదారులకు ఇస్తారు. రేషన్ షాపులకు ఈసారి కూడా కందిపప్పును కేటాయించలేదు. డిసెంబరు, జనవరి నెలలు పండుగ సీజన్ కావడంతో కందిపప్పును ఇస్తారని కార్డుదారులు ఆశించారు. అయితే ప్రభుత్వం నుంచి కేటాయింపులు లేకపోవడంతో బహిరంగ మార్కెట్లో అధిక ధరలకు కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. పది నెలలుగా రేషన్‌షాపుల ద్వారా కార్డుదారులకు కందిపప్పు పంపిణీ నిలిచిపోయింది.

సంక్రాంతి తర్వాత ట్రంక్‌రోడ్డు విస్తరణ

- వ్యాపారులకు తుది నోటీసులు జారీ
- చర్యలు వేగవంతం చేసిన కార్పొరేషన్ అధికారులు



ట్రంక్‌రోడ్డు ఇదే..

ఒంగోలు కార్పొరేషన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలు నగర అభివృద్ధిలో కీలకమైన ట్రంక్‌రోడ్డు విస్తరణ అంశం కొలిక్కి వచ్చింది. సంక్రాంతి తర్వాత పనులు ప్రారంభంకానున్నాయి. కార్పొరేషన్ అధికారులు ఆదివారం నుంచి వ్యాపారులకు తుది నోటీసులు ఇస్తున్నారు. ట్రంక్‌రోడ్డు విస్తరణ విషయం ఎప్పటికప్పుడు వాయిదా పడుతూ వస్తోంది. తొలుత నగర మాస్టర్ ప్లాన్ ప్రకారం 100 అడుగులు చేయాలని కార్పొరేషన్ అధికారులు భావించారు. దీనిపై వ్యాపారుల నుంచి అభ్యంతరాలు వచ్చాయి. అలా చేస్తే తాము తీవ్రంగా నష్టపోతామని 60 అడుగులకు పరిమితం చేయాలని వారు డిమాండ్ చేశారు. ప్రజాప్రయోజనం దృష్ట్యా 100 అడుగుల విస్తరణకే అధికారులు ప్రణాళిక రూపొందించడంతో కొందరు వ్యాపారులు హైకోర్టును ఆశ్రయించారు. కోర్టు కూడా మాస్టర్ ప్లాన్ ప్రకారం ముందుకెళ్లాలని ఆదేశించింది. అదేసమయంలో వ్యాపారులకు న్యాయం చేయాలని కార్పొరేషన్ అధికారులకు సూచించింది. దీంతో పాత కూరగాయల మార్కెట్‌లోని కార్పొరేషన్ స్థలంలో దుకాణాలు నిర్మించి ఇచ్చేందుకు ప్రతిపాదించారు. అలా వద్దని కోరిన వారికి నాలుగు రెట్ల విలువ చేసే టీడీఆర్ బాండ్‌లు ఇస్తామని ప్రకటించారు. దీంతోపాటు వ్యాపారుల నుంచి వచ్చిన విన్నపాలను పరిగణనలోకి తీసుకున్న అధికారులు ఎట్టకేలకు ట్రంక్‌రోడ్డును 80 అడుగులకు విస్తరించాలని నిర్ణయించారు. ఆమేరకు ఈనెల మొదటి వారంలో జరిగిన కౌన్సిల్ సమావేశంలో ఆమోదం లభించింది. సంక్రాంతి అనంతరం రోడ్డు విస్తరణ పనులు ప్రారంభించనున్నారు. ఈనేపథ్యంలో ముందస్తుగా వ్యాపారులకు ఫైనల్ నోటీసులు ఆదివారం నుంచి అందజేస్తున్నారు.

కాబోయే సీఎస్ మనవారే

- జిల్లావాసి సాయిప్రసాద్‌కు అవకాశం
- మూడు నెలల తర్వాత బాధ్యతలు
- గతంలో పనిచేసిన ఐవీఆర్



ఒంగోలు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వ కార్యకలాపాల నిర్వహణలో అత్యంత కీలకమైన ప్రధాన కార్యదర్శి (సీఎస్)గా మరోసారి జిల్లా వాసికి అవకాశం దక్కింది. ప్రస్తుతం ప్రభుత్వంలో స్పెషల్ సీఎస్ హోదాలో జలవనరులశాఖను పర్యవేక్షిస్తున్న జి.సాయిప్రసాద్ తదుపరి సీఎస్‌గా నియమితులయ్యారు. ప్రస్తుత సీఎస్ విజయానంద్ ఉద్యోగ విరమణ కాలం ఆదివారంతో ముగుస్తుండగా మూడు నెలలపాటు ప్రభుత్వం పొడిగించింది. అలా వచ్చే ఏడాది ఫిబ్రవరి 28 వరకు ఆ పదవిలో ఆయన కొనసాగనున్నారు. అనంతరం మార్చి 1నుంచి సీనియర్ ఐఏఎస్ అధికారి అయిన జి.సాయిప్రసాద్ ఆ బాధ్యతలు స్వీకరించనున్నారు. ఆమేరకు ప్రభుత్వం ఇప్పుడే ఉత్తర్వులు ఇచ్చింది. ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్న ఐఏఎస్ అధికారులలో సీనియర్ అయిన సాయిప్రసాద్ 1991 బ్యాచ్‌కు చెందినవారు. సంతనూతలపాడు నియోజకవర్గంలోని నాగులుప్పలపాడు మండలం మట్టిగుంట ఆయన స్వగ్రామం. ఎంటెక్ చదివిన సాయిప్రసాద్ 1991లో ఐఏఎస్‌కు ఎంపికయ్యారు. చిత్తూరు జిల్లా కలెక్టర్‌గా, గుంటూరు కార్పొరేషన్ కమిషనర్‌గా, వరంగల్, పాడేరులలో సబ్ కలెక్టర్‌గా పనిచేశారు. రాష్ట్ర హోదాల్లోకి వెళ్ళిన తర్వాత విద్యుత్ రంగ సంస్థలు, శాఖల్లో చాలాకాలం పనిచేశారు. గతంలో చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడు ఆయన కార్యాలయంలో కీలక అధికారిగా బాధ్యతలు నిర్వర్తించారు. రెవెన్యూలో ఉన్నతమైన సీసీఎల్‌ఏగా కూడా పనిచేశారు. గతంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా కొండపి నియోజకవర్గంలోని పొన్నలూరు మండలం చౌటపాలెంకు చెందిన ఐవీఆర్ కృష్ణారావు పనిచేశారు. ఉమ్మడి రాష్ట్ర విభజన అనంతరం రాష్ట్రానికి తొలి సీఎస్‌గా సేవలు అందించారు. రెండోవ్యక్తిగా జిల్లాకు చెందిన సాయిప్రసాద్‌కు అరుదైన అవకాశం లభించింది.

అలరించిన కళా ప్రదర్శనలు

కళామిత్ర మండలి తెలుగు లోగిలి వార్షికోత్సవం సందర్భంగా ఒంగోలులోని ఎన్టీఆర్ కళాక్షేత్రంలో ఆదివారం కవి సమ్మేళనం, విద్యార్థుల నృత్య ప్రదర్శనలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. తెలుగు భాష గొప్పతనాన్నీ, భాషాభివృద్ధికి మహనీయుల కృషినీ వక్తలు కొనియాడారు. సీబీఐ మాజీ జాయింట్ డైరెక్టర్ లక్ష్మీనారాయణను నూనె వెంకాయమ్మ, వెంకటరత్నం స్మారక జీవన సాఫల్య పురస్కారంతో సన్మానించారు.

7



కల్తీపాలపై ప్రత్యేక దృష్టి

- తయారీ ప్రాంతాల సమాచారాన్ని సేకరించిన ఆహార భద్రతాశాఖ అధికారులు
- విస్తృత తనిఖీలకు రంగం సిద్ధం

దర్శి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : కల్తీపాల తయారీ, విక్రయదారులపై ఆహార భద్రతాశాఖ అధికారులు దృష్టి సారించారు. ఏయే ప్రాంతాల్లో కల్తీపాలు తయారవుతున్నాయన్న దానిపై పూర్తి సమాచారాన్ని సేకరించినట్టు తెలిసింది. దర్శి ప్రాంతంలో కల్తీపాల తయారీ కుటీర పరిశ్రమగా విస్తరించింది. ఈనేపథ్యంలో 'ఆంధ్రజ్యోతి' వరుస కథనాలు ప్రచురించడంతో జిల్లా ఆహార భద్రతాశాఖ అధికారులు కదిలారు. గతంలో పనిచేసిన కొంతమంది అధికారులు కల్తీపాల తయారీదారులతో కుమ్మక్కై ముడుపులు తీసుకుంటూ సహకరించారు. ఇటీవల ఆహార భద్రతాశాఖలోకి కొత్త అధికారులు వచ్చారు. కల్తీపాలపై పూర్తి సమాచారంతో దాడులు ప్రారంభించారు. దర్శి మండలంలోని చలివేంద్ర గ్రామంలో ఒక డెయిరీ ఫాంను తనిఖీ చేయగా కల్తీపాలు తయారు చేసేందుకు వాడిన ఆయిల్ ప్యాకెట్లు, మిక్సింగ్ చేసే మిక్సీలు దొరికాయి. దీంతో అక్కడ తయారవుతున్న పాలను కల్తీపాలుగా గుర్తించి శ్యాంపిల్స్ తీసుకొని వెళ్లారు.

పెండింగ్‌లో పలు కేసులు

కల్తీపాల తయారీపై అనేక కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. గతంలో శ్యాంపిల్స్ తీసి పరీక్షల కోసం ల్యాబ్‌కు పంపారు. అందులో దర్శి - కురిచేడు రోడ్డులోని ఓ పాలశీతల కేంద్రం కల్తీపాలు సేకరిస్తున్నట్టు తేలిందని సమాచారం. ఆ కేంద్రానికి రూ.50వేలు జరిమానా విధించినట్టు అధికారులు తెలిపారు. ఇప్పటికైనా ఆహార భద్రతాశాఖ అధికారులు కల్తీపాల తయారీని అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.



చలివేంద్రలో పాల శ్యాంపిల్ తీసుకుంటున్న అధికారులు



అమ్మనబ్రోలు విద్యార్థిని ప్రతిభ



మోనిక

నాగులుప్పలపాడు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): అమ్మనబ్రోలు గ్రామంలోని శ్రీసాయి విద్యానికేతన్‌కు చెందిన ఆరో తరగతి విద్యార్థిని పింజల మౌనిక రాష్ట్రస్థాయి విద్యార్థి విజ్ఞాన్‌మందిర్ (వీవీఎం) సైన్స్ పోటీలకు ఎంపికైనట్లు కరస్పాండెంట్ ఆళ్ల సాంబయ్య ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇటీవల దేశవ్యాప్తంగా ఆన్‌లైన్‌లో నిర్వహించిన వీవీఎం పరీక్షల్లో విద్యార్థి మౌనిక లెవల్-1, లెవల్-2 పరీక్షలలో ఉత్తీర్ణత సాధించడంతో పాటు రాష్ట్రస్థాయిలో 21వ ర్యాంక్ సాధించారని పేర్కొన్నారు. తద్వారా డీఆర్‌డీవో, ఇస్రో, సీఎస్‌ఐఆర్ లాంటి పరిశోధన సంస్థల సందర్శనతో పాటు శిక్షణ తీసుకోవచ్చన్నారు. అందులో భాగంగా ఈనెల 27,28 తేదీల్లో శ్రీహరికోట అంతరిక్ష కేంద్రం సందర్శనలో పాల్గొనేందుకు మౌనిక అర్హత సాధించినట్లు తెలిపారు. అనంతరం బెంగళూరులోని ఇస్రో కేంద్రాన్ని సందర్శించనున్నారు. ఈ సందర్భంగా మౌనికలను కరస్పాండెంట్ సాంబయ్య, ఉపాధ్యాయులు, గ్రామస్థులు అభినందించారు.

ఒంగోలు సబ్‌డివిజన్‌లో 30 పోలీసు చట్టం అమలు

ఒంగోలు క్రైం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): ఒంగోలు సబ్‌డివిజన్‌లో శాంతి భద్రతలు పరిరక్షణలో భాగంగా 30 పోలీసు చట్టం అమలులో ఉందని డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 1 నుంచి 31వ తేదీ వరకు ఈ చట్టం అమలులో ఉంటుదన్నారు. ముందస్తుగా పోలీసు అనుమతి లేకుండా సభలు, సమావేశాలు, ర్యాలీలు జరపకూడదని, నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తించిన వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



చైర్మన్ బాలాజీని సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

ఒంగోలు కార్పొరేషన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు జిల్లా కావలి జవహర్ భారతీ కాలేజీ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా జరిగింది. ఒంగోలులోని ఓ హోటల్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో 1976-78 సంవత్సరంలో ఎంపీసీ, బైపీసీ విద్యనభ్యసించిన పూర్వ విద్యార్థులు పాల్గొని సందడి చేశారు. కళాశాలలో చదువుకునే రోజుల్లో మధుర జ్ఞాపకాలను మరోసారి గుర్తు చేసుకున్నారు. మరోసారి కలుసుకోవడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. టూరిజం కార్పొరేషన్ చైర్మన్ నూకసాని బాలాజీ, ఢాకా కోటిరెడ్డి ఆత్మీయ అతిథులుగా హాజరయ్యారు. అనంతరం బాలాజీ దంపతులను సన్మానించారు. కార్యక్రమంలో శ్రీనాథ్‌రెడ్డి, అనిల్‌బాబు, అంజనేయులు, వి.సురేంద్రనాథ్‌రెడ్డి, సి.శ్రీనివాసరావు, కేఎల్.నాగేశ్వరరావు, ఆర్ఎస్.నాయుడు పాల్గొన్నారు.

దిత్వా ప్రభావంతో కార్పొరేషన్ ముందస్తు చర్యలు

ఒంగోలు కార్పొరేషన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): దిత్వా తుఫాన్ హెచ్చరిక నేపథ్యంలో ఒంగోలు నగరపాలక సంస్థ అధికారులు ముందస్తు చర్యలు చేపట్టారు. ఈమేరకు ఆదివారం నగరంలోని శివారుకాలనీల్లో కమిషనర్ వెంకటేశ్వరరావు కార్పొరేషన్ అధికారులతో కలిసి పర్యటించారు. వర్షం తీవ్రత దృష్ట్యా రోడ్లపై నీరు నిలబడకుండా కాలువల్లో పూడికలు తీయించారు. అలాగే మురుగు ప్రవాహ ప్రధాన మార్గమైన పోతురాజు కాలువలో వ్యర్థాలను తొలగించారు. దాంతోపాటుగా ఆయా కాలనీల ప్రజలతో మాట్లాడి, ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ఏదైనా ఇబ్బందులు ఎదురైతే వెంటనే కార్పొరేషన్ కార్యాలయానికి టోల్ ఫ్రీ నెంబరు 08592-227766 కు సమాచారం అందించాలని కోరారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మూడు షిఫ్టులలో కార్యాలయంలో హెల్ప్ సెంటర్ ఏర్పాటు చేశాని, సెలవులు కూడా రద్దు చేసి ప్రజలకు సేవందిస్తున్నట్లు చెప్పారు.

సిటీ యూనియన్ బ్యాంక్ లిమిటెడ్

CUB TRUST AND EXCELLENCE SINCE 1904

క్రెడిట్ రికవరీ మరియు మేనేజ్‌మెంట్ శాఖ

పరిపాలనా కార్యాలయము : నం. 24-B, గాంధీనగర్, కుంబకోణం - 612001.

ఇ-మెయిల్ ఐడి: crmd@cityunionbank.in, ఫోన్ : 0435-2432322, ఫ్యాక్స్ : 0435-2431746

SARFAESI చట్టం 2002 క్రింద రీ-టెండరు - సహిత - వేలం అమ్మకం ప్రకటన

రుణగ్రహీతలు/హామీదారులు : నం.1) శ్రీ కోమట్ల మధుసూదన రెడ్డి తండ్రి పోతురాజు రెడ్డి, డి.నం.1/148, పెద్దగంజాం, చిన్నగంజాం, ప్రకాశం జిల్లా, అంధ్రప్రదేశ్-523186. నం.2) శ్రీమతి కోమట్ల రాజమణి, భర్త కోమట్ల మధుసూదన రెడ్డి, డి.నం. 1/148, పెద్దగంజాం, చిన్నగంజాం, ప్రకాశం జిల్లా, అంధ్రప్రదేశ్-523186. నం.3) శ్రీ కోమట్ల దామోదర రెడ్డి, తండ్రి పోతురాజు రెడ్డి, డి.నం.1/148, పెద్దగంజాం, చిన్నగంజాం, ప్రకాశం జిల్లా, అంధ్రప్రదేశ్-523186. వారి నుండి 06.08.2025 నుండి చార్జి చేయబడే తదుపరి వడ్డీ, ఇతర ఖర్చులు, ఏవేని ఇతర బకాయితో కలిపి 05.08.2025 నాటికి రూ.40,48,100/- (రూపాయలు నలభై లక్షల నలభై ఎనిమిదివేల ఒక వంద మాత్రమే)లను రాబట్టుకొనుటకు సెక్యూరిటీ ఇంట్రెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్సు, 2002లోని రూలు 8(6) & 9 క్రింద, SARFAESI చట్టం 2002 క్రింద సిటీ యూనియన్ బ్యాంక్ లిమిటెడ్‌కు తనఖాపెట్టిన దిగువ ఆస్తి / ఆస్తులు బ్యాంక్ అధీకృత అధికారిచే రీ-టెండరు-సహిత-బహిరంగ వేలంలో విక్రయించబడును.

మా బ్యాంక్‌కు తనఖా పెట్టబడిన స్థిరాస్తులు

షెడ్యూలు-A : (శ్రీ కోమట్ల మధుసూదన రెడ్డి తండ్రి పోతురాజు రెడ్డికి చెందిన ఆస్తి)

ప్రకాశం జిల్లా రిజిస్ట్రేషన్, అమ్మనబ్రోలు సబ్ రిజిస్ట్రేషన్, చిన్నగంజాం మండలం, పెద్దగంజాం పంచాయతీ మరియు గ్రామం, సర్వే నం.607/3ఎ, డోర్ నం.1-14 సమీపాన, మొత్తం ఎ.0.47 సెంట్లలో ప్రస్తుతం ఉన్న భూమి మరియు ఇప్పుడు దానిపై ఉన్న లేదా భవిష్యత్‌లో దానిలో నిర్మించబోయే కట్టడాలతో ఆస్తి యావత్తు. షెడ్యూలు ఆస్తి సరిహద్దులు: తూర్పు: కోమట్ల గంగాధర్ స్థలం, దక్షిణం: కోమట్ల దామోదర్ రెడ్డికి ఇవ్వబడిన స్థలం, పశ్చిమం: డొంక రోడ్, ఉత్తరం: కోమట్ల మధుసూదన రెడ్డికి ఇవ్వబడిన స్థలం, షెడ్యూలు బి ఆస్తి: ఈ సరిహద్దులతో 435.6 చ.గజాలు విస్తీర్ణం కలిగిన స్థలం.

షెడ్యూలు-B : (శ్రీ కోమట్ల మధుసూదన రెడ్డి తండ్రి పోతురాజు రెడ్డికి చెందిన ఆస్తి)

ప్రకాశం జిల్లా రిజిస్ట్రేషన్, అమ్మనబ్రోలు సబ్ రిజిస్ట్రేషన్, చిన్నగంజాం మండలం, పెద్దగంజాం పంచాయతీ మరియు గ్రామం, సర్వే నం.607/3ఎ, డోర్ నం.1-14 సమీపాన, మొత్తం ఎ.0.47 సెంట్లలో ప్రస్తుతం ఉన్న భూమి మరియు ఇప్పుడు దానిపై ఉన్న లేదా భవిష్యత్‌లో దానిలో నిర్మించబోయే కట్టడాలతో ఆస్తి యావత్తు. షెడ్యూలు ఆస్తి సరిహద్దులు: తూర్పు: కోమట్ల గంగాధర్ స్థలం, దక్షిణం: కోమట్ల మధుసూదన రెడ్డి స్థలం. A ఆస్తి. పశ్చిమం: డొంక రోడ్, ఉత్తరం: కోమట్ల పోతురాజు రెడ్డికి మిగిలిన స్థలం, ఈ సరిహద్దులతో 387.20 చ.గజాలు విస్తీర్ణం కలిగిన స్థలం.

రిజర్వు ధర: రూ. 19,00,000/-
(రూపాయలు పందొమ్మిది లక్షలు మాత్రమే) (షెడ్యూలు A&B కొరకు మాత్రమే)

షెడ్యూలు-C : (శ్రీ కోమట్ల దామోదర రెడ్డి తండ్రి పోతురాజు రెడ్డికి చెందిన ఆస్తి)

ప్రకాశం జిల్లా రిజిస్ట్రేషన్, అమ్మనబ్రోలు సబ్ రిజిస్ట్రేషన్, చిన్నగంజాం మండలం, పెద్దగంజాం పంచాయతీ మరియు గ్రామం, సర్వే నం.607/3ఎ, డోర్ నం.1-14 సమీపాన, మొత్తం ఎ.0.47 సెంట్లలో ప్రస్తుతం ఉన్న భూమి మరియు ఇప్పుడు దానిపై ఉన్న లేదా భవిష్యత్‌లో దానిలో నిర్మించబోయే కట్టడాలతో ఆస్తి యావత్తు. షెడ్యూలు ఆస్తి సరిహద్దులు: తూర్పు: కోమట్ల గంగాధర్ స్థలం, దక్షిణం: కోమట్ల దామోదర్ రెడ్డికి ఇవ్వబడిన స్థలం, షెడ్యూల్-సి ఆస్తి, పశ్చిమం: డొంక రోడ్, ఉత్తరం: కోమట్ల మధుసూదన రెడ్డికి ఇవ్వబడిన స్థలం, ఈ సరిహద్దులతో 435.6 చ.గజాలు విస్తీర్ణం కలిగిన స్థలం.

షెడ్యూలు-E : (శ్రీ కోమట్ల దామోదర రెడ్డి తండ్రి పోతురాజు రెడ్డికి చెందిన ఆస్తి)

ప్రకాశం జిల్లా రిజిస్ట్రేషన్, అమ్మనబ్రోలు సబ్ రిజిస్ట్రేషన్, చిన్నగంజాం మండలం, పెద్దగంజాం పంచాయతీ మరియు గ్రామం, సర్వే నం.607/3ఎ, డోర్ నం.1-14 సమీపాన, మొత్తం ఎ.0.47 సెంట్లలో ప్రస్తుతం ఉన్న భూమి మరియు ఇప్పుడు దానిపై ఉన్న లేదా భవిష్యత్‌లో దానిలో నిర్మించబోయే కట్టడాలతో ఆస్తి యావత్తు. షెడ్యూలు ఆస్తి సరిహద్దులు: తూర్పు: కోమట్ల గంగాధర్ స్థలం, దక్షిణం : కోమట్ల వెంకటప్పరెడ్డి స్థలం, పశ్చిమం : డొంక రోడ్, ఉత్తరం: కోమట్ల దామోదర రెడ్డి స్థలం షెడ్యూల్-ఎ ఆస్తి, స్థలం యొక్క విస్తీర్ణం 435.6 చ.గ.ల ఈ సరిహద్దులలో కలదు.

రిజర్వు ధర: రూ. 20,00,000/-
(రూపాయలు ఇరవై లక్షలు మాత్రమే) (షెడ్యూలు C&E కొరకు మాత్రమే)

షెడ్యూలు-D : (శ్రీ కోమట్ల దామోదర రెడ్డి తండ్రి పోతురాజు రెడ్డికి చెందిన ఆస్తి)

ప్రకాశం జిల్లా రిజిస్ట్రేషన్, అమ్మనబ్రోలు సబ్ రిజిస్ట్రేషన్, చిన్నగంజాం మండలం, పెద్దగంజాం పంచాయతీ మరియు గ్రామం, సర్వే నం.609/3, డోర్ నం.1-14 సమీపాన, మొత్తం ఎ.0.19 సెంట్లలో ప్రస్తుతం ఉన్న భూమి మరియు ఇప్పుడు దానిపై ఉన్న లేదా భవిష్యత్‌లో దానిలో నిర్మించబోయే కట్టడాలతో ఆస్తి యావత్తు. షెడ్యూలు ఆస్తి సరిహద్దులు: తూర్పు: అసోది దుర్గారెడ్డి ఇళ్లు మరియు స్థలం, దక్షిణం: మోటమారి రాఘవ మరియు ఇతరుల ఇళ్ళు మరియు స్థలం, పశ్చిమం: పంచాయితీ రోడ్, ఉత్తరం: కోమట్ల వెంకటప్ప రెడ్డి స్థలం, ఈ సరిహద్దులతో 435.6 చ.గజాలు విస్తీర్ణం కలిగిన స్థలం.

రిజర్వు ధర: రూ. 14,00,000/-
(రూపాయలు పద్నాలుగు లక్షలు మాత్రమే)

రీ- వేలం వివరాలు :

రీ- టెండరు-సహిత-వేలం అమ్మకం తేది:	ప్రదేశం
19-12-2025	సిటీ యూనియన్ బ్యాంక్ లిమిటెడ్, ఒంగోలు శాఖ, నం.37-1-167 (55), గ్రౌండ్ ఫ్లోర్, వాసు ప్లాజా, కర్నూల్ రోడ్, ఒంగోలు, ప్రకాశం, అంధ్రప్రదేశ్-523002. టెలిఫోన్ నం.08592-282912, సెల్ నం.9347078104, 8925876329

రీ- టెండరు-సహిత-వేలం అమ్మకం నియమ నిబంధనలు :

1. కాగోరు బిడ్డర్లు వేలంలో స్వయంగా పాల్గొనవలెను మరియు వ్యక్తిగతంగా పాల్గొనాలి మరియు అందుకు సంబంధించి అతని/ఆమె కొరకే అతను/ఆమె బిడ్డింగ్ వేస్తున్నట్లు వ్రాతపూర్వక ప్రకటన ఇవ్వవలసి ఉంటుంది. 2. కాగోరు బిడ్డర్లు మేనేజర్, సిటీ యూనియన్ బ్యాంక్ లిమిటెడ్, ఒంగోలు శాఖ, నం.37-1-167 (55), గ్రౌండ్ ఫ్లోర్, వాసు ప్లాజా, కర్నూల్ రోడ్, ఒంగోలు, ప్రకాశం, అంధ్రప్రదేశ్-523002 వారి నుండి టెండరు ఫారాలను పొందవచ్చును. 3. కాగోరు బిడ్డర్లు వారి బిడ్డను "సిటీ యూనియన్ బ్యాంక్ లిమిటెడ్" పేరున రిజర్వు ధరలో 10 శాతం బయానా కొరకు తీసిన డిమాండ్ డ్రాఫ్ట్ / పే ఆర్డర్ రూపంలో ఉన్నదానితోపాటుగా ఇందులో తెలిపిన టెండరు-సహిత-వేలం అమ్మకం తేదీన మ.12.00 గం.కు లేదా అలోగా అధీకృత అధికారి, సిటీ యూనియన్ బ్యాంక్ లిమిటెడ్ వారి చిరునామాకు సీల్డు ఎన్వలప్‌లో నిర్దిష్టపరిచిన టెండరు ఫారంలో మాత్రమే వారి బిడ్డను దాఖలు చేయవలెను. 4. ఆస్తి తనిఖీ మరియు ఇతర వివరాల కొరకు కాగోరు కొనుగోలుదారు టెలిఫోన్ నం.08592-282912, సెల్ నం.9347078104,8925876329లను సంప్రదించవచ్చును. 5. ఆస్తి / ఆస్తులు "ఎక్కడ ఎలా ఉన్నవి అక్కడ అలా" మరియు "అక్కడ ఏది ఉన్నదో అది" ప్రాతిపదికన విక్రయించబడతాయి. 6. ఇందులో తెలిపిన టెండరు-సహిత-వేలం అమ్మకం తేదీన మ.1.00 గం.కు కాగోరు బిడ్డర్ల సమక్షంలో సీల్డ్ టెండర్లు తెరవబడతాయి. అమ్మకం సాధారణంగా ముగింపు టెండర్ల రూపంలోనే ఉంటుంది. అధీకృత అధికారి అతని విచక్షణ మేరకు టెండరు ప్రక్రియ ముగింపు సమయంలో స్వీకరించబడిన దానికన్నా అత్యధిక బిడ్‌ను కోట్ చేయుటకు ఆసక్తి వ్యక్తం చేసిన బిడ్డర్ల మధ్య బహిరంగ వేలం నిర్వహించవచ్చును మరియు అటువంటి సందర్భంలో అత్యధిక బిడ్ వేసిన వ్యక్తికే అమ్మకం సంక్రమిస్తుంది. అయితే అమ్మకం సిటీ యూనియన్ బ్యాంక్ లిమిటెడ్ నిర్ధారణకు లోబడి ఉంటుంది. 7. గెలుపొందిన బిడ్డరు అమ్మకం పూర్తయిన వెంటనే అమ్మకం మొత్తంలో 25% (చెల్లించిన బయానా కలిపి) చెల్లించాలి మరియు మిగిలిన 75% మొత్తమును అమ్మకం నిర్ధారణ తేదీ నుండి 15 రోజులలోగా చెల్లించాలి. లేనిచో ముందుగా డిపాజిట్ చేసిన 25% మొత్తం స్వాధీనం చేసుకొనబడుతుంది. 8. ఇందులో నిర్దిష్టపరచిన కాలపరిమితిలోగా మొత్తం అమ్మకం ప్రతిఫలం అందుకున్న తరువాత మాత్రమే గెలుపొందిన కొనుగోలుదారు పేరు మీద అమ్మకం సర్టిఫికెట్‌ను అధీకృత అధికారి జారీ చేస్తారు. 9. చట్టం క్రింద వర్తించు విధంగా స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజులు వంటి కన్వేయన్స్ కొరకు చెల్లించాల్సిన చార్జీలు/ఫీజులు గెలుపొందిన కొనుగోలుదారు భరించవలసి ఉంటుంది. 10. ప్రభుత్వానికి, ప్రభుత్వ రంగ సంస్థలకు మరియు స్థానిక సంస్థలకు బకాయిలు ఉన్న ఏవేని చట్టబద్ధ బకాయిలు (న్యాయపరంగా ఇంటి పన్ను, విద్యుత్ చార్జీలు మరియు ఇతర బకాయిలు) TDS, GST గెలుపొందిన బిడ్డరే చెల్లించాలి. 11. ఎటువంటి కారణం తెలియజేయకుండా బిడ్డను అంగీకరించు లేదా తిరస్కరించు లేదా అమ్మకాన్ని వాయిదా వేయు లేదా రద్దు చేయు అన్ని అధికారాలు అధీకృత అధికారి కలిగి ఉన్నారు.

ప్రదేశం : కుంబకోణం, తేది : 29.11.2025 — అధీకృత అధికారి

నమోదిత కార్యాలయం: 149, T.S.R. (Big) స్ట్రీట్, కుంబకోణం, తంజావూరు జిల్లా, తమిళనాడు-612001, CIN - L65110TN1904PLC001287, టెలిఫోన్ నం.0435-2402322, ఫ్యాక్స్:0435-2431746, వెబ్‌సైట్:www.cityunionbank.com

గ్రామాల అభివృద్ధికి అన్ని విధాలా కృషి

- ఒంగోలు మెప్మాలో పూర్తిస్థాయి విచారణ
- అవినీతి తేలితే బాధ్యులపై కేసులు పెడతాం
- ఎమ్మెల్యే దామచర్ల



గ్రామ సచివాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జనార్దన్, పక్కన నాయకులు, అధికారులు

ఒంగోలు(రూరల్), నవంబరు30(ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధికి అన్ని విధాల కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ పేర్కొన్నారు. ఆదివారం ఒంగోలు మండలం మండవవారిపాలెం గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయం, రైతు సేవాకేంద్రాలను ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మండవ వెంకటసుబ్బయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ మండవవారిపాలెం గ్రామం నుంచి డ్రైనేజీ నీరు పోవటానికి అవసరమైన కాలువలు ఏర్పాటుకు నిధులు కేటాయిస్తామన్నారు. పిల్లర్‌బెడ్‌లు నిర్మిస్తామని, గ్రామం నుంచి మంగమ్మ కళాశాల వరకు రోడ్డు నిర్మాణం చేయిస్తానని గ్రామస్థులకు హామీ ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఆర్టీసీలో ఉచిత బస్సు ప్రయాణం ఎంతో ఉపయోగకరంగా ఉందని, పేద, ధనిక అనే తేడా లేకుండా సీఎం చంద్రబాబునాయుడు ఈ పథకాన్ని అమలు చేస్తున్నారని తెలిపారు. ఒంగోలు నగరం మెప్మాలో జరిగిన అవినీతిపై విచారణ జరుగుతోందన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో మెప్మాలో నిధులు నొక్కేసిన దానిపైన తమ ప్రభుత్వం పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం గ్రామస్థులు మాట్లాడుతూ గతంలో త్రోవగుంట గ్రామ పంచాయతీలో మండవవారిపాలెం ఉండేదని, తరువాత ప్రత్యేక పంచాయతీగా ఏర్పడిందన్నారు. అయితే భూములు మాత్రం త్రోవగుంట గ్రామ పరిధిలో ఉన్నాయని, త్రోవగుంట ఒంగోలు నగరంలో విలీనమైందని, మండవవారిపాలెం ఒంగోలు మండల పరిధిలో ఉందని చెప్పారు. అందువల్ల మండవవారిపాలెం పొలాలు త్రోవగుంట పరిధి నుంచి తొలగించి తమ గ్రామ పంచాయతీ పరిధిలో ఉండేలా చేయాలని కోరారు. దీనిపై ఎమ్మెల్యే దామచర్ల మాట్లాడుతూ ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్, రాజధాని అమరావతిలోని సంబంధిత అధికారులతో మాట్లాడి తగిన చర్యలు తీసుకుంటానని చెప్పారు. కార్యక్రమంలో డీపీవో ఎం.వెంకటేశ్వరరావు, ఎంపీడీవో కె.రాజశేఖరరావు, తహసీల్దార్ నాయబ్‌రసూల్, ఏఈ రామప్రసాద్, టీడీపీ నాయకులు కామేపల్లి శ్రీనివాసరావు, నల్లయోతు బాలగంగాధర్, గుండపనేని శ్రీనివాసులు, ఒంగోలు ఏఎంసీ చైర్మన్ రాచగర్ల వెంకట్రావు, ఉపసర్పంచ్ కాటూరి బాబురావు, కోమటినేని ఉదయభాస్కర్, మారెళ్ల రామకృష్ణ, కారుమూడి ప్రభాకర్, మారెళ్ల రాజేంద్రప్రసాద్, పొత్తూరి రాజా, పెండ్యాల సుబ్బారావు, ముప్పనేని హరిబాబు పాల్గొన్నారు.

తుఫాన్ దృష్ట్యా అప్రమత్తంగా ఉండాలి

ఒంగోలు కార్పొరేషన్: జిల్లాకు దిత్వా తుఫాన్ ముప్పు ఉన్న నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ కార్పొరేషన్, రెవెన్యూ ఆర్‌అండ్‌బీ, మత్స్యశాఖ ఇతర శాఖల అధికారులకు ఆదేశించారు. అలాగే మత్స్యకారులు వేటకు వెళ్ళకుండా ఉండాలని, ఎలాంటి ప్రమాదాలు చోటు చేసుకోకుండా పిల్లలను, పశువుల కాపరులు, రైతులు జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. ఒంగోలులోని పోతురాజు కాలువ వెంట నివసించే ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఏ సమస్య వచ్చినా టీడీపీ కార్యాలయంలో గానీ, స్థానిక టీడీపీ నాయకులు లేదా కార్పొరేషన్ అధికారులకు ఫోన్ చేసి సమాచారం అందించాలని ఆయన కోరారు.

దిత్వా తుఫాన్ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- ఎంపీ మాగుంట



కనపర్తి సముద్రతీరం వద్ద ప్రత్యేకాధికారి జోసఫ్‌కుమార్



గుండాయపాలెంలో మాట్లాడుతున్న తహసీల్దార్ రసూల్‌నాయబ్

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): దిత్వా తుఫాన్ పట్ల జిల్లాలోని ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి కోరారు. స్థానిక రామనగర్‌లోని ఎంపీ కార్యాలయంలో ఆదివారం విలేకరులతో ఆయన మాట్లాడారు. రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ఇచ్చిన సూచనలను ప్రతి ఒక్కరు పాటించాలన్నారు ప్రజలు ఏదైనా అత్యవసర పని ఉంటేనే బయటకు రావాలని కోరారు. తుఫాన్ ప్రభావంతో జిల్లా యంత్రాంగం అప్రమత్తమై ముందస్తు చర్యలు తీసుకుందన్నారు.

తీరప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

నాగులుప్పలపాడు: తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో తీరప్రాంత గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మండల ప్రత్యేకాధికారి జి.జోసఫ్‌కుమార్ సూచించారు. దిత్వా తుఫాన్ నేపథ్యంలో కనపర్తి తీర ప్రాంతంలో సముద్ర అలల ఉధృతిని ఆదివారం స్థానిక అధికారులతో కలిసి పరిశీలించారు. మేకలసోమయ్య పట్టపుపాలెం, చిన్నంగారిపట్టపుపాలెం, బీచ్‌పట్టపుపాలెం తదితర గ్రామాల్లో పర్యటించి అక్కడి ప్రజలతో మాట్లాడారు. మత్స్యకారులు సముద్రంలో చేపలవేటకు వెళ్లవద్దని సూచించారు. సోమవారం వరకు తుఫాన్ తీవ్రత కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ కె.ప్రవీణ్‌కుమార్, ఎంపీడీవో తేళ్ల రవికుమార్, ఏపీవో రవిబాబు, ఏఈ వీరాంజనేయులు, టీడీపీ నాయకులు చాట్ల నారాయణ తదితరులు పాల్గొన్నారు.

జాగ్రత్తలు పాటించాలి

మద్దిపాడు: తుఫాన్ నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ ఆదిలక్ష్మి తెలిపారు. గుండ్లకమ్మ రిజర్వాయర్, లోతట్టు గ్రామాల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని, దూర ప్రయాణాలు వాయిదా వేసుకోవాలని కోరారు. మండలంలోని కల్వర్టులు, వాగులు దాటేటప్పుడు జాగ్రత్తలు పాటించాలని, చేపల వేటను నిషేధమని చెప్పారు.

సముద్రంలోకి వేటకు వెళ్లొద్దు

ఒంగోలు(రూరల్): మత్స్యకారులు సముద్రంలోకి వేటకు వెళ్లవద్దని తహసీల్దార్ నాయబ్‌రసూల్ కోరారు. సముద్ర తీరప్రాంతమైన గుండాయపాలెంలో ఆదివారం ఆయన సిబ్బందితో కలిసి పర్యటించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాజశేఖరరావు పాల్గొన్నారు

తుఫాన్ ప్రభావం ప్రారంభం

కొండపి: దిత్వా తుఫాన్ ప్రభావం కొండపి ప్రాంతంలో ఆదివారం ఉదయం నుంచి ప్రారంభమైంది. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఓ మోస్తరు వర్షం పడింది. దిత్వా ప్రభావం వల్ల ఎంత వర్షం పడుతుందోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. రైతులు పొగమొక్కల నాట్లు ముమ్మరంగా వేస్తున్నారు. పొగాకుతోపాటు శనగ ఏతలు కూడా ఊపందుకున్నాయి. దీంతో వర్షం ప్రభావం ఈ పైర్లపై ఎంత వరకు ఉంటుందోనని సాగు చేసిన రైతులు ఆందోళన చెందుతున్నారు.

పోలీసుల తనిఖీలు

మద్దిపాడు, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): మల్లవరంలోని గుండ్లకమ్మ రిజర్వాయర్, అలాగే శ్రీవేంకటేశ్వర స్వామి సన్నిధిలో ఆదివారం పోలీసులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. ఎస్సై వెంకటసూర్య ఆధ్వర్యంలో డాగ్‌స్క్వాడ్‌తో తనిఖీలు చేపట్టారు. ఆర్ఎస్ఐ తిరుపతిస్వామి, బాంబ్ స్క్వాడ్ సిబ్బంది క్షుణ్ణంగా పరిశీలించారు.

కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

ఒంగోలు కార్పొరేషన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్ర స్థాయి కరాటే పోటీలలో ఒంగోలు విద్యార్థులు ప్రతిభ చాటినట్లు చీఫ్ కోచ్, సిద్ధార్థ కరాటే అకాడమీ ప్రధాన కార్యదర్శి నల్లూరి మోహన్‌రావు ఆదివారం తెలిపారు. రాజమండ్రిలో జరిగిన అంతర్ జిల్లాల ఎస్‌జీఎఫ్ పోటీలలో ఒంగోలు హైదరబీ క్లబ్ ఆవరణంలోని తమ అకాడమీలో శిక్షణ పొందుతున్న పి.యోగేంద్రరెడ్డి గోల్డ్ మెడల్, టి.యశ్వంత్ సిల్వర్, పి.శ్రీనివాస్ సిల్వర్, ఎం.నిఖిల్ సాయి సిల్వర్, వి.శ్రావణసంధ్య బ్రాంజ్ మెడల్ కైవసం చేసుకున్నారని ఆయన పేర్కొన్నారు. అలాగే సీనియర్స్ విభాగంలో శ్రీ ప్రతిభ విద్యాసంస్థలలో చదువుతున్న బి.సంతోష్, బ్రాంజ్, ఎస్.ఆనంద్‌కుమార్ సిల్వర్, ఎం.మణికంఠలు సిల్వర్ మెడల్ సాధించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రతినిధులు మండవ మురళీకృష్ణ, డాక్టర్ రాఘవ, మారెళ్ళ సుబ్బారావు, మండవ సుబ్బారావు, దన్నారపు మస్తాన్‌రావు, కోచ్ వి.వెంకటేశ్వర్లు నల్లూరి విద్యాసంస్థల చైర్మన్ నల్లూరి వెంకటేశ్వర్లు విజేతలను అభినందించారు.

ఆర్థికసాయం అందజేత

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రైవేటు పాఠశాలలో పనిచేస్తూ అనారోగ్యంతో మృతి చెందిన ఉపాధ్యాయుడు నగేష్‌బాబు కుటుంబానికి ప్రైవేటు టీచర్స్ లెక్చరర్స్ అండ్ ప్రొఫెసర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు అండగా నిలిచారు. ఆదివారం ఒంగోలులో నగేష్‌బాబు కుటుంబాన్ని కలిసి రూ.1.15లక్షల నగదును అందజేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు వై.సాంబశివరావు, జిల్లా కార్యదర్శి కిరణ్, నూరుద్దీన్, మాలకొండయ్య, వెంకటేశ్వర్లు, బాలాజీ, ఉదయ్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

మన్ కీ బాత్‌ను వీక్షించిన బీజేపీ నాయకులు

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆదివారం నిర్వహించిన మన్ కీ బాత్ కార్యక్రమాన్ని బీజేపీ నాయకులు వీక్షించారు. స్థానిక మంగమూరురోడ్డులోని కందుల నారాయణనాయుడు నగర్‌లో బీజేపీ రాష్ట్ర సెల్స్ కో కన్వీనర్ డాక్టర్ నిడమానూరి సూర్య కళ్యాణ్ చక్రవర్తి వీక్షించిన అనంతరం ప్రసంగించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు శెగ్గం శ్రీనివాసరావు, శివాజీ, దండు శ్రీనివాసరావు, కె.సతీష్, వంశీకృష్ణ, బాషా, బ్రహ్మారెడ్డి, నాగేశ్వరరెడ్డి, ప్రతాపరెడ్డి, వెంకటరావు, యాసిన్, ఏడుకొండలు, గోవర్ధన్‌రెడ్డి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

తుఫాన్‌తో రైతుల ఉరుకులు పరుగులు..

చీమకుర్తి, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): దిత్వా తుఫాన్ హెచ్చరికలు, ఓ వైపు చిరుజల్లులు పడుతుండటంతో మండల పరిధిలోని రైతులు ఆదివారం ఉరుకులు పరుగులు తీశారు. ముఖ్యంగా మొక్కజొన్న సాగు చేసిన రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. ఖరీఫ్‌లో మండల పరిధిలో విస్తృతంగా మొక్కజొన్న పంటను సాగుచేశారు. మొంథా తుఫాన్ బారినుంచి అష్టకష్టాలకు ఓర్చి పంటను కాపాడుకున్న రైతులకు పంట చేతికొచ్చిన తర్వాత దిత్వా తుఫాన్ గుబులురేపింది. కళ్లాల్లో చేతికొచ్చిన పంటను ఆరబోసి నేడోరేపో విక్రయించాల్సిన దశలో ఆకాశంలో మబ్బులు కమ్ముకోవటంతో రైతుల్లో ఆందోళన రేకెత్తించింది. కళ్లాల్లో ఉన్న సరుకును ఎంతోకొంతకు విక్రయిస్తున్నారు. మొక్కజొన్న పంటకు ప్రభుత్వం ప్రకటించిన గిట్టుబాటు ధర క్వింటా రూ.2250కి పైగా ఉండగా ప్రస్తుతం రైతుల పరిస్థితిని వ్యాపారులు సొమ్ముచేసుకొనే పనిలో ఉన్నారు. రూ.1700కు వారు కొనుగోలు చేస్తున్నారు. చేసేదేమి లేక చేతికొచ్చిన పంటను నిల్వచేసే పరిస్థితి లేక కళ్లాల్లోనే వచ్చిందే దక్కినట్లుగా రైతులు తెగనమ్ముకుంటున్నారు. సరైన మార్కెటింగ్ సౌకర్యం లేకపోవటంతో రైతులు నష్టాల ఊబిలో కూరుకుపోతున్నారు.

నేడు మల్లవరంలో గిరి ప్రదక్షిణ

మద్దిపాడు, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): మల్లవరం శ్రీవేంకటేశ్వరస్వామి సన్నిధిలో సోమవారం శ్రీవారి వనం ఆధ్వర్యంలో గిరి ప్రదక్షిణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు నిర్వాహకులు మార్నేని కృష్ణారావు తెలిపారు. ప్రతి శుక్ల పక్ష ఏకాదశి రోజున ఏకాహం భజన కార్యక్రమం, గిరి ప్రదక్షిణ నిర్వహించాలనే సంకల్పంతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని, అదేవిధంగా గోపూజ జరుగుతుందన్నారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.

మహాసభలను విజయవంతం చేయాలి

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): గుంటూరులో ఈనెల 8,9వ తేదీల్లో జరగనున్న అఖిల భారత కార్మిక సంఘాల సమాఖ్య(న్యూ), ఏఐఎఫ్‌టీయూ (న్యూ) రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని సంఘం రాష్ట్ర కోశాధికారి డీవీఎస్.స్వామి పిలుపునిచ్చారు. ఒంగోలు నగరం ఈమనిపాలెంలోని తరిమెల నాగిరెడ్డి భవన్‌లో ఆదివారం రాష్ట్ర మహాసభల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులను లేబర్ కోడ్‌ల పేరుతో రద్దు చేసిన కేంద్ర ప్రభుత్వ విధానాలను తిప్పికొట్టాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఎంఎస్.సాయి, ఐ.విజయసారథి, సుల్తాన్‌బాషా, హనుమంతరావు, బి.రామారావు, జీవీ.నారాయణ, కోడూరి కోటేశ్వరరావు, బక్కా శ్రీను తదితరులు పాల్గొన్నారు.





పీఆర్ నూతన కార్యవర్గం ఎన్నిక



నూతనకార్యవర్గ సభ్యులను సత్కరిస్తున్న ప్రతినిధులు

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలు నగరంలో పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖ ప్రకాశం జిల్లా అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం జరిగిన ఈ కార్యక్రమానికి ఎన్నికల అధికారిగా జీ ఈశ్వరరెడ్డి వ్యవహరించారు. అధ్యక్షుడిగా కే కృష్ణమోహన్(సంతనూతలపాడు), ప్రధాన కార్యదర్శిగా ఎంవీ విజయమోహన్‌రాజా(మార్కాపురం), ఉపాధ్యక్షులుగా వీ మాలకొండయ్య(కందుకూరు), కోశాధికారిగా ఎస్ వెంకటేశ్వర్లు(మార్కాపురం), ఆర్గనైజింగ్ సెక్రటరీగా బీ బ్రహ్మయ్య(కనిగిరి)లు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు కే సంగీతరావు, ప్రధాన కార్యదర్శి ఆర్ శ్రీనివాసరావు, పంచాయతీరాజ్ ఎస్ఈ జీ అశోక్‌లు పాల్గొన్నారు. ఈసందర్భంగా కార్యవర్గ సభ్యులను సత్కరించారు.

ట్రెజరీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా రాజ్‌కుమార్ ఎన్నిక



రాజ్‌కుమార్‌కు నియామక పత్రాన్ని అందజేస్తున్న సూర్యనారాయణ తదితరులు

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ ఖజానా, లెక్కలశాఖ సర్వీసెస్ అసోసియేషన్ (ట్రెజరీ అసోసియేషన్) రాష్ట్ర అధ్యక్షుడిగా జిల్లాకు చెందిన కాజా రాజ్‌కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఒంగోలులోని జిల్లా ట్రెజరీ కార్యాలయంలో అసిస్టెంట్ ట్రెజరీ అధికారి(ఏటీవో)గా రాజ్‌కుమార్ పనిచేస్తున్నారు. విజయవాడలో ఆదివారం జరిగిన అసోసియేషన్ కార్యవర్గ సమావేశంలో ఈనూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా జీ రవికుమార్, ప్రధాన కార్యదర్శిగా బీ శ్రీనివాసరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీగా కృష్ణంరాజు, ఉపాధ్యక్షులుగా కేవీ సురేష్‌బాబులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జరిగిన సభలో రాజ్‌కుమార్ మాట్లాడుతూ తనను రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నుకునేందుకు సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా రాజ్‌కుమార్‌కు ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేఆర్ సూర్యనారాయణ నియామక పత్రాన్ని అందజేశారు. అనంతరం కమిటీని సన్మానించారు.

ఏడాదిన్నరైనా జర్నలిస్టులకు అక్రిడిటేషన్స్ ఇవ్వకపోవడం శోచనీయం

ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు ఐవీ సుబ్బారావు



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు సుబ్బారావు

మార్కాపురం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర అవుతున్నా జర్నలిస్టులకు అక్రిడిటేషన్స్ ఇవ్వకపోవడం శోచనీయమని ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు ఐవీ సుబ్బారావు అన్నారు. మార్కాపురం ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జర్నలిస్టులకు న్యాయంగా దక్కాల్సిన గుర్తింపు కార్డులనే సంవత్సరన్నరకు కూడా ఇవ్వకుంటే సంక్షేమానికి ఎలాంటి చర్యలు తీసుకుంటారని ప్రశ్నించారు. అసలు కొత్త అక్రిడిటేషన్లు ఇచ్చే ఉద్దేశం సమాచార శాఖ మంత్రికి ఉందా అని నిలదీశారు. నూతన గుర్తింపు కార్డులను 2026 జనవరి 1వ తేదీకల్లా ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేకపోతే ఉద్యమించాల్సి వస్తుందని హెచ్చరించారు. విలేకరుల సమావేశంలో ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు మూల అల్లూరిరెడ్డి, జిల్లా అధ్యక్షుడు ఎన్‌వీ రమణ, జిల్లా కోశాధికారి దారివేముల శరణ్‌కుమార్ పాల్గొన్నారు.

ఆసుపత్రిలో చికిత్స పొందుతూ రైతు మృతి



సత్యనారాయణరెడ్డి (ఫైల్)

మార్కాపురం రూరల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడి ఒంగోలులో చికిత్స పొందుతూ రైతు మృతి చెందిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. గ్రామస్థులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మార్కాపురం మండలం కోలభీమునిపాడు గ్రామానికి చెందిన రైతు మందా సత్యనారాయణరెడ్డి(45) కౌలుకు పొలం తీసుకుని 12 ఎకరాలలో పత్తి, 2 ఎకరాలలో మిరప పంటలను సాగు చేస్తున్నారు. లక్షల రూపాయలు అప్పులు చేసి పెట్టుబడులు పెట్టాడు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పత్తి దెబ్బతింది. మనస్తాపానికి గురై గత నెల 26న పొలంలోనే పురుగు మందు తాగారు. వెంటనే కుటుంబ సభ్యులు గమనించి మార్కాపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం ఒంగోలు ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందారు. సత్యనారాయణరెడ్డికి భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడున్నారు. కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్ఐ అంకమ్మరావు తెలిపారు.

లక్షకు మూడు లక్షలు వస్తాయని...

అత్యాశకు పోగా మొదటికే మోసం

రూ.8లక్షలు పోగొట్టుకున్న బాధితులు.. కారంపూడిలో కేసు

త్రిపురాంతకం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ఇద్దరు వ్యక్తులు అత్యాశకు పోయారు. లక్షలకు మూడు లక్షలు సంపాదించవచ్చని భావించి ఏకంగా రూ.8లక్షలు పోగొట్టుకున్న ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గత నెల 27న జరిగిన ఈ ఘటనకు సంబంధించి తెలిసిన వివరాలు ఇలా.. త్రిపురాంతకానికి చెందిన ఇద్దరు వ్యక్తులకు పల్నాడు జిల్లా పిడుగురాళ్లకు చెందిన ఒక వ్యక్తితో పరిచయం ఉంది. అక్కడి వ్యక్తి తనవద్ద నకిలీ కరెన్సీ ఉందని లక్షకు మూడు లక్షలు ఇస్తానని నమ్మబలికాడు. అధిక లాభం పొందవచ్చని ఆశపడిన ఆ ఇద్దరు తమ వద్ద ఉన్న రూ.8లక్షలు తీసుకెళ్లి అక్కడి వ్యక్తికి ఇచ్చేందుకు వెళ్లగా చిన్నగార్లపాడు సమీపంలో నిర్మానుష్య ప్రదేశానికి తీసుకెళ్లి ఇక్కడ రహస్యంగా లెక్కించుకోవచ్చని వారిని మభ్యపెట్టి ఆ డబ్బుతో ఉడాయించినట్లు తెలిసింది. దీంతో అసలుకే ఎసరు వచ్చిందని లబోదిబోమంటూ బాధితులు కారంపూడి పోలీసులను ఆశ్రయించి మోసగాడి పేరు శ్రీను అని ఫిర్యాదు చేశారు. ఫిర్యాదుదారుడి పేరు సతీష్ తండ్రి పుల్లారావుగా పోలీసుల ఎఫ్ఐఆర్‌లో నమోదై ఉంది. ఈ ఉదంతంపై తమకు ఎటువంటి సమాచారం లేదని త్రిపురాంతకం ఎస్ఐ శివబసవరాజు తెలిపారు. ఈ విషయాన్ని పల్నాడు పోలీసులు సీరియస్‌గా విచారణ జరుపుతూ ఈ వ్యాపారం ఎలా ఎప్పుడెప్పుడు జరిగిందనే కోణంలో చూస్తున్నట్లు తెలిసింది.

అసలైన మందు అవగాహనే!





జిల్లాలో క్రమేపీ తగ్గిన హెచ్ఐవీ బాధితులు

నేడు వరల్డ్ హెచ్ఐవీ దినం

జిల్లా వ్యాప్తంగా అవగాహన ర్యాలీలు

ఒంగోలు కార్పొరేషన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : తెలిసో తెలియకో దొర్లిన పొరపాటుకు కొందరు అర్థంతరంగా ప్రాణాలను పోగొట్టుకోగా, మరికొన్నిచోట్ల తల్లిదండ్రులను కోల్పోయి ఎందరో చిన్నారులు అనాథలుగా మారిన ఘటనలు అనేకం ఉన్నాయి. ఒకప్పుడు ప్రపంచాన్ని వణికించిన హెచ్ఐవీ ప్రస్తుతం కొంతమేర తగ్గింది. పూర్తి స్థాయిలో అవగాహనతోనే హెచ్ఐవీని నియంత్రించవచ్చు. ఆ దిశగా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. హెచ్ఐవీకి వ్యతిరేకంగా ఏటా డిసెంబరు 1న ప్రపంచ ఎయిడ్స్ దినం పాటిస్తున్నారు. ఈ సందర్భంగా ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం.

● జిల్లాలో బాధితులకు అందుతున్న సేవలు..

హెచ్ఐవీని పూర్తిస్థాయిలో నిర్మూలించలేకున్నా అవగాహన పెంచి, అపోహలు తొలగించేందుకు జిల్లా లెప్రసీ, క్షయ, హెచ్ఐవీ/ఎయిడ్స్ నియంత్రణ శాఖ వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోంది. జిల్లాలో ప్రస్తుతం 10 సమగ్ర కౌన్సెలింగ్ అండ్ టెస్టింగ్ సెంటర్లు ఉండగా, రెండు ఏఆర్టీ(యాంటీ రెట్రో వైరల్ థెరపీ) కేంద్రాలు నడుస్తున్నాయి. ఇవిగాక ఒక ఏఆర్టీ ప్లస్ సెంటర్, ఎనిమిది లింక్ ఏఆర్టీ సెంటర్‌లు, అలాగే ఐదు టీఐ ఎన్జీవోలు, తొమ్మిది బ్లడ్ బ్యాంకులు కొనసాగుతున్నాయి. అలాగే మూడు డీఆర్ఆర్‌సీ కేంద్రాలు, ఒక కేర్ సపోర్ట్ సెంటర్‌లు, ఆరు లింక్ వర్క్ పథకం, ఒక మొబైల్ ఐసీటీసీ, మరొక సంపూర్ణ సురక్షా కేంద్రం, ఒక జైలు జోక్యం సెంటర్ ద్వారా సేవలు అందుతున్నాయి.

● తగ్గిన బాధితుల సంఖ్య

2017-18లో 92,014 మందికి హెచ్ఐవీ పరీక్ష చేయగా 2086 (2.26%) మందికి పాజిటివ్‌గా తేలింది. ఇదిలా ఉండగా 2025లో ఏప్రిల్ నుంచి అక్టోబరు వరకు స్వచ్ఛంద పరీక్షలు 59,612 మందికి చేయగా, 336 మందికి పాజిటివ్(0.56%) నిర్ధారణ అయింది. ఇతర పరీక్షలతోపాటు గర్భిణులందరికీ హెచ్ఐవీ పరీక్ష చేయడం తప్పనిసరి కావడంతో ఈ ఏడాది ఒక్క అక్టోబరు నెలలోనే 20,119 మందికి పరీక్ష చేయగా, 18 మందికి పాజిటివ్ వచ్చింది.



● ఐసీటీసీ ద్వారా సేవలు విస్తృతం

హెచ్ఐవీతో బాధపడేవారు ఒంగోలు వచ్చేందుకు ఇబ్బందులు పడకుండా ఉండేందుకు గత నెల 14న కలెక్టర్ రాజాబాబు ఆధ్వర్యంలో మొబైల్ ఐసీటీసీని ప్రారంభించారు. ఇది మారుమూల ప్రాంతాలలో బాధితులకు సేవలందించడంతోపాటు పేర్నమిట్ట రూరల్, దర్శి, పొదిలి, మార్కాపురం, తర్లుపాడు, కంభం, కనిగిరి, సింగరాయకొండ, కొత్తపట్నం మండలాలలో 534 మందికి రక్తపరీక్షలు చేయగా, ఇద్దరికి పాజిటివ్ సోకినట్లుగా గుర్తించారు.

● ఏఆర్టీ సెంటర్‌ల ద్వారా సంరక్షణ

ఒంగోలు, మార్కాపురంలోని రెండు ఏఆర్టీ సెంటర్‌ల సంరక్షణలో 2025 అక్టోబరు వరకు 15,406 మంది హెచ్ఐవీ సోకిన వారు ఉన్నారు. వీరిలో 206 మంది పిల్లలు, 1430 మంది వ్యక్తులు చికిత్స పొందుతున్నారు.

ఎయిడ్స్ నియంత్రణకు విస్తృతంగా అవగాహన



డాక్టర్ జి. బాలాజీ
జిల్లా లెప్రసీ, క్షయ అండ్ ఎయిడ్స్ నియంత్రణ అధికారి

జిల్లాలో గత ఐదేళ్లతో పోల్చుకుంటే ఈ ఏడాది అతి తక్కువ సంఖ్యలో పాజిటివ్ కేసులో నమోదయ్యాయి. ప్రజలకు అవగాహన కల్పించేందుకు వివిధ రూపాల్లో, వివిధ శాఖల సహకారంతో ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. ప్రతి నెలా 500 మందికి దాతల సహకారంలో హెచ్ఐవీతో జీవిస్తున్న వ్యక్తులకు పోషకాహారం పంపిణీ చేస్తున్నాం.

● నేడు జిల్లా వ్యాప్తంగా అవగాహన ర్యాలీలు

ప్రపంచ ఎయిడ్స్ దినం సందర్భంగా సోమవారం ఉదయం 9గంటల నుంచి ఒంగోలు నగరంలోని అద్దంకి బస్టాండ్ సెంటర్ నుంచి నెల్లూరు బస్టాండ్ సెంటర్ మీదుగా ఎన్జీవో హోమ్ వరకు ర్యాలీ నిర్వహించి, అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. జిల్లా వ్యాప్తంగా పలు వైద్యశాలల్లో అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

ఎలాంటి పరిస్థితి వచ్చినా ఎదుర్కొంటాం

యంత్రాంగం సర్వం సిద్ధం

కంట్రోలు రూము ఏర్పాటు

వరి కోతలను వాయిదా వేసుకోవాలి

కలెక్టర్ రాజాబాబు వెల్లడి



మాట్లాడుతున్న కలెక్టర్ రాజాబాబు, పక్కన డీఆర్వో చిన ఓబులేశు, ఎన్‌డీఆర్ఎఫ్ కమాండర్ దిల్బాగ్ సింగ్

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన దిత్వా తుఫాన్ ప్రభావంతో సోమ, మంగళవారాల్లో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో జిల్లా యంత్రాంగం పూర్తి స్థాయిలో అప్రమత్తంగా ఉందని కలెక్టర్ రాజాబాబు చెప్పారు. స్థానిక కలెక్టరేట్‌లోని దిత్వా తుఫాన్ కంట్రోలు రూములో ఆదివారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలోని తీర ప్రాంతంతోపాటు సమీపంలోని 14 మండలాలపై తుఫాన్ ప్రభావం ఉంటుందన్నారు. కనిగిరి, కొండపి, కొత్తపట్నం, మద్దిపూడి, మద్దిపాడు, ఒంగోలు, నాగులుప్పలపాడు, పామూరు, పీసీపల్లి, పొన్నలూరు, సంతనూతలపాడు, టంగుటూరు, సింగరాయకొండ, జరుగుమల్లి మండలాల్లో తీవ్రమైన గాలులతో కూడిన వర్షాలు పడే అవకాశం ఉందని చెప్పారు. అందుకోసం ప్రత్యేక అధికారులను ఆయా మండలాలను నియమించామన్నారు. క్షేత్ర స్థాయిలో పరిస్థితిని ఎప్పటికప్పుడు పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకునే విధంగా ఆదేశించినట్లు చెప్పారు. మొంథా తుఫాన్ నేపథ్యంలో ఎదురైన అనుభవాలను పరిగణనలోకి తీసుకొని ప్రస్తుత ప్రభావిత ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. ఒంగోలు నగరంలోని పోతురాజుకాలువ, నల్లకాలువ ప్రవాహానికి ఎలాంటి అడ్డంకులు లేకుండా చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. జిల్లా యంత్రాంగానికి సహకరించేలా 30 మందితో కూడిన జాతీయ విపత్తుల నిర్వహణ బృందం కూడా అందుబాటులో ఉందన్నారు. చేపల వేటకు వెళ్లవద్దని మత్స్యకారులను కోరారు. తుఫాన్ ప్రభావం ఉన్నందున ఐదు రోజుల పాటు వరి కోతలను రైతులు వాయిదా వేసుకోవాలని కోరారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కలెక్టరేట్‌లో 24 గంటల పాటు పనిచేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. అందుకోసం ఆయాశాఖల సిబ్బందిని నియమించినట్లు తెలిపారు. కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన 08592-281400 నెంబర్‌కు ఫోన్ చేసి సమాచారం అందిస్తే వెంటనే చర్యలు తీసుకుంటామన్నారు. అత్యవసరం కోసం కలెక్టరేట్‌లో 1077తో టోల్‌ఫ్రీ నెంబరును కూడా ఏర్పాటు చేశామని ప్రజల నుంచి వచ్చే సమస్యలను సంబంధిత శాఖల అధికారులకు పంపుతామని తెలిపారు. సమావేశంలో డీఆర్వో చిన్నఓబులేశు, ఎన్‌డీఆర్ఎఫ్ కమాండర్ దిల్బాగ్ సింగ్ పాల్గొన్నారు.

కంట్రోల్ రూం నంబరు 9440817491

తుఫాన్‌పై అప్రమత్తమైన విద్యుత్ శాఖ..ఉద్యోగులకు సెలవుల రద్దు

ఒంగోలు క్రైం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి) : దిత్వా తుఫాన్ కారణంగా విద్యుత్ శాఖలో సిబ్బందికి 3 రోజులపాటు సెలవులు రద్దు చేసినట్లు ఎస్ఈ కట్టా వెంకటేశ్వర్లు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సిబ్బంది వారి ప్రధాన కార్యాలయంలో అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అన్నారు.

- వర్షం పడుతున్నప్పుడు. నీటిలో విద్యుత్ స్తంభాలు ఉన్నపుడు వాటిని తాకకూడదని హితవు పలికారు.
- రైతులు వారి విద్యుత్ మోటార్లు వినియోగంలో జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.
- గాలులు వీచే సమయంలో స్తంభాల కింద ఉండకూడదు.
- కరెంట్ తీగలు తెగిపడినా, స్తంభాలు విరిగిపడినా వెంటనే కంట్రోలు రూం నంబరు 9440817491, 08592233248లను సంప్రదిచాలి.

నేడు 'మీ కోసం' రద్దు

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : బంగాళాఖాతంలో ఏర్పడిన దిత్వా తుఫాన్ కారణంగా సోమవారం ఒంగోలులోని ప్రకాశం భవన్‌లో నిర్వహించాల్సిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (మీకోసం)ను రద్దు చేసినట్లు కలెక్టర్ పి.రాజాబాబు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు ఈవిషయాన్ని గమనించి ఒంగోలు రావద్దని సూచించారు. మీ కోసం కాల్ సెంటర్ 1100 సేవలను వినియోగించుకోవాలని కోరారు.

నేడు పోలీసు గ్రీవెన్స్ రద్దు

ఒంగోలు క్రైం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించాల్సిన మీకోసంను రద్దు చేసినట్లు ఇన్‌చార్జి ఎస్పీ ఉమామహేశ్వరరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. భారీ వర్షాలతోపాటు ఈదురు గాలులు వీచే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు.

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్

HOUSE FOR SALE

n కొండపి (మం), కె.ఉప్పలపాడు గ్రామంలోని 6 సెంట్లలో కన్‌స్ట్రక్షన్ జరిగిన డూప్లెక్స్ హౌస్ అమ్మబడును. Price : 95 లక్షలు, నెగోష బుల్ కలదు, సెల్: 99590 53803.

AJO-241215

వర్కర్స్ కావలెను

n ఒంగోలు శ్రీ వెంకటేశ్వర టెక్స్‌టైల్స్ ఏనుగుచెట్టు సెంటర్, సౌత్ స్ట్రీట్‌లోని హోల్‌సెల్ షాపు నందు వర్కర్స్‌గా పనిచేయుటకు బాయ్స్ & గర్ల్స్ కావలెను. ఆకర్షణీయమైన జీతం కలదు. వెంటనే సంప్ర: 93924 51999

AJO-0268077

బిజినెస్ ఆఫర్

n తక్షణం వ్యాపార భాగస్వాములు వెతుకుతున్నాము. అవకాశాన్ని కొల్పోకండి. సంప్రదించండి. RSJ Inspection Service Ltd. Cell:8595924917,8800629648.

AJA-257588

క్లాసిఫైడ్ ప్రకటన
బ్లాక్ & వైట్ 4 లైన్లు
రూ. 190/-
ప్రతి అదనపు లైనుకు రూ.45/-
కలర్ 4 లైన్లు
రూ. 220/-
ప్రతి అదనపు లైనుకు రూ.50/-
5% GST అదనం

పాఠకులకు ముఖ్య గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు,చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/ యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడీవీటీ

తెలుగు పునర్వైభవానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

మండలి వెంకట కృష్ణారావు భాషా సేవ అజరామరం

మాజీ జేడీ లక్ష్మీనారాయణ

ఘనంగా కళామిత్ర మండలి వార్షికోత్సవం



లక్ష్మీనారాయణను సన్మానిస్తున్న ఎమ్మెల్యేలు బుద్ధప్రసాద్, జనార్దన్, మాజీ ఎమ్మెల్యే గరటయ్య, అంకమ్మరావు, అరుణ, నరసమ్మ, ప్రసాద్‌బాబు

ఒంగోలు కల్చరల్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి) : తెలుగుభాష పునర్వైభవానికి అటు సాహిత్యవేత్తలు, ఇటు సాహిత్యాభిమానులే కాకుండా సమాజంలో ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సీబీఐ మాజీ జాయింట్ డైరెక్టర్ లక్ష్మీనారాయణ చెప్పారు. ఒంగోలు ఎన్టీఆర్ కళాక్షేత్రంలో ఆదివారం నిర్వహించిన కళామిత్ర మండలి తెలుగు లోగిలి వార్షికోత్సవ సభలో ముందుగా తెలుగుతల్లి చిత్రపటానికి పూలమాల సమర్పించారు. అదేవిధంగా దివంగత మండలి వెంకట కృష్ణారావు శతజయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి కూడా పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం సంస్థ అధ్యక్షుడు డాక్టర్ నూనె అంకమ్మ రావు అధ్యక్షతన జరిగిన సభలో లక్ష్మీనారాయణ మాట్లాడుతూ తెలుగు భాషాభివృద్ధికి, రైతుల అభ్యున్నతికి కృషిచేసిన మహనీయుడు మండలి అని, దివిసీమ ఉప్పెన సందర్భంగా ఆయన నిద్రాహారాలు మాని దేశవిదేశాల నుంచి విరాళాలు సేకరించి తీరగ్రామాల ప్రజలను ఆదుకున్నారని గుర్తుచేశారు. శాసనసభ్యులు జనార్దన్ మాట్లాడుతూ తెలుగు భాష కోసం ఎంతో కృషి చేసిన వెంకటకృష్ణారావు వారసత్వాన్ని పుణికిపుచ్చుకున్న ఆయన కుమారుడు బుద్ధప్రసాద్ తెలుగు భాషకు చేస్తున్న కృషి అభినందనీయమని అన్నారు. అవనిగడ్డ శాసనసభ్యులు బుద్ధప్రసాద్, అవార్డ్ కమిటీ ఛైర్‌పర్సన్ తేళ్ల అరుణ ప్రసంగించారు. అనంతరం లక్ష్మీనారాయణను వారు నూనె వెంకాయమ్మ వెంకటరత్నం స్మారక జీవన సాఫల్య పురస్కారంతో సన్మానించారు. అదేవిధంగా డాక్టర్ నాగభైరవ, డాక్టర్ మండవ నరసింహారావు స్మారక ప్రతిభా పురస్కారాన్ని డాక్టర్ కందిమళ్ల సాంబశివరావుకు, కొంపల్లి బాలకృష్ణ స్మారక ప్రతిభా పురస్కారాన్ని బండ్ల మాధవరావుకు, భూసురపల్లి సుబ్బరత్నం ఆదిశేషయ్య స్మారక ప్రతిభా పురస్కారాన్ని డాక్టర్ ఇరపని మాధవికి అందజేశారు. అదేవిధంగా కరణం జ్ఞానేశ్వరి, పాతూరి అన్నపూర్ణ, డాక్టర్ హరికిషన్, పుట్టంరాజు శ్రీరామ చంద్రమూర్తి, దార్ల వెంకటేశ్వర రావు, డాక్టర్ డి.ధాత్రికుమారి, డాక్టర్ బాచిన చెంచుగరటయ్యలను సైతం సాహితీ ప్రతిభా పురస్కారాలతో సత్కరించారు. సభలో వీరవల్లి సుబ్బారావు, మండవ మురళీకృష్ణ, గుత్తికొండ సుబ్బారావు, జి.వి.పూర్ణచంద్, డాక్టర్ నాగభైరవ ఆదినారాయణ, కొల్లా నారాయణ, యం.కొండయ్య, కుర్రా ప్రసాద్‌బాబు పాల్గొన్నారు. సంస్థ ప్రధాన కార్యదర్శి జ్యోతిర్మయి సంస్థ నివేదికను ప్రవేశపెట్టారు. అనంతరం 60 మంది కవులతో కవిసమ్మేళనం, చందూ డాన్స్ అకాడమీ విద్యార్థులచే ఏర్పాటుచేసిన నృత్యప్రదర్శనలు అలరింపజేశాయి. బీరం అరుణ, నాళం నరసమ్మ, పి.గోవర్ధన్ రెడ్డి తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

సుబ్బరామన్న ఆశయాలను కొనసాగించడమే లక్ష్యం

ఒంగోలు ఎంపీ మాగుంట



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి) : ఒంగోలు ఎంపీ దివంగత మాగుంట సుబ్బరామరెడ్డి ఆశయాలను కొనసాగించడమే లక్ష్యంగా మాగుంట కుటుంబం నిరంతరం పనిచేస్తోందని ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి చెప్పారు. స్థానిక పీవీఆర్ గ్రౌండ్‌లో సుబ్బరామరెడ్డి వర్ధంతి ఏర్పాట్లను ఆదివారం సాయంత్రం మాగుంట రాఘవరెడ్డి, నిఖిల్‌రెడ్డిలతో కలిసి ఎంపీ మాగుంట పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడ జరుగుతున్న ఏర్పాట్లు పరిశీలించి పలు సూచనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వెనుకబడిన పశ్చిమ ప్రాంతానికి సేవలు అందించేందుకు మాగుంట సుబ్బరామరెడ్డి రాజకీయ ప్రవేశం చేశారన్నారు. జిల్లా ప్రజలకు తాగునీరుతో పాటు విద్య, వైద్యాన్ని అందించారని చెప్పారు. ఆయన ఆశయ సాధనలను ముందుకు తీసుకెళ్లేందుకు మాగుంట కుటుంబం ఎప్పుడూ పనిచేస్తోందన్నారు.ఏటా ఆనవాయితీగా సుబ్బరామరెడ్డి వర్ధంతి రోజున వర్షం వస్తుందని చెప్పారు. ఆదివారం జరిగే వర్ధంతిలో ప్రజలందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. మాగుంట వెంట మునిసిపల్ కమిషనర్ వెంకటేశ్వరరావు, బెజవాడ సురేష్‌రెడ్డి, తాతా ప్రసాద్, ఘనశ్యాం, బెల్లం సత్యం, కుప్పా రంగసాయి, సరస్వతి కళాశాలల ఛైర్మన్ ఏవీ రమణారెడ్డి, ఆత్మకూరి బ్రహ్మయ్య, కండే శ్రీనివాసులు, మల్లికార్జునరెడ్డి, డాక్టర్ మురళీధరరెడ్డి ఉన్నారు.





పోలేరమ్మకు ఆదివారం జాతర

మార్కాపురం వన్‌టౌన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : మార్కాపురం పట్టణ శివారులలో వెలసియున్న అల్లూరి పోలేరమ్మ ఆలయంలో ఆదివారం అమ్మవారికి జాతర వైభవంగా నిర్వహించారు. అర్చకులు అమ్మవారిని నిమ్మకాయ దండలు, వివిధ పుష్పమాలలతో అలంకరించారు. మహిళలు పొం గళ్లు వండి నైవేద్యం సమర్పించి నాగుల పుట్టలో పాలు పోశారు. ఈవో ఈదుల చెన్నకేశవరెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. భక్తులు కుంకుమ బండ్లు కట్టి మొక్కులు తీర్చుకున్నారు.

పేదలకు ఆపన్నహస్తం

- సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీలో ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి
- 63 మందికి రూ.43.80లక్షలు అందజేత

గిద్దలూరు టౌన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధపడే వారికి ముఖ్యమంత్రి సహాయనిధి ఒక ఆపన్న హస్తమని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి తెలిపారు. ఆదివారం స్థానిక టీడీపీ కార్యాలయంలో నియోజకవర్గంలోని 63 మందికి రూ.43,80,714 ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి మాట్లాడుతూ పేదలకు నాణ్యమైన వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ప్రస్తుతం పట్టణాల్లోని కార్పొరేట్ ఆసుపత్రుల్లో పేదవారు నాణ్యమైన వైద్యం పొందవచ్చన్నారు. వారికి అయిన ఖర్చును ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి పొందవచ్చన్నారు. అనారోగ్య సమస్యలతో అనేక మంది పేదలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వారికి అండగా నిలువాలన్నదే సీఎం చంద్రబాబు లక్ష్యమన్నారు. ఇప్పటివరకు నియోజకవర్గంలోని 710 మంది నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ.6,28,25,619 పంపిణీ చేశామన్నారు. ప్రభుత్వం చేస్తున్న మంచి పనిని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలన్నారు. కార్యక్రమంలో కంభం మార్కెట్‌యార్డు చైర్మన్ పూనూరి భూపాల్ రెడ్డి, పట్టణ, మండల పార్టీల అధ్యక్షులు సయ్యద్ షానేషావలి, మార్తాల సుబ్బారెడ్డి, రాచర్ల మండల పార్టీ అధ్యక్షులు కటికె యోగానంద్ పాల్గొన్నారు.



ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను అందిస్తున్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

దిత్వా తుఫాన్ పట్ల అప్రమత్తం

ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

నియోజకవర్గ ప్రజలు దిత్వా తుఫాన్ పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి అన్నారు. తుఫాన్‌ను ఎదుర్కొనేందుకు అధికార యంత్రాంగం ఇప్పటికే సిద్ధంగా ఉందన్నారు. మొంథా తుఫాన్ అధికారుల సహాయంతో సమర్థవంతంగా ఎదుర్కొన్నామని ఎమ్మెల్యే గుర్తు చేశారు. దిత్వా తుఫాన్‌ను కూడా ఎదుర్కొనేందుకు అన్ని ముందస్తు ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. ప్రజలు అధైర్యపడవద్దని అశోక్ రెడ్డి అన్నారు.

జిల్లా ఏర్పాటు అభినందనీయం

రాచర్ల, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : మార్కాపురం జిల్లా ఏర్పాటు అభినందనీయమని జనసైనికులు అన్నారు. జిల్లా ఏర్పాటుకు తనవంతు కృషి చేసిన గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డిని వారు ఆదివారం గిద్దలూరు పట్టణంలోని ఎమ్మెల్యే నివాసంలో కలిసి అభినందనలు తెలిపి ఘనంగా సన్మానించారు. గిద్దలూరు నియోజకవర్గ అభివృద్ధికి మరింత కృషిచేయాలని అర్హులందరికీ సంక్షేమ పథకాలు, నిరుద్యోగులకు ఉద్యోగాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. కార్యక్రమంలో శంకర్‌నాయుడు, చిన్న రంగస్వామి, ప్రసాద్, పెద్దిరాజు, మధుసూధన్ రెడ్డి, తిరుపాల్ పాల్గొన్నారు.

నేడు గీతా జయంతి వేడుకలు

గిద్దలూరు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని కుసుమ హరనాథ మందిరం ఆవరణలో గల రాధాకృష్ణ మందిరంలో డిసెంబరు 1వ తేదీ సోమవారం గీతా జయంతి వేడుకలను నిర్వహిస్తున్నట్లు సత్యసాయి ధ్యానమండలి అధ్యక్షుడు బచ్చు వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా రాధాకృష్ణకు అభిషేకం, అష్టోత్తర శతనామావలి పూజ, 18 అధ్యాయాల గీతాపారాయణం, ఆధ్యాత్మిక గురువులచే ఆధ్యాత్మిక సందేశాలు ఉంటాయని పేర్కొన్నారు.

మూడు కేసుల నమోదు

మార్కాపురం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ట్యాక్స్ చెల్లించని, ఫిట్‌నెస్ సర్టిఫికెట్ లేని మూడు వాహనాలపై కేసులు నమోదు చేసినట్లు మార్కాపురం మోటారు వాహనాల తనిఖీ అధికారి (ఎంవీఐ) ఎం.మాధవరావు తెలిపారు. 9 నెలలుగా ట్యాక్స్ చెల్లించకుండా తిరుగుతున్న ఓ ప్రైవేటు బస్సును సీజ్ చేసి రూ.98,365 అపరాధ రుసుం విధించామన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

గిద్దలూరు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని శ్రీవివేకానంద కళాశాలకు చెందిన 1983-85-88 బ్యాచ్ పూర్వ విద్యార్థులు సమావేశమయ్యారు. త్వరలో జరుగబోయే మెగా సమ్మేళనం గురించి చర్చించారు. అనంతరం పట్టణంలోని సంజీవని వృద్ధాశ్రమం, మానసిక దివ్యాంగుల పాఠశాలలకు వెళ్లి 200 కిలోల బియ్యం, 50కిలోల కందిపప్పు, ఇతర నిత్యవసర సరుకులను అందచేశారు. వృద్ధాశ్రమం, దివ్యాంగుల పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఆయా కార్యక్రమాలలో పూర్వ విద్యార్థుల సంఘం ప్రతినిధులు కాశయ్య, సుబ్బరాయుడు, సుబ్బారావు, హబీబ్‌ఖాన్, ప్రసాద్ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న విద్యార్థుల ప్రదర్శన

మార్కాపురం వన్‌టౌన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): కమలా హైస్కూల్‌లో ఆదివారం విద్యార్థులతో ట్రేడ్ ఎక్స్ అనే వ్యాపార ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డా.స్వరూప్ రంజన్ మాట్లాడుతూ.. పాఠశాల దశలోనే విద్యార్థులు రిటైల్ కార్యాకలాపాల విజ్ఞానం నేర్చుకోవటానికి ఈ ప్రదర్శన దోహదపడుతుందన్నారు. విద్యార్థులలో సృజనాత్మక ఆలోచన విధానం, సమకాలీన సమాజంలో వ్యవస్థాపక నైపుణ్యం పెంపుకు దోహదపడుతుందన్నారు. పట్టణంలో జరిగిన ఈ మొదటి ప్రదర్శన ఎంతో ఆకట్టుకుంది. విద్యార్థులు వివిధ అంశాలతో కూడిన ప్రదర్శనలు నిర్వహించారు.

ఘనంగా ఉరుసు ఉత్సవం

గిద్దలూరు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీహజరత్ ఖాదర్‌వలి స్వాముల వారి దర్గాలో ఆదివారం ఉరుసు ఉత్సవం ఘనంగా జరిగింది. కార్యక్రమంలో ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు. ఆదివారం ఉదయం నుంచే భక్తులు దర్గాను సందర్శించి మొక్కులు తీర్చుకున్నారు. ముస్లింలతోపాటు హిందువులు కూడా ఖాదర్‌వలిస్వామిని దర్శించుకున్నారు. దర్గా కమిటీ అధ్యక్షుడు లతీఫ్ ఖాన్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేశారు. సుమారు 5వేల మందికి అన్నదానాన్ని నిర్వహించగా 10వేలకు పైగా భక్తులు దర్గాను దర్శించుకున్నారు. కార్యక్రమంలో దాతలు లింగం వీరయ్య, షేక్ షబ్బీర్, కె.కాదరయ్య, తదితరులు కార్యక్రమాలలో పాల్గొన్నారు.

450 మందికి ఉచిత వైద్య పరీక్షలు

రాచర్ల, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ఉదయానంద కార్క నోస్ క్యాన్సర్ సెంటర్ నంద్యాల వారి ఆధ్వర్యంలో రాచర్ల స్పందన ఉన్నత పాఠశాలలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించి దాదాపు 450 మంది రోగులకు వైద్య పరీక్షలు చేశారు. స్పందన విద్యా సంస్థ ఎండీ పేర్ల సుధీర్‌కుమార్‌రెడ్డి సహకారంతో ఈ శిబి రాన్ని ఏర్పాటు చేయగా కార్యక్రమంలో గుండె వ్యాధి నిపుణులు డాక్టర్ ఎం.రామేశ్వర్ రెడ్డి, ఎముకల వ్యాధి నిపుణులు డాక్టర్ ఎ ముఖేష్ రెడ్డి, కటి వైద్య నిపుణులు డాక్టర్ వై సౌమ్యరెడ్డి, క్యాన్సర్ వ్యాధి నిపుణులు డాక్టర్ కుషారెడ్డి, కీళ్ల వైద్య నిపుణులు డాక్టర్ నాగరాజు రెడ్డి పాల్గొని రోగులను పరీక్షించారు. గుండె వ్యాధికి సంబంధించి 17మంది రోగులకు యాంజియోగ్రామ్‌కు, కంటికి సంబంధించి కాట్‌రాక్ట్ సర్జరీ కోసం 37మందికి రెఫర్ చేశామని వైద్యులు తెలిపారు. మిగిలిన వారికి సాధారణ పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు అందజేశారు. కార్యక్రమంలో వైద్యశాల సిబ్బంది మాసూల్దార్, రెహమాన్, ఓబులపతి, మదార్ వలి, అశోక్ పాల్గొన్నారు.

ఐక్యతతోనే సమస్యలకు పరిష్కారం

అపుస్మా అధ్యక్షుడు తులసి విష్ణుప్రసాద్

పొదిలి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ప్రైవేటు పాఠశాలలు ఇటీవల కాలంలో అనేక సమస్యలతో సతమతమవుతున్నాయని ఐక్యతతోనే వాటిని పరిష్కరించుకోవాలని అపుస్మా అధ్యక్షుడు కె.తులసి విష్ణుప్రసాద్ పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక సాయి కల్యాణ మండపంలో ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు ఏర్పాటు చేసిన జనరల్‌బాడీ సమావేశంలో ఆయన మాట్లాడారు. సమస్య తలెత్తినప్పుడు అవసరమైతే న్యాయస్థానాల ద్వారా పోరాడి పరిష్కరించేందుకు అసోసియేషన్ ముందుంటుందన్నారు. అపుస్మా వర్కింగ్ ప్రెసిడెంట్ పీవీ రమణారెడ్డి మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలల ప్రతినిధులు కలిసికట్టుగా ఉండి సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. జిల్లా అధ్యక్షుడు కె.మాధవరావు మాట్లాడుతూ నియోజకవర్గాలతో కొత్త జిల్లాగా ఏర్పడుతున్న మార్కాపురం జిల్లాలో అసోసియేషన్‌ను బలోపేతం చేయాలని ఆయన కోరారు. మార్కాపురం ఉప విద్యాశాఖాధికారి శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రభుత్వానికి ప్రైవేటు, ప్రభుత్వ పాఠశాలలు రెండు కళ్లవంటివన్నారు. వాటిలో వేటికి సమస్య వచ్చినా ఒకేలా చూస్తామన్నారు. సమావేశంలో ఎంఈవో నాగలక్ష్మి, ప్రతిభ విద్యా సంస్థల సీఈవో జయప్రకాష్ నారాయణ, సరస్వతి విద్యా సంస్థల చైర్మన్ రమణారెడ్డి, సంకల్ప విద్యా సంస్థల చైర్మన్ జీపీ రెడ్డి, వివేకానంద కళాశాల డైరెక్టర్ వెంకటేశ్వరరావు, పలు ప్రైవేటు స్కూళ్ల కరస్పాండెంట్‌లు, ప్రిన్సిపాల్స్ పాల్గొన్నారు.

గురజాడకు ఘన నివాళి

గిద్దలూరు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శాఖ గ్రంథాలయం ఆవరణలో కవి గురజాడ అప్పారావు 110వ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కన్యాసుల్కం నాటకంలో పాత్రలు, మాటల గురించి పేర్కొన్నారు. గ్రంథపాలకురాలు ప్రసన్నకుమారి, స్వామి వివేకానంద చారిటబుల్ ట్రస్టు అధ్యక్షుడు తిరుపతిరెడ్డి, గ్రంథాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు రామిరెడ్డి, కిశోర్, కార్యదర్శి ఫరూఖ్, రిటైర్డ్ ఉద్యోగులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భగవద్గీత పోటీల్లో విజేతలకు బహుమతులు

మార్కాపురం వన్‌టౌన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): వివేకానంద విద్యాపీఠంలో టీటీడీ, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో భగవత్‌గీత కంఠస్థ పోటీలు ఆదివారం నిర్వహించారు. మొదటి గ్రూపులో వి.సృజనారెడ్డి ప్రథమ, జె.కుముదిని ద్వితీయా, నాగలక్ష్మి తృతీయ బహుమతి అందుకున్నారు. రెండో గ్రూప్ నుంచి జె.సాయి చరిత ప్రథమ, కేవీ భవ్య ద్వితీయ, జి.వరుణ్ తృతీయ బహుమతులు అందుకున్నారు. పెద్దల గ్రూప్ నుంచి వై.శిరీష ప్రథమ, వై.పావన ద్వితీయ, పి.సబిత తృతీయ బహుమతులు అందుకున్నారు. న్యాయనిర్ణేతలుగా శ్రీపతి విజయలక్ష్మి, కె.సునీత, జి.అపర్ణ, గాయం దశరథరామిరెడ్డి, లక్ష్మీ మల్లిక్ వ్యవహరించారు.

లక్షాధికారులుగా రైతులు

- అదే ప్రభుత్వ లక్ష్యం
- టీడీపీ ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబు



రైతులనుద్దేశించి మాట్లాడుతున్న టీడీపీ ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబు

పుల్లలచెరువు,నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : రైతులను లక్షాధికారులను చేయడమే ప్రభుత్వ లక్ష్యమని టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు అన్నారు. ఆదివారం మండలంలోని మర్రివేముల గ్రామంలో రైతన్నా మీకోసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాలపై కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అన్నదాత సుఖీభవ ద్వారా రైతులకు పెట్టుబడి సాయాన్ని అందజేస్తోందన్నారు. సబ్సిడీపై యూరియాను, వ్యవసాయ పరికరాలను కూడా అందజేస్తున్నట్లు తెలిపారు. రైతులు చిరుధాన్యాలను పండించి మీతోపాటు ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని కోరారు. మార్కెట్‌లో డిమాండ్ ఉన్న పంటలను సాగు చేయాలన్నారు. పేద రైతులు భూముల ఆన్‌లైన్ కోసం కార్యాలయం చుట్టూ తిప్పకుండా సమస్యను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులకు సూచించారు. మండలంలోని అన్ని గ్రామాల్లో సీసీ రోడ్లు నిర్మించామన్నారు. ఎన్నికల ముందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చుతున్నారన్నారు. మార్కాపురం జిల్లా ఏర్పాటు, వెలిగొండ ప్రాజెక్టు పూర్తికి కృషి చేస్తున్న సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌కు ప్రజలు కృతజ్ఞతలు తెలపాలని ఎరిక్షన్‌బాబు అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ వెంకటయ్య, టీడీపీ మండల అధ్యక్షుడు పోట్ల గోవింద్, టీడీపీ మండల నాయకులు కాకర్ల కోటయ్య, రెంటపల్లి సుబ్బారెడ్డి, భాస్కర్, కుమార్, పయ్యావుల ప్రసాద్, మేడికొండ లక్ష్మీ నారాయణ, టీడీపీ పట్టణ అధ్యక్షుడు మేడికొండ అనిల్ కుమార్ చౌదరి, జనసేన పార్టీ మండలాధ్యక్షుడు కొటారి అచ్చయ్య, నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

గిడసబారిన పొగాకు తోటలు

ఆందోళనలో రైతులు



గిడసబారిన పొగాకు తోట

తర్లుపాడు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ఈ ఏడాది కూడా ప్రకృతి వైపరీత్యాల దృష్ట్యా ముదురు పొగాకు తోటలు గిడసబారిపోయాయి. మొంథా తుఫాన్ నేపథ్యంలో తోటలు పెరుగుదల లేక ఎర్రగా మారాయి. దీంతో ప్రస్తుతం ఆకు కొట్టుడు దశలో ఉంది. ఎక్కువగా ఈ ప్రాంతంలో గొబ్బూరు, జంగంగుంట్ల, సీతానాగులవరం, తర్లుపాడులలో ఎర్రనేలల్లో ఈ పొగాకును సాగు చేశారు. ప్రస్తుతం ఆకుకొడుతున్నారు. 10 ఎకరాలు కొట్టినప్పటికీ కేవలం 400 నుంచి 500 కర్రలు మాత్రమే వస్తుంది. దీంతో రైతులు ఇద్దరు కలిసి ఒక బ్యార్నీలో పొగాకును కాలుస్తున్నారు. పొగాకు తోటలు గిడసబారిపోవడంతో ఈ ఏడాది కూడా భారీ నష్టాలు చవిచూడాల్సిన పరిస్థితి కన్పిస్తుంది. ప్రస్తుతం గత 20 రోజుల నుంచి నల్లరేగడి నేలల్లో లేత పొగాకును సాగు చేస్తున్నారు. ఒక మూట నారు ధర రూ.6,500 చొప్పున తెచ్చి నాట్లు వేస్తున్నారు. ఈ ఏడాది పొగాకు సాగు చేసే రైతులకు ఎక్కువ ఖర్చు అయింది. ముదరు తోటలు దెబ్బతినడంతో లేత తోటల పైనే ఆశలు పెట్టుకున్నారు. గతేడాది పంట లోగ్రేడ్ పొగాకు అమ్ముడుపోక ఇళ్లల్లోనే మగ్గుతుంది. ఈ ఏడాది కూడా పొగాకు రైతులకు నష్టాలు తప్పేటట్లు లేదు. గతేడాది 20 ఎకరాలు సాగు చేసిన రైతులు ఈ ఏడాది 10 ఎకరాలకే చాలించుకుంటున్నారు. పెరిగిన ఖర్చులతో కొంతమంది రైతులు పొగనాట్లు వేయకుండా శనగ పంట వైపు మొగ్గు చూపుతున్నారు.

నేడు విళక్కి

గిద్దలూరు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నంద్యాల - ఒంగోలు హైవే రోడ్డులో ఉన్న శ్రీ ఉమామహేశ్వర స్వామి, అయ్యప్పస్వామి దేవస్థానంలో డిసెంబరు 1వ తేదీ సోమవారం విళక్కి మహోత్సవం నిర్వహిస్తున్నట్లు దేవస్థాన కమిటీ ప్రతినిధులు తెలిపారు.

కర్పూర నగరోత్సవం

పట్టణంలోని కొంగళవీడు రోడ్డులోని అయ్యప్పస్వామి దేవస్థానంలో ఆదివారం వైభవంగా కర్పూర నగరోత్సవం, పడిపూజ నిర్వహించారు. రాత్రి గ్రామోత్సవం నిర్వహించారు. దేవస్థాన ప్రధాన అర్చకులు ప్రవీణ్‌స్వామి పాల్గొన్నారు.

కామేశ్వరరావును స్ఫూర్తిగా తీసుకోవాలి

మార్కాపురం వన్‌టౌన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ కార్మికులు, ఉద్యోగుల సమస్యలు పరిష్కారానికి ప్రాణాలు త్యజించిన కార్మిక రత్న ఎస్ఏఎన్ కామేశ్వరరావును స్ఫూర్తిగా తీసుకోవాలని విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పీవీవీ నాగేశ్వరరావు అన్నారు. విద్యుత్ శాఖ కార్యాలయంలో కామేశ్వరరావు వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు.

విద్యాప్రమాణాలను పెంపొందించాలి

పెద్దదోర్నాల, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : గిరిజన విద్యార్థుల్లో విద్యాప్రమాణాలు పెంపొందించాలని జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి వరలక్ష్మి అన్నారు. మండలంలోని చింతల ఆశ్రమ పాఠశాలలో ఆమె శనివారం రాత్రి విద్యార్థులతో కలిసి నిద్ర చేశారు. ఆదివారం ఉదయం పాఠశాలలో వసతులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులను పలు పాఠ్యాంశాలపై ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. విద్యార్థుల్లో నైపుణ్యాలు కనిపించకపోవడంతో ఆమె అసంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శ్రీకాంత్, సిబ్బంది పాల్గొన్నారు.


రోడ్డు ప్రమాదంలో హోంగార్డుకు గాయాలు

మార్కాపురం రూరల్, నవంబరు30 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో హోంగార్డుకు గాయాలైన ఘటన మండలంలోని చింతగుంట్ల గ్రామం వద్ద జాతీయ రహదారిపై ఆదివారం రాత్రి జరిగింది. జరుగుమల్లి పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న హోంగార్డు పీ రాములు తన స్వగ్రామం పెద్దారవీడు మండలం గుండచర్ల నుంచి బైక్‌పై కంభం వెళుతున్నారు. అదే సమయంలో ఇంటికి అరకతో వెళుతున్న ఎద్దులకు బైకు తగలడంతో హోంగార్డ్ పడిపోయారు. అతడిని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. రూరల్ పోలీసులు వివరాలు నమోదు చేశారు.

కంభంలో కోర్టును ఏర్పాటు చేయాలి

కంభం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : మార్కాపురం జిల్లా అవుతున్న సందర్భంగా కంభంలో జూనియర్ సివిల్ జడ్జి కోర్టును ఏర్పాటు చేయాలని కంభం, బేస్తవారపేట, అర్ధవీడు మండలాల ప్రజలు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గతంలో పశ్చిమ ప్రకాశం జిల్లాలో అర్ధవీడు, కంభం, బేస్తవారిపేట, రాచర్ల, గిద్దలూరు, కొమరోలు మండలాలకు సంబంధించి కంభంలో తాలూకా కోర్టు ఉండేది. కొన్ని పరిస్థితుల కారణంగా కంభంలో ఉన్న కోర్టును గిద్దలూరులో ఏర్పాటు చేశారు. 196లో గిద్దలూరు జ్యుడీషియల్ సెకెండ్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు నుంచి జిల్లా మున్సిఫ్ కోర్టు కం జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టుగా ఏర్పాటు చేశారు. ప్రస్తుతం గిద్దలూరులో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు, జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టులు ఉన్నాయి. ఈ కోర్టుల పరిధిలో కంభం, అర్ధవీడు, బేస్తవారపేట, రాచర్ల, కొమరోలు, గిద్దలూరు మండలాలు ఉన్నాయి. జిల్లాలో కంభం, అర్ధవీడు, బేస్తవార పేట మండలాలు బాగా వెనుకబడిన ప్రాంతాలుగా ఉన్నాయి. ప్రస్తుతం గిద్దలూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో 1200, అడిషనల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ కోర్టులో 1500 కేసులు పెండింగ్‌లో ఉండగా అందులో అధిక శాతం కేసులు కంభం, అర్ధవీడు, బేస్తవారిపేట మండలాలకు సంబంధించిన కేసులే అధికం. కక్షిదారులు అర్ధవీడు మండలం నుంచి గిద్దలూరు కోర్టుకు రావాలంటే ఒకరోజు మొత్తం తమ పనులను వదులుకొని రావాల్సి వస్తుంది. పైగా మండలం భౌగోళికంగా రెండు పాయలుగా చీలి ఉన్నందున ఈ ప్రాంతాలకు బస్సు సౌకర్యాలు కూడా అంతంత మాత్రమే. అర్ధవీడు నుంచి కంభం వచ్చి, మరో బస్సులో 40కిలోమీటర్ల దూరంలోని గిద్దలూరు రావాలి అంటే దాదాపు 110 కిలోమీటర్లపైగా అర్ధవీడు నుంచి గిద్దలూరు వెళ్లాల్సి వస్తోంది. అంటే రాను, పోను 220కిలోమీటర్లు ప్రయాణం చేయాల్సి వస్తుంది. పైగా అర్ధవీడు, బేస్తవారపేట, మండలాలకు బస్సులు ఎప్పుడు వస్తాయో, తెలియని పరిస్థితి. ఇన్ని వ్యయ ప్రయాసాలకు లోనై గిద్దలూరుకు వెళ్లే కన్నా బేస్తవారిపేట, అర్ధవీడు, కంభం మండలాలను కంభం కేంద్రంగా జూనియర్ సివిల్ జడ్జి కోర్టును ఏర్పాటు చేయడం ద్వారా కేసులు యొక్క విచారణ త్వరితగతిన జరగడమే గాక కేసుల పెండెన్సీ తగ్గడానికి అవకాశం ఉంటుందని భావిస్తున్నారు. కంభంలో ఇటీవల పోలీస్ సర్కిల్ కార్యాలయం కూడా ఏర్పాటు చేశారు. కంభంలో జూనియర్ సివిల్ జడ్జి కోర్టు, గిద్దలూరు, కొమరోలు, రాచర్ల మండలాలకు కేసులను గిద్దలూరులో విచారించడం ద్వారా కేసులను త్వరితగతిన పరిష్కరించవచ్చని ప్రజలు కోరుకుంటున్నారు. ఈ ప్రాంత కక్షిదారుల సమస్యలను తీర్చేందుకు కంభంలో కోర్టును ఏర్పాటుకు ఉన్నతాధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

కోర్టు ఏర్పాటుతో మేలు



ప్రస్తుతం మార్కాపురాన్ని జిల్లాగా ప్రకటించినందున పశ్చిమ ప్రకాశంలో బాగా వెనుకబడిన ప్రాంతాలైన కంభం, అర్ధవీడు, బేస్తవారిపేట మండలాల కక్షిదారులకు అనుకూలంగా కంభంలో జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఏర్పాటు చేస్తే బాగుంటుంది.

ఉదయగిరి మల్లికార్జునరావు
న్యాయవాదుల సంఘం జిల్లా సహాయ కార్యదర్శి

సిటీ యూనియన్ బ్యాంక్ లిమిటెడ్
CUB TRUST AND EXCELLENCE SINCE 1904
క్రెడిట్ రికవరీ మరియు మేనేజ్‌మెంట్ శాఖ
పరిపాలనా కార్యాలయము : నం. 24-B, గాంధీనగర్, కుంబకోణం - 612001.
ఇ-మెయిల్ ఐడి: crmd@cityunionbank.in, ఫోన్ : 0435-2432322, ఫ్యాక్స్ : 0435-2431746

SARFAESI చట్టం 2002 క్రింద రీ-టెండరు - సహిత - వేలం అమ్మకం ప్రకటన

రుణగ్రహీతలు/హామీదారులు : నం.1) శ్రీ కోమట్ల మధుసూదన రెడ్డి తండ్రి పోతురాజు రెడ్డి, డి.నం.1/148, పెద్దగంజాం, చిన్నగంజాం, ప్రకాశం జిల్లా, ఆంధ్రప్రదేశ్-523186. నం.2) శ్రీమతి కోమట్ల రాజమణి, భర్త కోమట్ల మధుసూదన రెడ్డి, డి.నం. 1/148, పెద్దగంజాం, చిన్నగంజాం, ప్రకాశం జిల్లా, ఆంధ్రప్రదేశ్-523186. నం.3) శ్రీ కోమట్ల దామోదర రెడ్డి, తండ్రి పోతురాజు రెడ్డి, డి.నం.1/148, పెద్దగంజాం, చిన్నగంజాం, ప్రకాశం జిల్లా, ఆంధ్రప్రదేశ్-523186. వారి నుండి 06.08.2025 నుండి చార్జి చేయబడే తదుపరి వడ్డీ, ఇతర ఖర్చులు, ఏమేని ఇతర బకాయిలతో కలిపి 05.08.2025 నాటికి రూ.40,48,100/- (రూపాయలు నలభై లక్షల నలభై ఎనిమిదివేల ఒక వంద మాత్రమే)లను రాబట్టుకొనుటకు సెక్యూరిటీ ఇంట్రెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూలు 8(6) & 9 క్రింద, SARFAESI చట్టం 2002 క్రింద సిటీ యూనియన్ బ్యాంక్ లిమిటెడ్‌కు తనఖాపెట్టిన దిగువ ఆస్తి / ఆస్తులు బ్యాంక్ అధీకృత అధికారిచే రీ-టెండరు-సహిత-బహిరంగ వేలంలో విక్రయించబడును.

మా బ్యాంక్‌కు తనఖా పెట్టబడిన స్థిరాస్తులు

షెడ్యూలు-A : (శ్రీ కోమట్ల మధుసూదన రెడ్డి తండ్రి పోతురాజు రెడ్డికి చెందిన ఆస్తి)
ప్రకాశం జిల్లా రిజిస్ట్రేషన్, అమ్మనబ్రోలు సబ్ రిజిస్ట్రేషన్, చిన్నగంజాం మండలం, పెద్దగంజాం పంచాయతీ మరియు గ్రామం, సర్వే నం.607/3ఎ, డోర్ నం.1-14 సమీపాన, మొత్తం ఎ.0.47 సెంట్లలో ప్రస్తుతం ఉన్న భూమి మరియు ఇప్పుడు దానిపై ఉన్న లేదా భవిష్యత్‌లో దానిలో నిర్మించబోయే కట్టడాలతో ఆస్తి యావత్తు. షెడ్యూలు ఆస్తి సరిహద్దులు: తూర్పు: కోమట్ల గంగాధర్ స్థలం, దక్షిణం: కోమట్ల దామోదర్ రెడ్డికి ఇవ్వబడిన స్థలం, పశ్చిమం: డొంక రోడ్, ఉత్తరం: కోమట్ల మధుసూదన రెడ్డికి ఇవ్వబడిన స్థలం, షెడ్యూలు బి ఆస్తి: ఈ సరిహద్దులతో 435.6 చ.గజాలు విస్తీర్ణం కలిగిన స్థలం.

షెడ్యూలు-B : (శ్రీ కోమట్ల మధుసూదన రెడ్డి తండ్రి పోతురాజు రెడ్డికి చెందిన ఆస్తి)
ప్రకాశం జిల్లా రిజిస్ట్రేషన్, అమ్మనబ్రోలు సబ్ రిజిస్ట్రేషన్, చిన్నగంజాం మండలం, పెద్దగంజాం పంచాయతీ మరియు గ్రామం, సర్వే నం.607/3ఎ, డోర్ నం.1-14 సమీపాన, మొత్తం ఎ.0.47 సెంట్లలో ప్రస్తుతం ఉన్న భూమి మరియు ఇప్పుడు దానిపై ఉన్న లేదా భవిష్యత్‌లో దానిలో నిర్మించబోయే కట్టడాలతో ఆస్తి యావత్తు. షెడ్యూలు ఆస్తి సరిహద్దులు: తూర్పు: కోమట్ల గంగాధర్ స్థలం, దక్షిణం: కోమట్ల మధుసూదన రెడ్డి స్థలం. A ఆస్తి. పశ్చిమం: డొంక రోడ్, ఉత్తరం: కోమట్ల పోతురాజు రెడ్డికి మిగిలిన స్థలం, ఈ సరిహద్దులతో 387.20 చ.గజాలు విస్తీర్ణం కలిగిన స్థలం.

రిజర్వు ధర: రూ. 19,00,000/-
(రూపాయలు పందొమ్మిది లక్షలు మాత్రమే) (షెడ్యూలు A&B కొరకు మాత్రమే)

షెడ్యూలు-C : (శ్రీ కోమట్ల దామోదర రెడ్డి తండ్రి పోతురాజు రెడ్డికి చెందిన ఆస్తి)
ప్రకాశం జిల్లా రిజిస్ట్రేషన్, అమ్మనబ్రోలు సబ్ రిజిస్ట్రేషన్, చిన్నగంజాం మండలం, పెద్దగంజాం పంచాయతీ మరియు గ్రామం, సర్వే నం.607/3ఎ, డోర్ నం.1-14 సమీపాన, మొత్తం ఎ.0.47 సెంట్లలో ప్రస్తుతం ఉన్న భూమి మరియు ఇప్పుడు దానిపై ఉన్న లేదా భవిష్యత్‌లో దానిలో నిర్మించబోయే కట్టడాలతో ఆస్తి యావత్తు. షెడ్యూలు ఆస్తి సరిహద్దులు: తూర్పు: కోమట్ల గంగాధర్ స్థలం, దక్షిణం: కోమట్ల దామోదర్ రెడ్డికి ఇవ్వబడిన స్థలం, షెడ్యూల్-సి ఆస్తి, పశ్చిమం: డొంక రోడ్, ఉత్తరం: కోమట్ల మధుసూదన రెడ్డికి ఇవ్వబడిన స్థలం, ఈ సరిహద్దులతో 435.6 చ.గజాలు విస్తీర్ణం కలిగిన స్థలం.

షెడ్యూలు-E : (శ్రీ కోమట్ల దామోదర రెడ్డి తండ్రి పోతురాజు రెడ్డికి చెందిన ఆస్తి)
ప్రకాశం జిల్లా రిజిస్ట్రేషన్, అమ్మనబ్రోలు సబ్ రిజిస్ట్రేషన్, చిన్నగంజాం మండలం, పెద్దగంజాం పంచాయతీ మరియు గ్రామం, సర్వే నం.607/3ఎ, డోర్ నం.1-14 సమీపాన, మొత్తం ఎ.0.47 సెంట్లలో ప్రస్తుతం ఉన్న భూమి మరియు ఇప్పుడు దానిపై ఉన్న లేదా భవిష్యత్‌లో దానిలో నిర్మించబోయే కట్టడాలతో ఆస్తి యావత్తు. షెడ్యూలు ఆస్తి సరిహద్దులు: తూర్పు: కోమట్ల గంగాధర్ స్థలం, దక్షిణం : కోమట్ల వెంకటప్పరెడ్డి స్థలం, పశ్చిమం : డొంక రోడ్, ఉత్తరం: కోమట్ల దామోదర రెడ్డి స్థలం షెడ్యూల్-ఎ ఆస్తి, స్థలం యొక్క విస్తీర్ణం 435.6 చ.గల ఈ సరిహద్దులలో కలదు.

రిజర్వు ధర: రూ. 20,00,000/-
(రూపాయలు ఇరవై లక్షలు మాత్రమే) (షెడ్యూలు C&E కొరకు మాత్రమే)

షెడ్యూలు-D : (శ్రీ కోమట్ల దామోదర రెడ్డి తండ్రి పోతురాజు రెడ్డికి చెందిన ఆస్తి)
ప్రకాశం జిల్లా రిజిస్ట్రేషన్, అమ్మనబ్రోలు సబ్ రిజిస్ట్రేషన్, చిన్నగంజాం మండలం, పెద్దగంజాం పంచాయతీ మరియు గ్రామం, సర్వే నం.609/3, డోర్ నం.1-14 సమీపాన, మొత్తం ఎ.0.19 సెంట్లలో ప్రస్తుతం ఉన్న భూమి మరియు ఇప్పుడు దానిపై ఉన్న లేదా భవిష్యత్‌లో దానిలో నిర్మించబోయే కట్టడాలతో ఆస్తి యావత్తు. షెడ్యూలు ఆస్తి సరిహద్దులు: తూర్పు: అనోది దుర్గారెడ్డి ఇల్లు మరియు స్థలం, దక్షిణం: మోటమారి రాఘవ మరియు ఇతరుల ఇల్లు మరియు స్థలం, పశ్చిమం: పంచాయితీ రోడ్, ఉత్తరం: కోమట్ల వెంకటప్ప రెడ్డి స్థలం, ఈ సరిహద్దులతో 435.6 చ.గజాలు విస్తీర్ణం కలిగిన స్థలం.

రిజర్వు ధర: రూ. 14,00,000/-
(రూపాయలు పద్నాలుగు లక్షలు మాత్రమే)

రీ- వేలం వివరాలు :

రీ- టెండరు-సహిత-వేలం అమ్మకం తేదీ:	ప్రదేశం
19-12-2025	సిటీ యూనియన్ బ్యాంక్ లిమిటెడ్, ఒంగోలు శాఖ, నం.37-1-167 (55), గ్రౌండ్ ఫ్లోర్, వాసు ప్లాజా, కర్నూల్ రోడ్, ఒంగోలు, ప్రకాశం, ఆంధ్రప్రదేశ్-523002. టెలిఫోన్ నం.08592-282912, సెల్ నం.9347078104, 8925876329

రీ- టెండరు-సహిత-వేలం అమ్మకం నియమ నిబంధనలు :
1. కాగోరు బిడ్డర్లు వేలంలో స్వయంగా పాల్గొనవలెను మరియు వ్యక్తిగతంగా పాల్గొనాలి మరియు అందుకు సంబంధించి అతని/ఆమె కొరకే అతను/ఆమె బిడ్డింగ్ వేస్తున్నట్లు వ్రాతపూర్వక ప్రకటన ఇవ్వవలసి ఉంటుంది. 2. కాగోరు బిడ్డర్లు మేనేజర్, సిటీ యూనియన్ బ్యాంక్ లిమిటెడ్, ఒంగోలు శాఖ, నం.37-1-167 (55), గ్రౌండ్ ఫ్లోర్, వాసు ప్లాజా, కర్నూల్ రోడ్, ఒంగోలు, ప్రకాశం, ఆంధ్రప్రదేశ్-523002 వారి నుండి టెండరు ఫారాలను పొందవచ్చును. 3. కాగోరు బిడ్డర్లు వారి బిడ్లను "సిటీ యూనియన్ బ్యాంక్ లిమిటెడ్" పేరున రిజర్వు ధరలో 10 శాతం బయానా కొరకు తీసిన డిమాండ్ డ్రాఫ్ట్ / పే ఆర్డర్ రూపంలో ఉన్నదానితోపాటుగా ఇందులో తెలిపిన టెండరు-సహిత-వేలం అమ్మకం తేదీన ప.12.00 గం.కు లేదా అలోగా అధీకృత అధికారి, సిటీ యూనియన్ బ్యాంక్ లిమిటెడ్ వారి చిరునామాకు సీల్డు ఎన్వలప్‌లో నిర్దేశపరిచిన టెండరు ఫారంలో మాత్రమే వారి బిడ్లను దాఖలు చేయవలెను. 4. ఆస్తి తనిఖీ మరియు ఇతర వివరాల కొరకు కాగోరు కొనుగోలుదారు టెలిఫోన్ నం.08592-282912, సెల్ నం.9347078104,8925876329లను సంప్రదించవచ్చును. 5. ఆస్తి / ఆస్తులు [illegible]

ప్రదేశం : కుంభకోణం, తేదీ : 29.11.2025 అధీకృత అధికారి

నమోదిత కార్యాలయం: 149, T.S.R. (Big) స్ట్రీట్, కుంభకోణం, తంజావూరు జిల్లా, తమిళనాడు-612001, CIN - L65110TN1904PLC001287, టెలిఫోన్ నం.0435-2402322, ఫ్యాక్స్:0435-2431746, వెబ్‌సైట్: www.cityunionbank.com

నేడు కొర్రపాటివారిపాలెంలో డాక్టర్ లక్ష్మి పర్యటన

తాళ్లూరు, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొర్రపాటివారిపాలెం గ్రామంలో సోమవారం టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గొట్టిపాటి లక్ష్మి పర్యటించనున్నట్టు ఆపార్టీ మండల అధ్యక్షుడు మేడగం వెంకటేశ్వరరెడ్డి, తెలుగుయువత నాయకుడు గొల్లపూడి వేణుబాబు తెలిపారు. ఈసందర్భంగా స్పౌజ్ కింద మంజూరైన పెన్షన్లు, ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు పంపిణీ చేస్తారని వారు పేర్కొన్నారు.

రిటైర్డ్ కలెక్టర్ బాబురావుకు మాతృవియోగం

సీఎస్‌పురం(పామూరు), నవంబరు 30(ఆంధ్రజ్యోతి): సీఎస్‌పురం మండలం శీలంవారిపల్లి గ్రామానికి చెందిన రిటైర్డ్ కలెక్టర్ పిడుగు బాబురావు మాతృమూర్తి మంగమ్మ(100) ఆదివారం రాత్రి కన్నుమూశారు. సోమవారం అంత్యక్రియలు జరుగుతాయని బాబురావు తెలిపారు. మంగమ్మ మృతి పట్ల ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు. కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. సంతాపం తెలిపిన వారిలో ఏఎంసీ మాజీ ఛైర్మన్ దారపనేని చంద్రశేఖర్, మాజీ సింగిల్‌విండో అధ్యక్షుడు భైరెడ్డి జయరామిరెడ్డి, బోయిళ్ల నారాయణరెడ్డి, బొబ్బూరి రమేష్, బొల్లా నరసింహారావు, పువ్వాడి వెంకటేశ్వర్లు, డాక్టర్ గడ్డె ఏడుకొండలు, సయ్యద్ దౌలత్ ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో ఆలయ వార్షికోత్సవం

పామూరు, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): పామూరు మేజర్ పంచాయతీ పరిధిలోని డీవీపాలెంలో వెలసిఉన్న పంచముఖ శ్రీఆంజనేయస్వామి దేవస్థాన తృతీయ వార్షికోత్సవం ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈసందర్భంగా దేవస్థానంలో అభిషేకాలు, హోమాలు, ఆకుపూజలు నిర్వహించారు. అనంతరం అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో దేవస్థాన నిర్వాహకుడు ఈర్ల కోటేశ్వరరావు, భక్తులు, పాల్గొన్నారు. అలాగే, మార్కోండాపురంలోని కృష్ణ భగవాన్ ఆలయంలో శ్రీ భగవద్గీత జయంతి మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా శ్రీ కృష్ణ పరమాత్మ విగ్రహానికి అభిషేకాలు నిర్వహించారు. నిర్మలనంద చాగంరెడ్డి నారాయణరెడ్డి, శైలజ భగవద్గీత ప్రసంగం చేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు రాగిపిండి లక్ష్మీనారాయణ, లలితరాణి దంపతులు పాల్గొన్నారు.

'దిత్వా'తో అప్రమత్తంగా ఉండాలి

- పంటలు నష్టపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలి
- జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాసరావు



శివరాంపురంలో వర్షానికి తడవకుండా పరదాలు కప్పుతున్న మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న జిల్లావ్యవసాయాధికారి శ్రీనివాసరావు, తహసీల్దార్ రమణారావు

తాళ్లూరు, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): దిత్వా తుఫాన్ ప్రభావంతో కోతకు వచ్చిన పంటలు నష్టపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి ఎస్.శ్రీనివాసరావు రైతులకు సూచించారు. ఆదివారం మండలంలోని మండలంలోని శివరాంపురం, తాళ్లూరు, కొర్రపాటివారిపాలెం, విఠలాపురం గ్రామాల్లో పంటల పరిస్థితులను పరిశీలించారు. ఈసందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ మొంథా తుఫాన్ ప్రభావంవల్ల పంటలు దెబ్బతిని రైతులు ఇబ్బందులు పడ్డారన్నారు. మరలా దిత్వా తుఫాన్ నేపథ్యంలో కోతకు వచ్చిన పంటలు దెబ్బతినకుండా రైతులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రస్తుతం వరి, మొక్కజొన్న పంటలను కోత కోయకుండా ఆపాలన్నారు. పొలాల్లో కుప్పలుగా వున్న ధాన్యాన్ని పరదా పట్టలతో కప్పి కాపాడుకోవాలన్నారు. కోతకు వచ్చిన పంట పొలాల్లో నీరు నిల్వ ఉండకుండా వెళ్లగొట్టాలన్నారు. రైతులు తుఫాన్ ప్రభావం తగ్గే వరకు నిత్యం ప్రభావంతో మూడు రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్టు వాతావరణ అధికారులు తెలియ జేయటంతో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండల స్థాయి అధికారులందరూ అందుబాటులో ఉండాలన్నారు. గ్రామ స్థాయి అధికారులు ఆయా గ్రామాల్లో ఉండి వాగులు పొంగి ప్రవహించే అవకాశాలు ఉన్నగ్రామాల్లో దండోర వేసి ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు అవగాహన కల్పించి వరి కోతలు కోయకుండా వాయిదా వేసుకొనే విధంగా అప్రమత్తంగా ఉండాలన్నారు.

కార్యక్రమంలో తహసీల్దార్ బీవీ రమణారావు, ఏవో బి.ప్రసాదరావు, వీఏఏ షేక్ అజ్మీర్, సిబ్బంది పాల్గొన్నారు.

అధికారులు అందుబాటులో ఉండాలి



ముండ్లమూరు: దిత్వా తుఫాన్‌పై సమీక్ష చేస్తున్న తహసీల్దార్ లక్ష్మీనారాయణ, ఎంపీడీవో శ్రీదేవి,

ముండ్లమూరు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): దిత్వా తుఫాన్ నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ ఎల్.లక్ష్మీనారాయణ అన్నారు. ఆదివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దిత్వా తుఫాన్ తెలపాలన్నారు. సమావేశంలో ఎంపీడీవో ఎం.శ్రీదేవి, వ్యవసాయ అధికారి ఏ.తిరుమలరావు, పంచాయతీ రాజ్ ఏఈ ఎం.వెంకటేశ్వర్లు, డిప్యూటీ ఎంపీడీవో ఆర్.జనార్దన్, వీఆర్‌వోలు, పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

విహారయాత్రలతో విజ్ఞానం

- మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ పద్మావతి



భైరవకోనలో జలపాతం వద్ద ఆనందంగా గడిపిన విద్యార్థినులు

కనిగిరి, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో నూతన దృక్పథాలను కల్గించే మార్గాలుగా విహారయాత్రలు ఎంతో దోహదపడతాయని మోడల్‌స్కూల్ ప్రిన్సిపాల్ పద్మావతి అన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహా రెడ్డి సహకారంతో మోడల్‌స్కూల్, ఇంటిగ్రేటెడ్ హాస్టల్స్ విద్యార్థినులకు ఆదివారం విహారయాత్ర ఏర్పాటుచేశారు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విహారయాత్రలు విద్యార్థుల్లో మానసిక చైతన్యం, వ్యక్తిత్వ వికాసంతో కూడిన విజ్ఞానాన్ని పెంపొదిస్తాయన్నారు. తోటి విద్యార్థులతో తమ అనుభవాలను పంచుకోవటంద్వారా స్నేహ భావం మరింత పెరిగేందుకు విహార యాత్రలు ఉపయోగపడతాయన్నారు.

నాలుగు బస్సుల్లో విద్యార్థినులు భైరవకోనకు తరలివెళ్లారు. వీరు ఎలాంటి అసౌకర్యానికి గురికాకుండా అవసరమైన ఏర్పాట్లు ఎమ్మెల్యే చేశారు. భైరవకోనలో ప్రకృతి అందాలు, జలపాతాలు, చారిత్రక ప్రదేశాలను తిలకించిన విద్యార్థినులు ఎంతో ఆనందంగా గడిపారు. కార్యక్రమంలో ఇంటిగ్రేటెడ్ హాస్టల్ వార్డెన్ జయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ బలోపేతానికి సమష్టిగా కృషి చేయాలి



కొర్లమడుగులో టీడీపీ నాయకులు, కార్యకర్తలతో మాట్లాడుతున్న రాష్ట్ర సాంస్కృతిక సృజనాత్మక కమిషన్ ఛైర్‌పర్సన్ తేజస్విని

దర్శి, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): టీడీపీని మరింత బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా కృషిచేయాలని రాష్ట్ర సాంస్కృతిక సృజనాత్మక కమిషన్ ఛైర్‌పర్సన్ పొడపాటి తేజస్విని అన్నారు. ఆదివారం మండలంలోని కొర్లమడుగు, చిన్నఉయ్యాలవాడ గ్రామాల్లో ఆమె పర్యటించారు. ఈసందర్భంగా స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలతో మాట్లాడి అక్కడి పరిస్థితులను తెలుసుకున్నారు. ప్రజాప్రభుత్వం అమలుచేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుతీరును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా తేజస్విని మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు అర్హులందరికీ అందేలా నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. వచ్చే స్థానిక ఎన్నికల్లో టీడీపీ ఘనవిజయం సాధించేందుకు కలిసికట్టుగా పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు మారెళ్ల వెంకటేశ్వర్లు, మాజీ అధ్యక్షుడు గొర్రె సుబ్బారెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జ్ రూపినేని రామారావు, నాయకులు గుర్రం బాలకృష్ణ, చిన్నపురెడ్డి వీరనాగిరెడ్డి, అంబటి గోవిందరెడ్డి, రూపినేని వెంకటరావు, చీదర్ల రమణయ్య, చేతల అయ్యప్ప, రావి కొండలు, కె.వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

గంగమ్మకు ప్రత్యేక పూజలు



తాళ్లూరు: ప్రత్యేక అలంకరణలో గంగమ్మతల్లి

తాళ్లూరు, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): గుంటిగంగ సన్నిధిలో ఆదివారం గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. తాళ్లూరుతో పాటు వివిధ ప్రాంతాలనుంచి మొక్కులు తీర్చుకునేందుకు రావటంతో ప్రాంగణం సందడిగా మారింది. గంగమ్మ తల్లిని అధికసంఖ్యలో భక్తులు దర్శనం చేసుకొని ప్రత్యేక పూజలు చేశారు. పలువురు వాహనదారులు పూజలు చేయించారు. పలువురు కుంకుమ పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకపూజారి ఎస్.కామేశ్వరశర్మ భక్తులకు గోత్రనామ పూజలు నిర్వహించారు. పూజారులు ప్రకాశ్ పంతులు, విజయలక్ష్మి,బాలరాజు పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఈవో జి.వాసుబాబు, ఆర్‌ఏ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ఆలయ అన్నదాన సత్రంలో ఈవో వాసుబాబు ఆధ్వర్యంలో గంగమ్మను దర్శించుకున్న భక్తులకు అన్నదానం కార్యక్రమం నిర్వహించారు.

ఘనంగా నారాయణస్వామి పూజలు



పామూరు: నైవేద్యం తెస్తున్న భక్తులు

సీఎస్‌పురం (పామూరు), నవంబరు 30(ఆంధ్రజ్యోతి): సీఎస్‌పురం మండలంలోని మిట్టపాలెం శ్రీ నారాయణస్వామి దేవస్థానంలో ఆదివారం పూజలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా కుంకుమార్చన పూజలు, అభిషేకాలు నిర్వహించారు. స్వామివారి నైవేద్యాన్ని ఆలయ గాలి గోపురం వద్ద నుంచి మేళతాళాలతో ఆలయ ప్రదర్శన చేసి స్వామివారికి సమర్పించారు. గోశాలలోని గోమాతకు పసుపు కుంకుమలతో పూజలు చేశారు. తదనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

కార్యక్రమంలో దేవస్థాన వ్యవస్థాపక అధ్యక్షుడు కొమ్మినేని చినఆదినారాయణ, ఈవో శ్రీగిరిరాజు నరసింహబాబు, తదితరులు పాల్గొన్నారు.

నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు



మాట్లాడుతున్న సీఐ మాకినేని శ్రీనివాసరావు

పామూరు, నవంబరు 30(ఆంధ్రజ్యోతి: ఎవరైనా చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే సహించేది లేదని సీఐ మాకినేని శ్రీనివాసరావు అన్నారు. నేరాలకు పాల్పడినా, ప్రోత్సహించినా చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆదివారం స్థానిక సర్కిల్ కార్యాలయంలో చెడు నడత కలిగిన పలువురు వ్యక్తులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. నేరాలకు పాల్పడుతున్న, ప్రోత్సహిస్తున్నవారి సమాచారం అందించాలని ఈసందర్భంగా సీఐ కోరారు. సమాచారం తెలిపిన వ్యక్తుల పేర్లు గోప్యంగా ఉంచుతామని చెప్పారు. చెడు నడతను మార్చుకొని మంచిగా మెలగాలన్నారు. కార్యక్రమంలో పామూరు, వెలిగండ్ల ఎస్‌ఐలు టి.కిశోర్‌కుమార్, జి.కృష్ణపావని పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



మృతిచెందిన మాలకొండయ్య

పీసీపల్లి, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): రోడ్డుపై వెళ్తున్న వ్యక్తిని వెనుకనుంచి కారు ఢీకొట్టడంతో మృతిచెందిన సంఘటన మండలంలోని రామాపురం వద్ద ఆదివారం చోటుచేసుకుంది. మృతుని బంధువులు, పోలీసులు తెలిపిన వివరాలమేరకు.. రామాపురం గ్రామానికి చెందిన గన్నవరపు మాలకొండయ్య(55) తన ఇంటి నుంచి రోడ్డుపై నడుచుకుంటూ సెంటరుకు వెళ్తున్నాడు. ఈక్రమంలో కనిగిరి వైపు నుంచి వస్తున్న కారు మాలకొండయ్యను వెనుక నుంచి ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతునికి భార్య, ఇద్దరు సంతానం ఉన్నారు. మృతుడి భార్య కుమారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ప్రమాదానికి కారణమైన కారు డ్రైవర్ వెంగళరావుపై పీసీపల్లి పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఖోఖో పోటీలకు మోడల్ స్కూల్ విద్యార్థిని ఎంపిక



సింధు

ముండ్లమూరు, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): ముండ్లమూరులోని ఏపీ మోడల్ స్కూల్‌లో 8వ తరగతి చదువుతున్న తమ్మినేని సింధు జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు ఎంపికయ్యారు. 69వ అంతర్ జిల్లాల స్కూల్ గేమ్స్ అండర్ - 14 ఖోఖో విభాగంలో ఈనెల 27న అనకాపల్లి జిల్లాలోని లంకలపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీల్లో ప్రకాశం జిల్లా జట్టు తరుపన పాల్గొని రాణించారు. దీంతో గుజరాత్ రాష్ట్రంలో డిసెంబరులో జరగబోయే జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైనట్టు ప్రిన్సిపాల్ కె.పూర్ణచంద్రరావు, వ్యాయామ ఉపాధ్యాయుడు పి.శివారెడ్డి తెలిపారు. ఈసందర్భంగా సింధూను పాఠశాల సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు. ఉపాధ్యాయులు వైవీ సుబ్బారావు, సాధు వెంకటేశ్వరరెడ్డిలు వారం రోజుల పాటు సింధూకు ఇచ్చే శిక్షణకు అవసరమయ్యే ఖర్చును భరిస్తామని తెలిపారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



మొక్కలు నాటిన గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు

ముండ్లమూరు, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ ప్రతిఒక్కరి బాధ్యత అని గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు అన్నారు. అంతరిస్తున్న వృక్ష సంపదను కాపాడు కోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఆదివారం మండలంలోని వేంపాడులో జరిగిన ప్రముఖ న్యాయవాది గంగినేని లింగమూర్తి తండ్రి బ్రహ్మానాయుడు దశదిన కర్మలో ఆయన పాల్గొన్నారు. బ్రహ్మానాయుడుకు గుర్తుగా మొక్కలు నాటారు. ఈసందర్భంగా యరపతినేని మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో నీడ నిచ్చే చెట్లను సైతం నిలువునా నరికి వేశారన్నారు. టీడీపీ ప్రభుత్వంలో మొక్కలను పెంచి ప్రజలకు మంచి వాతావరణం కల్పించటం జరుగుతుందన్నారు. మొక్కలు నాటడం వల్ల సమృద్ధిగా వర్షాలు కురుస్తాయన్నారు.

అలాగే, సీపీఎం నాయకులు గంగినేని బ్రహ్మానాయుడు చిత్రపటానికి సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెనాలిలో జిల్లా న్యాయాధికారిగా పని చేస్తున్న ఇందిరా ప్రియదర్శిని, ఎస్పీ మురళీకృష్ణ కూడా పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు వై.వెంకటేశ్వరరావు, జాలా అంజయ్య, మాల్యాద్రి, కంకణాల ఆంజనేయులు, షేక్ మాబు, తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయం నిర్వహణ తీరు అభినందనీయం



గ్రంథాలయంలోని పుస్తకాలను పరిశీలిస్తున్న డిప్యూటీఈవో శ్రీనివాసులు

కనిగిరి, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): పాఠశాలలో గ్రంథాలయం నిర్వహణ తీరు అభినందనీయమని డిప్యూటీఈవో ఎం.శ్రీనివాసులు అన్నారు. ఆదివారం స్థానిక పీఎంశ్రీ జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలను ఆయన సందర్శించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ పాఠశాలలో ఏర్పాటుచేసిన గ్రంథాలయం ప్రతిఒక్కరిని ఎంతగానో ఆకట్టుకుంటుందని హెచ్‌ఎం కలవ విజయలక్ష్మిని అభినందించారు. గ్రంథాల యంలో ఏర్పాటుచేసిన వివిధ పుస్తకాలను ఆయన పరిశీలించారు. పీఎంశ్రీ పథకం ద్వారా పాఠశాలల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నాయన్నారు. డిసెంబరు 5న నిర్వహించనున్న మెగా పేరెంట్స్ డేను ఘనంగా నిర్వహించాలన్నారు.

కార్యక్రమంలో రిటైర్డ్ ఎంఈవో వీరంరెడ్డి నాగిరెడ్డి, ఉపాధ్యాయులు లక్ష్మి, నాగమణి, సాయిలక్ష్మి, యాలం శ్రీను, యశోద, తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాల సాధనకు ప్రతిభా పరీక్షలు దోహదం

- డీసీఎంఎస్ ఛైర్మన్ శ్యామల కాశిరెడ్డి



మాట్లాడుతున్న డీసీఎంఎస్ ఛైర్మన్ శ్యామల కాశిరెడ్డి

కనిగిరి, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించటానికి ప్రతిభా పోటీ పరీక్షలు ఎంతో దోహదపడతాయని డీసీఎంఎస్ ఛైర్మన్ శ్యామల కాశిరెడ్డి అన్నారు. స్థానిక ప్రభుత్వ బాలికల హైస్కూల్‌లో ఆదివారం నియోజకవర్గస్థాయి ఎన్‌ఎంఎంఎస్ ప్రతిభా పరీక్షలు జరిగాయి. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పదో తరగతి పరీక్షలకు విద్యార్థులు మరింత సమాయత్తం కావాలన్నారు. రాష్ట్రంలోనే కనిగిరి నియోజకవర్గ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించి గుర్తింపు తీసుకురావాలని కోరారు. ఉపాధ్యాయులు చెప్పే పాఠ్యాంశాలను విద్యార్థులు శ్రద్ధగా చదివి ఆకళింపు చేసుకోవాలని సూచించారు. తరచూ పోటీ పరీక్షల్లో పాల్గొని ఉత్తమ ఫలితాలు సాధించేందుకు పట్టు సంపాదించుకోవాలన్నారు. ఎన్‌ఎంఎంఎస్ నమూనాతో నిర్వహించే పరీక్షలతో విద్యార్థులు ఫైనల్ పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించవచ్చునని చెప్పారు. ప్రతిభా పరీక్షల్లో వచ్చిన మార్కుల ఆధారంగా ఏఏ సబ్జక్టుల్లో వెనుకబడి ఉన్నారో తెలుసుకుని వాటిలో మరింత తర్ఫీదు పొందాలన్నారు.

అనంతరం పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. నియోజకవర్గస్థాయిలో జరిగిన ఈపరీక్షల్లో మండలంలోని కొత్త ఏరువారిపల్లి హైస్కూల్‌కు చెందిన పి.లక్ష్మీమేఘన మొదటి బహుమతి సాధించగా, వి.లక్ష్మీయశస్విని రెండవ బహుమతి సాధించింది. లింగారెడ్డిపల్లి హైస్కూల్‌కు చెందిన వెంకటసుశాంత్‌తేజ మూడవ బహుమతి, మహ్మదాపురం హైస్కూల్‌కు చెందిన శివ మల్లికార్జున్ నాల్గవ బహుమతి, లింగారెడ్డిపల్లి హైస్కూల్‌కు చెందిన ఎం.నవ్య ఐదవ బహుమతి సాధించారు.

అలాగే, యువశక్తి మేధా నైపుణ్య పరీక్షల్లో తాళ్ళూరు హైస్కూల్‌కు చెందిన ఎస్.వేణుగోపాలాచారి మొదటి బహుమతి, వెలిగండ్ల హైస్కూల్‌కు చెందిన ఆర్.ఖాజానాగూర్ రెండవ బహుమతి, ఎస్‌కే సనాసమీరా మూడవ బహుమతి, ఆర్.జితేంద్ర నాల్గవ బహుమతి, కార్తికేయ ఐదవ బహుమతి అందుకున్నారు.

కార్యక్రమంలో డిప్యూటీఈవో శ్రీనివాసులురెడ్డి, ఎంఈవోల సంఘం అధ్యక్షుడు దేవిరెడ్డి రామిరెడ్డి, యూవీ నారాయణరెడ్డి, ఆర్.శ్రీనివాసులు, సంజీవి, కరుణ కుమారి, హెచ్‌ఎంలు కలవ విజయలక్ష్మి, కోటిరెడ్డి, పెద్దిరెడ్డి, రమా, సాంబశివరావు, వెంకటస్వామి రెడ్డి, ఎమ్మెస్సార్ ప్రిన్సిపాల్ వెంకటరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సిటీ యూనియన్ బ్యాంక్ లిమిటెడ్
క్రెడిట్ రికవరీ మరియు మేనేజ్‌మెంట్ శాఖ
పరిపాలనా కార్యాలయము : నం. 24-B, గాంధీనగర్, కుంబకోణం - 612001.
ఇ-మెయిల్ ఐడీ: crmd@cityunionbank.in, ఫోన్ : 0435-2432322, ఫ్యాక్స్ : 0435-2431746

SARFAESI చట్టం 2002 క్రింద ఈ-టెండరు - సహిత - వేలం అమ్మకం ప్రకటన

రుణగ్రహీతలు/హామీదారులు : నం.1) శ్రీ కోమట్ల మధుసూదన రెడ్డి తండ్రి పోతురాజు రెడ్డి, డి.నం.1/148, పెద్దగంజాం, చిన్నగంజాం, ప్రకాశం జిల్లా, ఆంధ్రప్రదేశ్-523186. నం.2) శ్రీమతి కోమట్ల రాజమణి, భర్త కోమట్ల మధుసూదన రెడ్డి, డి.నం. 1/148, పెద్దగంజాం, చిన్నగంజాం, ప్రకాశం జిల్లా, ఆంధ్రప్రదేశ్-523186. నం.3) శ్రీ కోమట్ల దామోదర రెడ్డి, తండ్రి పోతురాజు రెడ్డి, డి.నం.1/148, పెద్దగంజాం, చిన్నగంజాం, ప్రకాశం జిల్లా, ఆంధ్రప్రదేశ్-523186. వారి నుండి 06.08.2025 నుండి చార్జి చేయబడే తదుపరి వడ్డీ, ఇతర ఖర్చులు, ఏవేని ఇతర బకాయిలతో కలిపి 05.08.2025 నాటికి రూ.40,48,100/- (రూపాయలు నలభై లక్షల నలభై ఎనిమిదివేల ఒక వంద మాత్రమే)లను రాబట్టుకొనుటకు సెక్యూరిటీ ఇంట్రెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్సు, 2002లోని రూలు 8(6) & 9 క్రింద, SARFAESI చట్టం 2002 క్రింద సిటీ యూనియన్ బ్యాంక్ లిమిటెడ్‌కు తనఖాపెట్టిన దిగువ ఆస్తి / ఆస్తులు బ్యాంక్ అధీకృత అధికారిచే ఈ-టెండరు-సహిత-బహిరంగ వేలంలో విక్రయించబడును.

మా బ్యాంక్‌కు తనఖా పెట్టబడిన స్థిరాస్తులు

షెడ్యూలు-A : (శ్రీ కోమట్ల మధుసూదన రెడ్డి తండ్రి పోతురాజు రెడ్డికి చెందిన ఆస్తి)
ప్రకాశం జిల్లా రిజిస్ట్రేషన్, అమ్మనబ్రోలు సబ్ రిజిస్ట్రేషన్, చిన్నగంజాం మండలం, పెద్ద గంజాం పంచాయతీ మరియు గ్రామం, సర్వే నం.607/3ఎ, డోర్ నం.1-14 సమీపాన, మొత్తం ఎ.0.47 సెంట్లలో ప్రస్తుతం ఉన్న భూమి మరియు ఇప్పుడు దానిపై ఉన్న లేదా భవిష్యత్‌లో దానిలో నిర్మించబోయే కట్టడాలతో ఆస్తి యావత్తు. షెడ్యూలు ఆస్తి సరిహద్దులు: తూర్పు: కోమట్ల గంగాధర్ స్థలం, దక్షిణం: కోమట్ల దామోదర్ రెడ్డికి ఇవ్వబడిన స్థలం, పశ్చిమం: డొంక రోడ్, ఉత్తరం: కోమట్ల మధుసూదన రెడ్డికి ఇవ్వబడిన స్థలం, షెడ్యూలు బి ఆస్తి: ఈ సరిహద్దులతో 435.6 చ.గజాలు విస్తీర్ణం కలిగిన స్థలం.

షెడ్యూలు-B : (శ్రీ కోమట్ల మధుసూదన రెడ్డి తండ్రి పోతురాజు రెడ్డికి చెందిన ఆస్తి)
ప్రకాశం జిల్లా రిజిస్ట్రేషన్, అమ్మనబ్రోలు సబ్ రిజిస్ట్రేషన్, చిన్నగంజాం మండలం, పెద్ద గంజాం పంచాయతీ మరియు గ్రామం, సర్వే నం.607/3ఎ, డోర్ నం.1-14 సమీపాన, మొత్తం ఎ.0.47 సెంట్లలో ప్రస్తుతం ఉన్న భూమి మరియు ఇప్పుడు దానిపై ఉన్న లేదా భవిష్యత్‌లో దానిలో నిర్మించబోయే కట్టడాలతో ఆస్తి యావత్తు. షెడ్యూలు ఆస్తి సరిహద్దులు: తూర్పు: కోమట్ల గంగాధర్ స్థలం, దక్షిణం: కోమట్ల మధుసూదన రెడ్డి స్థలం. A ఆస్తి. పశ్చిమం: డొంక రోడ్, ఉత్తరం: కోమట్ల పోతురాజు రెడ్డికి మిగిలిన స్థలం, ఈ సరిహద్దులతో 387.20 చ.గజాలు విస్తీర్ణం కలిగిన స్థలం.

రిజర్వు ధర: రూ. 19,00,000/-
(రూపాయలు పందొమ్మిది లక్షలు మాత్రమే) (షెడ్యూలు A&B కొరకు మాత్రమే)

షెడ్యూలు-C : (శ్రీ కోమట్ల దామోదర రెడ్డి తండ్రి పోతురాజు రెడ్డికి చెందిన ఆస్తి)
ప్రకాశం జిల్లా రిజిస్ట్రేషన్, అమ్మనబ్రోలు సబ్ రిజిస్ట్రేషన్, చిన్నగంజాం మండలం, పెద్ద గంజాం పంచాయతీ మరియు గ్రామం, సర్వే నం.607/3ఎ, డోర్ నం.1-14 సమీపాన, మొత్తం ఎ.0.47 సెంట్లలో ప్రస్తుతం ఉన్న భూమి మరియు ఇప్పుడు దానిపై ఉన్న లేదా భవిష్యత్‌లో దానిలో నిర్మించబోయే కట్టడాలతో ఆస్తి యావత్తు. షెడ్యూలు ఆస్తి సరిహద్దులు: తూర్పు: కోమట్ల గంగాధర్ స్థలం, దక్షిణం: కోమట్ల దామోదర్ రెడ్డికి ఇవ్వబడిన స్థలం, షెడ్యూల్-సి ఆస్తి, పశ్చిమం: డొంక రోడ్, ఉత్తరం: కోమట్ల మధుసూదన రెడ్డికి ఇవ్వబడిన స్థలం, ఈ సరిహద్దులతో 435.6 చ.గజాలు విస్తీర్ణం కలిగిన స్థలం.

షెడ్యూలు-E : (శ్రీ కోమట్ల దామోదర రెడ్డి తండ్రి పోతురాజు రెడ్డికి చెందిన ఆస్తి)
ప్రకాశం జిల్లా రిజిస్ట్రేషన్, అమ్మనబ్రోలు సబ్ రిజిస్ట్రేషన్, చిన్నగంజాం మండలం, పెద్ద గంజాం పంచాయతీ మరియు గ్రామం, సర్వే నం.607/3ఎ, డోర్ నం.1-14 సమీపాన, మొత్తం ఎ.0.47 సెంట్లలో ప్రస్తుతం ఉన్న భూమి మరియు ఇప్పుడు దానిపై ఉన్న లేదా భవిష్యత్‌లో దానిలో నిర్మించబోయే కట్టడాలతో ఆస్తి యావత్తు. షెడ్యూలు ఆస్తి సరిహద్దులు: తూర్పు: కోమట్ల గంగాధర్ స్థలం, దక్షిణం : కోమట్ల వెంకటప్పరెడ్డి స్థలం, పశ్చిమం : డొంక రోడ్, ఉత్తరం: కోమట్ల దామోదర రెడ్డి స్థలం షెడ్యూల్-ఎ ఆస్తి, స్థలం యొక్క విస్తీర్ణం 435.6 చ.గ.ల ఈ సరిహద్దులలో కలదు.

రిజర్వు ధర: రూ. 20,00,000/-
(రూపాయలు ఇరవై లక్షలు మాత్రమే) (షెడ్యూలు C&E కొరకు మాత్రమే)

షెడ్యూలు-D : (శ్రీ కోమట్ల దామోదర రెడ్డి తండ్రి పోతురాజు రెడ్డికి చెందిన ఆస్తి)
ప్రకాశం జిల్లా రిజిస్ట్రేషన్, అమ్మనబ్రోలు సబ్ రిజిస్ట్రేషన్, చిన్నగంజాం మండలం, పెద్ద గంజాం పంచాయతీ మరియు గ్రామం, సర్వే నం.609/3, డోర్ నం.1-14 సమీపాన, మొత్తం ఎ.0.19 సెంట్లలో ప్రస్తుతం ఉన్న భూమి మరియు ఇప్పుడు దానిపై ఉన్న లేదా భవిష్యత్‌లో దానిలో నిర్మించబోయే కట్టడాలతో ఆస్తి యావత్తు. షెడ్యూలు ఆస్తి సరిహద్దులు: తూర్పు: అసోది దుర్గారెడ్డి ఇళ్లు మరియు స్థలం, దక్షిణం: మోటమారి రాఘవ మరియు ఇతరుల ఇళ్ళు మరియు స్థలం, పశ్చిమం: పంచాయితీ రోడ్, ఉత్తరం: కోమట్ల వెంకటప్ప రెడ్డి స్థలం, ఈ సరిహద్దులతో 435.6 చ.గజాలు విస్తీర్ణం కలిగిన స్థలం.

రిజర్వు ధర: రూ. 14,00,000/-
(రూపాయలు పద్నాలుగు లక్షలు మాత్రమే)

ఈ- వేలం వివరాలు :

ఈ- టెండరు-సహిత-వేలం అమ్మకం తేది:	ప్రదేశం
19-12-2025	సిటీ యూనియన్ బ్యాంక్ లిమిటెడ్, ఒంగోలు శాఖ, నం.37-1-167 (55), గ్రౌండ్ ఫ్లోర్, వాసు ప్లాజా, కర్నూల్ రోడ్, ఒంగోలు, ప్రకాశం, ఆంధ్రప్రదేశ్-523002. టెలిఫోన్ నం.08592-282912, సెల్ నం.9347078104, 8925876329

ఈ- టెండరు-సహిత-వేలం అమ్మకం నియమ నిబంధనలు :
1. కాగోరు బిడ్డర్లు వేలంలో స్వయంగా పాల్గొనవలెను మరియు వ్యక్తిగతంగా పాల్గొనాలి మరియు అందుకు సంబంధించి అతని/ఆమె కొరకే అతను/ఆమె బిడ్డింగ్ వేస్తున్నట్లు వ్రాతపూర్వక ప్రకటన ఇవ్వవలసి ఉంటుంది. 2. కాగోరు బిడ్డర్లు మేనేజర్, సిటీ యూనియన్ బ్యాంక్ లిమిటెడ్, ఒంగోలు శాఖ, నం.37-1-167 (55), గ్రౌండ్ ఫ్లోర్, వాసు ప్లాజా, కర్నూల్ రోడ్, ఒంగోలు, ప్రకాశం, ఆంధ్రప్రదేశ్-523002 వారి నుండి టెండరు ఫారాలను పొందవచ్చును. 3. కాగోరు బిడ్డర్లు వారి బిడ్డను "సిటీ యూనియన్ బ్యాంక్ లిమిటెడ్" పేరున రిజర్వు ధరలో 10 శాతం బయానా కొరకు తీసిన డిమాండ్ డ్రాఫ్ట్ / పే ఆర్డర్ రూపంలో ఉన్నదానితోపాటుగా ఇందులో తెలిపిన టెండరు-సహిత-వేలం అమ్మకం తేదీన మ.12.00 గం.కు లేదా అలోగా అధీకృత అధికారి, సిటీ యూనియన్ బ్యాంక్ లిమిటెడ్ వారి చిరునామాకు సీల్డు ఎన్వలప్‌లో నిర్దిష్టపరిచిన టెండరు ఫారంలో మాత్రమే వారి బిడ్డను దాఖలు చేయవలెను. 4. ఆస్తి తనిఖీ మరియు ఇతర వివరాల కొరకు కాగోరు కొనుగోలుదారు టెలిఫోన్ నం.08592-282912, సెల్ నం.9347078104,8925876329లను సంప్రదించవచ్చును. 5. ఆస్తి / ఆస్తులు "ఎక్కడ ఎలా ఉన్నవి అక్కడ అలా" మరియు "అక్కడ ఏది ఉన్నదో అది" ప్రాతిపదికన విక్రయించబడతాయి. 6. ఇందులో తెలిపిన టెండరు-సహిత-వేలం అమ్మకం తేదీన మ.1.00 గం.కు కాగోరు బిడ్డర్ల సమక్షంలో సీల్డ్ టెండర్లు తెరవబడతాయి. అమ్మకం సాధారణంగా ముగింపు టెండర్ల రూపంలోనే ఉంటుంది. అధీకృత అధికారి అతని విచక్షణ మేరకు టెండరు ప్రక్రియ ముగింపు సమయంలో స్వీకరించబడిన దానికన్నా అత్యధిక బిడ్డను కోట్ చేయుటకు ఆసక్తి వ్యక్తం చేసిన బిడ్డర్ల మధ్య బహిరంగ వేలం నిర్వహించవచ్చును మరియు అటువంటి సందర్భంలో అత్యధిక బిడ్ వేసిన వ్యక్తికే అమ్మకం సంక్రమిస్తుంది. అయితే అమ్మకం సిటీ యూనియన్ బ్యాంక్ లిమిటెడ్ నిర్ధారణకు లోబడి ఉంటుంది. 7. గెలుపొందిన బిడ్డరు అమ్మకం పూర్తయిన వెంటనే అమ్మకం మొత్తంలో 25% (చెల్లించిన బయానా కలిపి) చెల్లించాలి మరియు మిగిలిన 75% మొత్తమును అమ్మకం నిర్ధారణ తేదీ నుండి 15 రోజులలోగా చెల్లించాలి. లేనిచో ముందుగా డిపాజిట్ చేసిన 25% మొత్తం స్వాధీనం చేసుకొనబడుతుంది. 8. ఇందులో నిర్దిష్టపరచిన కాలపరిమితిలోగా మొత్తం అమ్మకం ప్రతిఫలం అందుకున్న తరువాత మాత్రమే గెలుపొందిన కొనుగోలుదారు పేరు మీద అమ్మకం సర్టిఫికేటును అధీకృత అధికారి జారీ చేస్తారు. 9. చట్టం క్రింద వర్తించు విధంగా స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజులు వంటి కన్వేయన్స్ కొరకు చెల్లించాల్సిన చార్జీలు/ఫీజులు గెలుపొందిన కొనుగోలుదారు భరించవలసి ఉంటుంది. 10. ప్రభుత్వానికి, ప్రభుత్వ రంగ సంస్థలకు మరియు స్థానిక సంస్థలకు బకాయిలు ఉన్న ఏవేని చట్టబద్ధ బకాయిలు (న్యాయపరంగా ఇంటి పన్ను, విద్యుత్ చార్జీలు మరియు ఇతర బకాయిలు) TDS, GST గెలుపొందిన బిడ్డరే చెల్లించాలి. 11. ఎటువంటి కారణం తెలియజేయకుండా బిడ్డను అంగీకరించు లేదా తిరస్కరించు లేదా అమ్మకాన్ని వాయిదా వేయు లేదా రద్దు చేయు అన్ని అధికారాలు అధీకృత అధికారి కలిగి ఉన్నారు.

ప్రదేశం : కుంబకోణం, తేది : 29.11.2025 — అధీకృత అధికారి

నమోదిత కార్యాలయం: 149, T.S.R. (Big) స్ట్రీట్, కుంబకోణం, తంజావూరు జిల్లా, తమిళనాడు-612001, CIN - L65110TN1904PLC001287, టెలిఫోన్ నం.0435-2402322, ఫ్యాక్స్:0435-2431746, వెబ్‌సైట్:www.cityunionbank.com





తుఫాన్ హెచ్చరికతో ముందస్తు జాగ్రత్త చర్యలలో భాగంగా అన్నిశాఖల అధికారులతో మాట్లాడుతున్న ఇన్‌చార్జి మంత్రి కొలుసు పార్థసారథి

తుఫాన్ నష్టాన్ని తగ్గించడానికి సిద్ధంగా ఉండాలి

అధికారులను ఆదేశించిన ఇన్‌చార్జి మంత్రి పార్థసారథి

బాపట్ల, నవంబరు 30(ఆంధ్రజ్యోతి) : దిత్వా తుఫాన్ నష్టాన్ని తగ్గించడానికి యంత్రాంగం అంతా సంసిద్ధంగా ఉండాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. తుఫాన్ ముందస్తు జాగ్రత్త చర్యలపై అన్నిశాఖల జిల్లా అధికారులతో ఆదివారం స్థానిక కలెక్టరేట్‌లో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గత తుఫాన్ అనుభవాలతో సమర్థంగా పనిచేయాలని అధికారులకు సూచించారు. అద్దంకి, చినగంజాం మండలాలకు హై అలర్ట్ ఉందన్నారు. జిల్లాలో తీరప్రాంతం అధికంగా ఉన్నందున ఫిష్‌ల్యాండింగ్ సెంటర్‌లు ఎన్ని ఉన్నాయి. బోట్లు అన్ని తీరానికి వచ్చాయా లేదా పునఃపరిశీలన చేయాలన్నారు.మత్స్యకారులను సముద్రంలోనికి వెళ్ళనీయరాదన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చాలా సూక్ష్మ దృష్టితో పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. సీఎం, సీఎస్ సూచనలను పరిగణంలోకి తీసుకోవాలన్నారు. జనజీవనానికి ఇబ్బందులు లేకుండా సమగ్ర ప్రణాళికతో చర్యలు తీసుకోవాలన్నారు. విద్యుత్ సరఫరాకు ఏదైన సమస్య వస్తే తక్షణమే స్పందించాలన్నారు. సాగునీటి కాల్వలను పరిశీలించుకోవాలన్నారు. భారీవర్షాలకు అధిక నీటి ప్రవాహంతో కల్వర్టులు, చెరువులు, కాల్వల గట్లు తెగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. కాల్వలు, రహదార్లు పొంగిపొర్లిపారే ప్రాంతాలను గుర్తించి ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. ధాన్యం రైతులు ఎవరికీ నష్టం జరగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. కలెక్టర్ వినోద్‌కుమార్ మాట్లాడుతూ 47 ఫిష్‌ల్యాండింగ్ సెంటర్లు ఉండగా 220 మెకానిషెడ్ బోట్లు, 400 మోటర్‌రైజ్‌బోట్లను సురక్షితంగా భద్రపరిచినట్లు తెలిపారు. ఎస్పీ బి.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ తుఫాన్‌తో పోలీసింగ్ యంత్రాంగం అప్రమత్తమైందని తెలిపారు. జేసీ భావన వశిష్ట మాట్లాడుతూ ఇప్పటికే 3వేల టార్పాలిన్ పట్టాలు రైతు సేవా కేంద్రాలకు చేరాయని మరో 1100 కొనుగోలు చేశామని సోమవారం ఆయా ప్రాంతాలకు చేరుతాయన్నారు. 28 మిల్లులు బ్యాంక్ పూచీకత్తు ఇవ్వగా ధాన్యం సేకరణ ప్రక్రియ వేగంగా సాగుతుందన్నారు. రైతు సేవాకేంద్రాల్లో 1.50 లక్షల గోనెసంచులు సిద్ధంగా ఉన్నాయన్నారు. సమావేశంలో డీఆర్‌వో జి.గంగాధర్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

పోలీసులు అప్రమత్తంగా ఉండాలి: ఎస్పీ

తుఫాన్ ప్రభావం జిల్లాపై ఉంటుందని వాతావరణశాఖ హెచ్చరిక జారీ చేసిన నేపథ్యంలో పోలీసులు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ బి.ఉమామహేశ్వర్ తెలిపారు. పోలీసు కార్యాలయం నుంచి ఆదివారం ఆయన సెల్ కాన్ఫరెన్స్ నిర్వహించి అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ తుఫాన్‌ను సమర్థంగా ఎదుర్కొనేందుకు ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వాతావరణశాఖ సమాచారం మేరకు అద్దంకి, చినగంజాం, రేపల్లె, నిజాంపట్నం, నగరం మండలాలపై తుఫాన్ ప్రభావం అధికంగా ఉండే అవకాశం ఉందన్నారు. ఇందుకు అనుగుణంగా పోలీసులు భద్రతాచర్యలు తీసుకోవాలన్నారు. రెస్క్యూ, క్యూఆర్‌టీ బృందాలను సిద్ధం చేశామన్నారు. పోలీసు ప్రధాన కార్యాలయం, రేపల్లె, చీరాల సబ్ డివిజన్ కార్యాలయాల్లో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేశామన్నారు. అత్యవసర పరిస్థితుల్లో 112, జిల్లా పోలీసు కంట్రోల్ రూమ్ నెంబరు 8333813228, సీసీఎస్ డీఎస్పీ పి.జగదీష్‌నాయక్ 8978777821, ఇన్‌స్పెక్టర్ ఎం.రాంబాబు 8978777261, చీరాల సబ్ డివిజన్ 9885380674, రేపల్లె సబ్ డివిజన్ 9063536377 నెంబర్లకు కాల్ చేయాలన్నారు.

నేడు ప్రజా సమస్యల పీజీఆర్‌ఎస్ రద్దు

బాపట్ల, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ దృష్ట్యా సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే పీజీఆర్‌ఎస్‌ను రద్దు చేసినట్లు కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రజలు ఎవరూ కూడా సమస్యల అర్జీలను అందజేసేందుకు జిల్లా కేంద్రానికి రావద్దన్నారు. పోలీసు ప్రధాన కార్యాలయంలో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కారవేదిక కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు ఎస్పీ బి.ఉమామహేశ్వర్ ఓ ప్రకటనలో తెలిపారు. తుఫాన్ ప్రభావం వల్ల జిల్లాలో భారీ వర్షాలు కురిసే ఉన్న నేపథ్యంలో పీజీఆర్‌ఎస్ కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేసినట్లు తెలిపారు. ఈ విషయాన్ని జిల్లా ప్రజలు గుర్తించాలని ఎస్పీ తెలిపారు.

అత్యాచార ఫిర్యాదుపై కేసు నమోదు

- నిందితుల్లో చీరాలకు చెందిన టీడీపీ నాయకురాలు

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

తనను బెదిరించి అత్యాచారం చేశారని చీరాలకు చెందిన ఓ మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు బాపట్ల టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. దీనికి సంబంధించి న్యాయవాది తులసీరావుతో పాటు టీడీపీ మహిళా నాయకురాలు, శ్రీకాళహస్తి దేవాలయ బోర్డు సభ్యురాలు కొమ్మనబోయిన రజని సహా మరో ఎనిమిది మందిపై కేసు నమోదు చేసినట్లు టౌన్ సీఐ రాంబాబు ఆదివారం తెలిపారు. వీడియోలను చూపించి తనను బెదిరించి అత్యాచారం చేశారని, దానికి రజని సహకరించారని చీరాలకు చెందిన మహిళ ఫిర్యాదులో పేర్కొన్నారు.

తీరంలో తీవ్ర ప్రభావం..

దిత్వా తుఫాన్ కదలికల తీరును చూస్తే తీర ప్రాంత పరిధిలోని 8 మండలాలపై అధిక ప్రభావం చూపవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. రేపల్లె, నిజాంపట్నం, బాపట్లతో పాటు కర్లపాలెం మండలాల్లో భారీ వర్షాలు కురవనున్నాయని అంచనాలు ఉన్నాయి. అద్దంకి, పర్చూరు నియోజకవర్గాలతో పాటు గుంటూరు, పల్నాడు జిల్లాల్లో పలు ప్రాంతాల్లో సోమ, మంగళవారాల్లో భారీ వర్షాలు నమోదయ్యే అవకాశం ఉందనే అంచనాను వాతావరణశాఖ వేస్తోంది. కాగా తుఫాన్ సన్నద్ధతలో భాగంగా కలెక్టరేట్‌లో కంట్రోల్ రూంను ఏర్పాటు చేశారు. తుఫాన్ కారణంగా బాపట్ల సూర్యలంక సముద్రతీరాన్ని తాత్కాలికంగా మూసివేసినట్లు రూరల్ సీఐ శ్రీనివాస్ తెలిపారు.

తీరంలో ఉధృతంగా అలలు..



నిజాంపట్నం హార్బర్‌లో 3వనెంబర్ ప్రమాద హెచ్చరిక ఎగురవేత

బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం తుఫాన్‌గా మారడంతో సముద్రంలో ఆదివారం అలల ఉధృతి పెరిగింది. ఈదురుగాలులతో పాటు వర్షం కూడా పడింది. దీంతో నిజాంపట్నం హార్బర్‌లో 3వ నెంబరు ప్రమాద హెచ్చరిక ఎగురవేసినట్లు పోర్టు అధికారులు తెలిపారు. సముద్రంలో వేట చేసే మత్స్యకారులంతా తక్షణమే ఒడ్డుకు చేరాలని వాకీటాకీల ద్వారా సమాచారం అందజేశారు.



కొల్లూరు : రోడ్డు వెంబడి పట్టాలు కప్పి భద్రపరుచుకున్న ధాన్యం రాశులు



రేపల్లె : గుడిపల్లి సమీపంలో వర్షం కారణంగా బస్తాల్లోకి వరిధాన్యాన్ని ఎత్తుకుంటున్న రైతులు

దూసుకువస్తోన్న తుఫాన్

- అక్కడక్కడ వర్షం.. అన్నదాతల ఆందోళన
- నేడు, రేపు భారీ వర్షాలన్న వాతావరణశాఖ
- నిజాంపట్నం పోర్టులో మూడో ప్రమాద హెచ్చరిక
- పంట కాపాడుకునేందుకు రైతుల ఉరుకులు పరుగులు

రైతుల్లో.. దిత్వా దడ

(బాపట్ల, బాపట్లరూరల్, రేపల్లె, ఆంధ్రజ్యోతి)

దూసుకువస్తోన్న దిత్వా తుఫాన్ రైతుల గుండెల్లో దడ పుట్టిస్తోంది. దిత్వా తుఫాన్ ప్రభావం ఆదివారం అక్కడక్కడ కనిపించింది. ఉదయం నుంచి ఆకాశం మేఘావృతమై ఉంటే, మధ్యాహ్నం నుంచి చిరు జల్లులు మొదలయ్యాయి. బాపట్ల జిల్లాకు ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసిన వాతావరణశాఖ పల్నాడు, గుంటూరు జిల్లాలకు ఎల్లో అలెర్ట్ ఇచ్చింది. దీంతో రైతుల్లో మరింత గుబులు మొదలైంది. ఆరబెట్టిన ధాన్యం తడిచిపోకుండా కాపాడుకునేందుకు పరుగులు పెట్టారు. ఉదయం నుంచి రాత్రి వరకు చలిగాలులు వీచాయి. తుఫాన్ ప్రభావంతో సోమ, మంగళవారాల్లో భారీ వర్షాలు నమోదవుతాయని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. ఈ హెచ్చరికలు అన్నదాతలకు కంటిపై కునుకులేకుండా చేస్తున్నాయి. దాదాపు వరి పంట కోతకు వచ్చింది. తుఫాన్ హెచ్చరికలతో జిల్లావ్యాప్తంగా యంత్రాలతో ముమ్మరంగా నూర్పిళ్లు చేస్తున్నారు. కల్లాల్లోనే ఉన్న ధాన్యం రాశులను ఇళ్లకు తరలించేందుకు రైతులు అష్టకష్టాలు పడుతున్నారు. ఆదివారం ఆకాశం మేఘావృతమైంది. కొన్ని గ్రామాల్లో చినుకులు కూడా పడ్డాయి. ఆరబోసిన ధాన్యం తడిచిపోతుందేమోనన్న భయం ఒకపక్క, కోతకోసి చేలల్లోనే వదిలిన వరి ఓదెలు తడిస్తే, రంగుమారిన ధాన్యం కొనరేమోననే ఆందోళన మరోపక్క.. ఎటు చూసినా రైతన్నల ఉరుకులు పరుగులే. టార్పాలిన్ పట్టాలు పట్టుకుని ఆరబోసిన ధాన్యంపై కప్పేందుకు హడావుడి. పంట రక్షణకు ఒకవైపు హార్వెస్టింగ్ యంత్రాలతో పాటు కూలీల కొరత రైతులను వెంటాడుతోంది. ఆరుగాలం శ్రమించి పండించిన ధాన్యం లోగిళ్లకు చేరే సమయంలో వర్షాలతో రైతులు దారుణంగా నష్టపోయే ప్రమాదం పొంచి ఉంది. వర్షాలు కురిస్తే పొలాల్లోనే ధాన్యం తడిచి ముద్దయ్యే ప్రమాదకర పరిస్థితులు నెలకొనడంతో అన్నదాతలు ఆవేదనకు లోనవుతున్నారు. మొంథా తుఫాన్‌తో ఇప్పటికే చాలావరకు నష్టపోయిన రైతులను దిత్వా అరకొర ఉన్న పంటలను కూడా ఊడ్చేస్తుందేమోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. బాపట్ల జిల్లాలో వేలాది ఎకరాల్లో వరి నూర్పిళ్లు జరుగుతున్నాయి. రైతులు ధాన్యాన్ని కల్లాల్లో.. రోడ్లపై ఆరబెట్టారు. ప్రస్తుతానికి వర్షాలకు తడవకుండా ధాన్యంపై పట్టలు కప్పుతున్నారు. భారీ వర్షం పడితే చేతికి అందివచ్చిన ధాన్యం నీటి పాలయ్యే ప్రమాదం ఉంది. కాగా మంత్రులు, కలెక్టర్లు ధాన్యం కొనుగోళ్లను పరిశీలిస్తూ రైతుల కోసం నిబంధనలను సడలించుకుంటూ ఆదేశాలు జారీ చేస్తున్నా, కింది స్థాయి సిబ్బంది, మిల్లర్ల మాయాజాలంతో కష్టాలు తప్పటంలేదు.

బాపట్ల జిల్లా : ఆరెంజ్ అలెర్ట్
గుంటూరు జిల్లా : ఎల్లో అలెర్ట్
పల్నాడు జిల్లా : ఎల్లో అలెర్ట్

సిటీ యూనియన్ బ్యాంక్ లిమిటెడ్
CUB TRUST AND EXCELLENCE SINCE 1904
క్రెడిట్ రికవరీ మరియు మేనేజ్‌మెంట్ శాఖ
పరిపాలనా కార్యాలయము : నం. 24-B, గాంధీనగర్, కుంబకోణం - 612001.
ఇ-మెయిల్ ఐడి: crmd@cityunionbank.in, ఫోన్ : 0435-2432322, ఫ్యాక్స్ : 0435-2431746

SARFAESI చట్టం 2002 క్రింద రీ-టెండరు - సహిత - వేలం అమ్మకం ప్రకటన

రుణగ్రహీతలు/హామీదారులు : నం.1) శ్రీ కోమట్ల మధుసూదన రెడ్డి తండ్రి పోతురాజు రెడ్డి, డి.నం.1/148, పెద్దగంజాం, చిన్నగంజాం, ప్రకాశం జిల్లా, ఆంధ్రప్రదేశ్-523186. నం.2) శ్రీమతి కోమట్ల రాజమణి, భర్త కోమట్ల మధుసూదన రెడ్డి, డి.నం. 1/148, పెద్దగంజాం, చిన్నగంజాం, ప్రకాశం జిల్లా, ఆంధ్రప్రదేశ్-523186. నం.3) శ్రీ కోమట్ల దామోదర రెడ్డి, తండ్రి పోతురాజు రెడ్డి, డి.నం.1/148, పెద్దగంజాం, చిన్నగంజాం, ప్రకాశం జిల్లా, ఆంధ్రప్రదేశ్-523186. వారి నుండి 06.08.2025 నుండి చార్జి చేయబడే తదుపరి వడ్డీ, ఇతర ఖర్చులు, ఏవేని ఇతర బకాయితో కలిపి 05.08.2025 నాటికి రూ.40,48,100/- (రూపాయలు నలభై లక్షల నలభై ఎనిమిదివేల ఒక వంద మాత్రమే)లను రాబట్టుకొనుటకు సెక్యూరిటీ ఇంట్రెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్సు, 2002లోని రూలు 8(6) & 9 క్రింద, SARFAESI చట్టం 2002 క్రింద సిటీ యూనియన్ బ్యాంక్ లిమిటెడ్‌కు తనఖాపెట్టిన దిగువ ఆస్తి / ఆస్తులు బ్యాంక్ అధీకృత అధికారిచే రీ-టెండరు-సహిత-బహిరంగ వేలంలో విక్రయించబడును.

మా బ్యాంక్‌కు తనఖా పెట్టబడిన స్థిరాస్తులు

షెడ్యూలు-A : (శ్రీ కోమట్ల మధుసూదన రెడ్డి తండ్రి పోతురాజు రెడ్డికి చెందిన ఆస్తి)
ప్రకాశం జిల్లా రిజిస్ట్రేషన్, అమ్మనబ్రోలు సబ్ రిజిస్ట్రేషన్, చిన్నగంజాం మండలం, పెద్దగంజాం పంచాయతీ మరియు గ్రామం, సర్వే నం.607/3ఎ, డోర్ నం.1-14 సమీపాన, మొత్తం ఎ.0.47 సెంట్లలో ప్రస్తుతం ఉన్న భూమి మరియు ఇప్పుడు దానిపై ఉన్న లేదా భవిష్యత్‌లో దానిలో నిర్మించబోయే కట్టడాలతో ఆస్తి యావత్తు. షెడ్యూలు ఆస్తి సరిహద్దులు: తూర్పు: కోమట్ల గంగాధర్ స్థలం, దక్షిణం: కోమట్ల దామోదర్ రెడ్డికి ఇవ్వబడిన స్థలం, పశ్చిమం: డొంక రోడ్, ఉత్తరం: కోమట్ల మధుసూదన రెడ్డికి ఇవ్వబడిన స్థలం, షెడ్యూలు బి ఆస్తి: ఈ సరిహద్దులతో 435.6 చ.గజాలు విస్తీర్ణం కలిగిన స్థలం.

షెడ్యూలు-B : (శ్రీ కోమట్ల మధుసూదన రెడ్డి తండ్రి పోతురాజు రెడ్డికి చెందిన ఆస్తి)
ప్రకాశం జిల్లా రిజిస్ట్రేషన్, అమ్మనబ్రోలు సబ్ రిజిస్ట్రేషన్, చిన్నగంజాం మండలం, పెద్దగంజాం పంచాయతీ మరియు గ్రామం, సర్వే నం.607/3ఎ, డోర్ నం.1-14 సమీపాన, మొత్తం ఎ.0.47 సెంట్లలో ప్రస్తుతం ఉన్న భూమి మరియు ఇప్పుడు దానిపై ఉన్న లేదా భవిష్యత్‌లో దానిలో నిర్మించబోయే కట్టడాలతో ఆస్తి యావత్తు. షెడ్యూలు ఆస్తి సరిహద్దులు: తూర్పు: కోమట్ల గంగాధర్ స్థలం, దక్షిణం: కోమట్ల మధుసూదన రెడ్డి స్థలం. A ఆస్తి. పశ్చిమం: డొంక రోడ్, ఉత్తరం: కోమట్ల పోతురాజు రెడ్డికి మిగిలిన స్థలం, ఈ సరిహద్దులతో 387.20 చ.గజాలు విస్తీర్ణం కలిగిన స్థలం.

రిజర్వు ధర: రూ. 19,00,000/-
(రూపాయలు పందొమ్మిది లక్షలు మాత్రమే) (షెడ్యూలు A&B కొరకు మాత్రమే)

షెడ్యూలు-C : (శ్రీ కోమట్ల దామోదర రెడ్డి తండ్రి పోతురాజు రెడ్డికి చెందిన ఆస్తి)
ప్రకాశం జిల్లా రిజిస్ట్రేషన్, అమ్మనబ్రోలు సబ్ రిజిస్ట్రేషన్, చిన్నగంజాం మండలం, పెద్దగంజాం పంచాయతీ మరియు గ్రామం, సర్వే నం.607/3ఎ, డోర్ నం.1-14 సమీపాన, మొత్తం ఎ.0.47 సెంట్లలో ప్రస్తుతం ఉన్న భూమి మరియు ఇప్పుడు దానిపై ఉన్న లేదా భవిష్యత్‌లో దానిలో నిర్మించబోయే కట్టడాలతో ఆస్తి యావత్తు. షెడ్యూలు ఆస్తి సరిహద్దులు: తూర్పు: కోమట్ల గంగాధర్ స్థలం, దక్షిణం: కోమట్ల దామోదర్ రెడ్డికి ఇవ్వబడిన స్థలం, షెడ్యూల్-సి ఆస్తి, పశ్చిమం: డొంక రోడ్, ఉత్తరం: కోమట్ల మధుసూదన రెడ్డికి ఇవ్వబడిన స్థలం, ఈ సరిహద్దులతో 435.6 చ.గజాలు విస్తీర్ణం కలిగిన స్థలం.

షెడ్యూలు-E : (శ్రీ కోమట్ల దామోదర రెడ్డి తండ్రి పోతురాజు రెడ్డికి చెందిన ఆస్తి)
ప్రకాశం జిల్లా రిజిస్ట్రేషన్, అమ్మనబ్రోలు సబ్ రిజిస్ట్రేషన్, చిన్నగంజాం మండలం, పెద్దగంజాం పంచాయతీ మరియు గ్రామం, సర్వే నం.607/3ఎ, డోర్ నం.1-14 సమీపాన, మొత్తం ఎ.0.47 సెంట్లలో ప్రస్తుతం ఉన్న భూమి మరియు ఇప్పుడు దానిపై ఉన్న లేదా భవిష్యత్‌లో దానిలో నిర్మించబోయే కట్టడాలతో ఆస్తి యావత్తు. షెడ్యూలు ఆస్తి సరిహద్దులు: తూర్పు: కోమట్ల గంగాధర్ స్థలం, దక్షిణం : కోమట్ల వెంకటప్పరెడ్డి స్థలం, పశ్చిమం : డొంక రోడ్, ఉత్తరం: కోమట్ల దామోదర రెడ్డి స్థలం షెడ్యూల్-ఎ ఆస్తి, స్థలం యొక్క విస్తీర్ణం 435.6 చ.గ.ల ఈ సరిహద్దులలో కలదు.

రిజర్వు ధర: రూ. 20,00,000/-
(రూపాయలు ఇరవై లక్షలు మాత్రమే) (షెడ్యూలు C&E కొరకు మాత్రమే)

షెడ్యూలు-D : (శ్రీ కోమట్ల దామోదర రెడ్డి తండ్రి పోతురాజు రెడ్డికి చెందిన ఆస్తి)
ప్రకాశం జిల్లా రిజిస్ట్రేషన్, అమ్మనబ్రోలు సబ్ రిజిస్ట్రేషన్, చిన్నగంజాం మండలం, పెద్దగంజాం పంచాయతీ మరియు గ్రామం, సర్వే నం.609/3, డోర్ నం.1-14 సమీపాన, మొత్తం ఎ.0.19 సెంట్లలో ప్రస్తుతం ఉన్న భూమి మరియు ఇప్పుడు దానిపై ఉన్న లేదా భవిష్యత్‌లో దానిలో నిర్మించబోయే కట్టడాలతో ఆస్తి యావత్తు. షెడ్యూలు ఆస్తి సరిహద్దులు: తూర్పు: అసోది దుర్గారెడ్డి ఇళ్లు మరియు స్థలం, దక్షిణం: మోటమారి రాఘవ మరియు ఇతరుల ఇళ్ళు మరియు స్థలం, పశ్చిమం: పంచాయితీ రోడ్, ఉత్తరం: కోమట్ల వెంకటప్ప రెడ్డి స్థలం, ఈ సరిహద్దులతో 435.6 చ.గజాలు విస్తీర్ణం కలిగిన స్థలం.

రిజర్వు ధర: రూ. 14,00,000/-
(రూపాయలు పద్నాలుగు లక్షలు మాత్రమే)

రీ- వేలం వివరాలు :

రీ- టెండరు-సహిత-వేలం అమ్మకం తేది:	ప్రదేశం
19-12-2025	సిటీ యూనియన్ బ్యాంక్ లిమిటెడ్, ఒంగోలు శాఖ, నం.37-1-167 (55), గ్రౌండ్ ఫ్లోర్, వాసు ప్లాజా, కర్నూల్ రోడ్, ఒంగోలు, ప్రకాశం, ఆంధ్రప్రదేశ్-523002. టెలిఫోన్ నం.08592-282912, సెల్ నం.9347078104, 8925876329

రీ- టెండరు-సహిత-వేలం అమ్మకం నియమ నిబంధనలు :
1. కాగోరు బిడ్డర్లు వేలంలో స్వయంగా పాల్గొనవలెను మరియు వ్యక్తిగతంగా పాల్గొనాలి మరియు అందుకు సంబంధించి అతని/ఆమె కొరకే అతను/ఆమె బిడ్డింగ్ వేస్తున్నట్లు వ్రాతపూర్వక ప్రకటన ఇవ్వవలసి ఉంటుంది. 2. కాగోరు బిడ్డర్లు మేనేజర్, సిటీ యూనియన్ బ్యాంక్ లిమిటెడ్, ఒంగోలు శాఖ, నం.37-1-167 (55), గ్రౌండ్ ఫ్లోర్, వాసు ప్లాజా, కర్నూల్ రోడ్, ఒంగోలు, ప్రకాశం, ఆంధ్రప్రదేశ్-523002 వారి నుండి టెండరు ఫారాలను పొందవచ్చును. 3. కాగోరు బిడ్డర్లు వారి బిడ్లను "సిటీ యూనియన్ బ్యాంక్ లిమిటెడ్" పేరున రిజర్వు ధరలో 10 శాతం బయానా కొరకు తీసిన డిమాండ్ డ్రాఫ్ట్ / పే ఆర్డర్ రూపంలో ఉన్నదానితోపాటుగా ఇందులో తెలిపిన టెండరు-సహిత-వేలం అమ్మకం తేదీన మ.12.00 గం.కు లేదా అలోగా అధీకృత అధికారి, సిటీ యూనియన్ బ్యాంక్ లిమిటెడ్ వారి చిరునామాకు సీల్డు ఎన్వలప్‌లలో నిర్దిష్టపరిచిన టెండరు ఫారంలో మాత్రమే వారి బిడ్లను దాఖలు చేయవలెను. 4. ఆస్తి తనిఖీ మరియు ఇతర వివరాల కొరకు కాగోరు కొనుగోలుదారు టెలిఫోన్ నం.08592-282912, సెల్ నం.9347078104,8925876329లను సంప్రదించవచ్చును. 5. ఆస్తి / ఆస్తులు "ఎక్కడ ఎలా ఉన్నవి అక్కడ అలా" మరియు "అక్కడ ఏది ఉన్నదో అది" ప్రాతిపదికన విక్రయించబడతాయి. 6. ఇందులో తెలిపిన టెండరు-సహిత-వేలం అమ్మకం తేదీన మ.1.00 గం.కు కాగోరు బిడ్డర్ల సమక్షంలో సీల్డ్ టెండర్లు తెరవబడతాయి. అమ్మకం సాధారణంగా ముగింపు టెండర్ల రూపంలోనే ఉంటుంది. అధీకృత అధికారి అతని విచక్షణ మేరకు టెండరు ప్రక్రియ ముగింపు సమయంలో స్వీకరించబడిన దానికన్నా అత్యధిక బిడ్డును కోట్ చేయుటకు ఆసక్తి వ్యక్తం చేసిన బిడ్డర్ల మధ్య బహిరంగ వేలం నిర్వహించవచ్చును మరియు అటువంటి సందర్భంలో అత్యధిక బిడ్ వేసిన వ్యక్తికే అమ్మకం సంక్రమిస్తుంది. అయితే అమ్మకం సిటీ యూనియన్ బ్యాంక్ లిమిటెడ్ నిర్ధారణకు లోబడి ఉంటుంది. 7. గెలుపొందిన బిడ్డరు అమ్మకం పూర్తయిన వెంటనే అమ్మకం మొత్తంలో 25% (చెల్లించిన బయానా కలిపి) చెల్లించాలి మరియు మిగిలిన 75% మొత్తమును అమ్మకం నిర్ధారణ తేదీ నుండి 15 రోజులలోగా చెల్లించాలి. లేనిచో ముందుగా డిపాజిట్ చేసిన 25% మొత్తం స్వాధీనం చేసుకోనబడుతుంది. 8. ఇందులో నిర్దిష్టపరచిన కాలపరిమితిలోగా మొత్తం అమ్మకం ప్రతిఫలం అందుకున్న తరువాత మాత్రమే గెలుపొందిన కొనుగోలుదారు పేరు మీద అమ్మకం సర్టిఫికెట్‌ను అధీకృత అధికారి జారీ చేస్తారు. 9. చట్టం క్రింద వర్తించు విధంగా స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజులు వంటి కన్వేయన్స్ కొరకు చెల్లించాల్సిన చార్జీలు/ఫీజులు గెలుపొందిన కొనుగోలుదారు భరించవలసి ఉంటుంది. 10. ప్రభుత్వానికి, ప్రభుత్వ రంగ సంస్థలకు మరియు స్థానిక సంస్థలకు బకాయిలు ఉన్న ఏవేని చట్టబద్ధ బకాయిలు (న్యాయపరంగా ఇంటి పన్ను, విద్యుత్ చార్జీలు మరియు ఇతర బకాయిలు) TDS, GST గెలుపొందిన బిడ్డరే చెల్లించాలి. 11. ఎటువంటి కారణం తెలియజేయకుండా బిడ్లను అంగీకరించు లేదా తిరస్కరించు లేదా అమ్మకాన్ని వాయిదా వేయు లేదా రద్దు చేయు అన్ని అధికారాలు అధీకృత అధికారి కలిగి ఉన్నారు.

ప్రదేశం : కుంబకోణం, తేది : 29.11.2025 — అధీకృత అధికారి

నమోదిత కార్యాలయం: 149, T.S.R. (Big) స్ట్రీట్, కుంబకోణం, తంజావూరు జిల్లా, తమిళనాడు-612001, CIN - L65110TN1904PLC001287, టెలిఫోన్ నం.0435-2402322, ఫ్యాక్స్:0435-2431746, వెబ్‌సైట్:www.cityunionbank.com

ప్రత్యామ్నాయ చర్యలతో సహకరిస్తాం

- వేమూరులో అన్నదాతలకు జేసీ భావన వశిష్ట భరోసా

వేమూరు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసే విషయంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా అవసరమైతే ప్రత్యామ్నాయ చర్యలతో రైతులకు సహకరిస్తామని జేసీ భావన వశిష్ట, రేపల్లె ఆర్డీవో రామలక్ష్మి తెలిపారు. వేమూరు రైస్ మిల్లులకు కేటాయించిన లక్ష్యాలు పూర్తి కావడంతో అమ్మకానికి ధాన్యం సిద్ధం చేసిన రైతులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. స్థానిక పరిస్థితిని అధికారులు, కొందరు రైతులు జేసీ, ఆర్డీవో దృష్టికి తీసుకువెళ్లారు. స్పందించిన వారిద్దరూ ఆదివారం సాయంత్రం మేజర్ గ్రామమైన జంపనిని సందర్శించారు. రైతు సేవా కేంద్రంలో ఇప్పటి వరకు ఇచ్చిన టార్గెట్లు పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు అధికారులను కలిసి వాతావరణ పరిస్థితులతో దిక్కుతోచని పరిస్థితుల్లో ఉన్నామని ఆవేదన వ్యక్తం చేశారు. స్పందించిన జేసీ తమ లాగిన్ ద్వారా టార్గెట్లు పూర్తి చేసేందుకు అధికారులకు కొన్ని సూచనలు చేశారు.

చేనేతలు సంఘటితం కావాలి

- రాష్ట్ర సదస్సులో విశ్రాంత డీఐజీ డా.పూర్ణచంద్రరావు



చేనేత రాష్ట్ర సదస్సులో మాట్లాడుతున్న పూర్ణచంద్రరావు

చీరాల, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారం కోసం చేనేతలు సంఘటితం కావాలని బీఎస్పీ జాతీయ సమన్వయకర్త, విశ్రాంత డీఐజీ డా.పూర్ణచంద్రరావు తెలిపారు. పేరాల గోలి సదాశివకల్యాణ మండపంలో ఆదివారం జరిగిన చేనేత రాష్ట్ర సదస్సులో ఆయన ప్రసంగించారు. వృత్తి కోల్పోయిన చేనేతలకు భూమి పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. మగ్గాల్లో మగ్గుతున్న కార్మిక రంగం సంక్షోభంలో ఉందన్నారు. నిస్సహాయ కార్మికులకు రూ.5 వేల పింఛన్ అందించాలని డిమాండ్ చేశారు. అమరావతి అభివృద్ధి చెందినా, మంగళగిరి, చీరాల ప్రాంతాలు సమస్యల్లో ఉన్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఆహ్వాన కమిటీ అధ్యక్షుడు దామర్ల శ్రీకృష్ణ, కన్వీనర్ జంజనం శ్రీనివాసరావు, మాజీ మంత్రి పాలేటి రామారావు, పరంజ్యోతి, కార్యదర్శి చుండూరు వాసు, డా.హైమా సుబ్బారావు, రవికుమార్, వెంకటేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.



రోడ్లకు.. నిధులు

- 3 జిల్లాలకు రూ.14.33 కోట్లు
- జనవరికల్లా మరమ్మతులు పూర్తి

గుంటూరు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): గోతుల రోడ్లతో వాహన చోదకులు పడుతున్న ఇబ్బందులు తీరిపోనున్నాయి. రోడ్డుపై గుంత అనేది కనిపించకూడదని రాష్ట్ర ప్రభుత్వం రహదారులు భవనాల శాఖ జిల్లా అధికారులను ఆదేశించింది. మరమ్మతులకు నిధులు కూడా విడుదల చేసింది. ఫిబ్రవరి 28 నాటికి మరమ్మతులు పూర్తి చేయాలని తొలుత లక్ష్యంగా ఉన్నప్పటికీ డిసెంబరు 31కి రోడ్లపై గుంతలు కనిపించకుండా చేయాలన్నది అధికారులకు ప్రభుత్వం అల్టిమేటం ఇచ్చింది. దీంతో అధికారులు ఉరుకులు పరుగులు పెడుతున్నారు. రహదారుల వార్షిక నిర్వహణ కింద రోడ్లపై గుంతలు పూడ్చడం కోసం ప్రభుత్వం గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాలకు నిధులు కేటాయించింది. గుంటూరు జిల్లాలో రాష్ట్ర రహదారులకు సంబంధించి 9 పనులకు రూ.85.35 కోట్లు, ప్రధాన జిల్లా రహదారుల్లో 11 పనులకు రూ.134.25 కోట్లు, పల్నాడు జిల్లాలో రాష్ట్ర రహదారులకు సంబంధించి 15 పనులకు రూ.215.03 కోట్లు, జిల్లా రహదారుల్లో 17 పనులకు 206.33 కోట్లు, బాపట్ల జిల్లాలో రాష్ట్ర రహదారుల్లో 7 పనులకు 83.89 కోట్లు, జిల్లా రహదారుల్లో 7 పనులకు 108.27 కోట్లు కేటాయించింది. మొత్తంగా మూడు జిల్లాలకు రూ.14.33 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ ఏడాది జనవరి నాటికి గుంతలు లేని రోడ్లు ఉండాలన్న లక్ష్యంతో గతేడాది రాష్ట్ర ప్రభుత్వం 'పాట్ హోల్ ఫ్రీ రోడ్స్' పేరుతో రోడ్ల మరమ్మతులు చేపట్టింది. అయితే అవి తాత్కాలిక మరమ్మతులు కావడం, ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్లు దెబ్బతినడంతో మళ్లీ చాలా రోడ్లు దెబ్బతిన్నాయి. ఈ నేపథ్యంలో విధ్వంసమైన రోడ్ల దుస్థితిపై కిందటి వారం ఆంధ్రజ్యోతిలో ప్రత్యేక కథనం వచ్చింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం రహదారుల మరమ్మతులకు భారీగా నిధులు కేటాయించింది.

శ్రద్ధాంజలి

అజరామరమైన కీర్తి ప్రతిష్ఠల్ని, ఉన్నతమైన వ్యక్తిత్వాన్ని, దాతృత్వాన్ని
అణువణువునా నింపుకున్న మహోన్నతవ్యక్తి సుబ్బరామన్న



కీ॥శే॥ శ్రీ మాగుంట సుబ్బరామరెడ్డి గారు
ఒంగోలు పార్లమెంట్ మాజీ సభ్యులు
30వ వర్ధంతి
సందర్భంగా వారి పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థిస్తూ...
కుటుంబ సభ్యులు
మరియు అభిమానులు
తేది. 01-12-2025 సోమవారం ఉ॥ 10.00 గం॥ల నుండి
ఒంగోలు పి.వి.ఆర్ మున్సిపల్ బాలుర హైస్కూలు ఆవరణలో
సంస్మరణ సభ మరియు అన్నసంతర్పణ కార్యక్రమములు జరుగును.
అందరూ ఆహ్వానితులే...

'దిత్వా'తో రైతుల్లో ఆందోళన

● వరి, మొక్కజొన్న రైతుల బెంబేలు



కొమ్మినేనివారిపాలెంలో కోత దశలో ఉన్న వరి పైరు

అద్దంకి,నవంబరు30(ఆంధ్రజ్యోతి):దిత్వా తుఫాన్ రైతులలో ఆందోళన కలిగిస్తోంది. తుఫాన్ ప్రభావం అద్దంకి ప్రాంతంపై ఎక్కువగా ఉంటుందన్న అధికారుల హెచ్చరికల నేపథ్యంలో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ ఏడాది పొగాకు, మిర్చి సాగు తగ్గించి రైతులు మొక్కజొన్న సాగు చేపట్టారు. ప్రస్తుతం పలు గ్రామాలలో ముందస్తుగా సాగు చేసిన మొక్కజొన్న కోత దశకు వచ్చింది. దీంతో తుఫాన్ ప్రభావంతో గాలులు, వర్షంకు మొక్కజొన్న పడిపోయి దిగుబడి పూర్తిగా తగ్గిపోవటంతో పాటు రంగు మారే అవకాశం ఉందని ఆందోళన చెందుతున్నారు. అదే సమయంలో బోరు బావుల కింద, సాగర్ నీరు వచ్చిన వెంటనే సాగు చేసిన వరి పైరు కూడా సంతమాగులూరు, బల్లికురవ, అద్దంకి మండలాలలోని పలు గ్రామాలలో కోత దశలో ఉంది. మరికొన్ని చోట్ల వరి కోసి ఉండటంతో తడిసి ధాన్యం రం గు మారే అవకాశం ఉందని రైతులు చెబుతున్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

● మంత్రి రవికుమార్

అద్దంకి,నవంబరు30(ఆంధ్రజ్యోతి): దిత్వా తుఫాన్ ప్రభావం అద్దంకి నియోజకవర్గం పై ఎక్కువగా ఉండే అవకాశం ఉన్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ కోరారు. తుఫాన్ ప్రభావం వల్ల ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా అన్ని శాఖల అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలోని తీర ప్రాంతాలు, తేతట్టు ప్రాంతాలలో నివశించే ప్రజలను ముందస్తుగా సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. మత్స్యకారులు వేట కు వెళ్ల వద్దన్నారు. ప్రజలు విద్యుత్ తీగలు, స్తంభాలకు దూరంగా ఉండాలన్నారు.

పునరావాస కేంద్రాల పరిశీలన

చినగంజాం : దిత్వా తుఫాన్ నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అవసరమైతే తప్ప ఎవరూ బయటకు రావద్దని పర్చూరు నియోజకవర్గ ప్రత్యేకాధికారి ఎస్.లవన్న అన్నారు. మండలంలోని చినగంజాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో, మున్నంవారిపాలెం గ్రామంలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలను ఆదివారం ఆయన పరిశీలించారు. అన్నారు.

తీరంలో అధికారుల పర్యటన



తీరంలో పర్యటిస్తున్న తహసీల్దార్ గోపీకృష్ణ, ఎస్సై చంద్రశేఖర్

వాడరేవు(చీరాల) : దిత్వా తుఫాన్ నేపథ్యంలో అధికారులు అప్రమత్తం అయ్యారు. తహసీల్దార్ గోపీకృష్ణ, ఈపూరుపాలెం ఎస్సై చంద్రశేఖర్‌తో కలిసి తీరంలో పర్యటించారు. అలల ఉధృతిని పరిశీలించారు. ఇప్పటికే తుఫాన్ కారణంగా మత్స్యకారులు వేటకు వెళ్లరాదని నిషేధాజ్ఞలు విధించారు. పర్యాటకులకు ఆంక్షలు అమల్లో ఉన్నాయి. గజ ఈతగాళ్లతో కలిసి తీరం వెంబడి పర్యటించి పలు సూచనలు చేశారు.

కొండ చిలువ కలకలం

అద్దంకి,నవంబరు30(ఆంధ్రజ్యోతి):అద్దంకి పట్టణంలో దర్శి రోడ్డులో ఓ మూసి వేసిన దుకాణంలో కొండ చిలువ కలకలం రేపింది. దర్శి రోడ్డులో ఓ రెస్టారెంట్ సమీపంలో ఉన్న దుకాణం రెండు నెలలుగా మూసి వేసి ఉంది. ఆదివారం ఉదయం దుకాణం నిర్వహించే మహిళ తలుపులు తెరిచి లోపలకు వెళ్లగా పెద్ద కొండ చిలువ చుట్టు వేసుకొని ఉంది. దీంతో కంగారు చెందిన మహిళ స్థానికులకు సమాచారం అందించింది. విషయం తెలుసుకున్న పోలీసులు దుకాణం వద్ద వచ్చి పరిశీలించి అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. అటవీశాఖ సిబ్బంది సంఘటనాస్థలానికి చేరుకొని కొండ చిలువను పట్టుకొని గొర్రెపాడు కొండ వద్ద వదిలివేసినట్లు అటవీశాఖ కూకట్లపల్లి బీట్ ఆఫీసర్ రమేష్ తెలిపారు.



దుకాణంలో చుట్టుకొని ఉన్న కొండచిలువ

గురుకుల పాఠశాలలో నోట్ పుస్తకాల పంపిణీ

వేటపాలెం(చీరాల), నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : వేటపాలెం గురుకుల పాఠశాలలో టీడీపీ శ్రేణులు ఘనంగా నియోజకవర్గ అధికార ప్రతినిధి మద్దులూరి మహేంద్రనాథ్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈసందర్భంగా టీడీపీ ప్రతినిధులు చిన్నారులతో కలిసి కేక్ కటింగ్ నిర్వహించారు. అలాగే నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. కూటమి ప్రభుత్వం విద్యా రంగంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు చెప్పారు. అందుకు అనుగుణంగా మహేంద్రనాథ్ విశేష సేవలు అందిస్తున్నట్లు తెలిపారు.



గురుకుల పాఠశాలలో నోట్ పుస్తకాలను పంపిణీ చేస్తున్న టీడీపీ ప్రతినిధులు

కనులపండువగా సీతారాముల కల్యాణం

ఇంకొల్లు,నవంబరు 30(ఆంధ్రజ్యోతి): ఇంకొల్లులో రామమందిరం నిర్మాణం చేసి 50 సంవత్సరాలు పూర్తిఅయిన సందర్భంగా రామమందిర కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం స్వర్ణోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించారు.ఈ సందర్భంగా రామమందిరం వద్ద సీతారాముల కల్యాణ మహోత్సవం కనులపండువగా జరిగింది. స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి సీతారాముల కల్యాణం నిర్వహించారు.



ప్రత్యేక అలంకరణలో సీతారామ లక్ష్మణులు

అభయాంజనేయుని వార్షిక వేడుకలు

చినగంజాం: మండలంలోని కడవకుదురు గ్రామంలోని అభయాంజనేయస్వామి విగ్రహ 11వ వార్షిక వేడుకలను ఆదివారం వైభవంగా నిర్వహించారు. వేదపండితుల ఆధ్వర్యంలో విశేష పూజలు జరిపారు. పరిసర గ్రామాలకు చెందిన ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని అభయాంజనేయునికి పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు.



పూజలు నిర్వహిస్తున్న భక్తులు

ప్రజల్లో మమేకమైతేనే ఆదరణ

● ఏఐసీసీ పరిశీలకులు షారద్ ఆహర్

పర్చూరు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ప్రజల్లో మమేకం అయ్యే నాయకులకు రాజకీయ భవిష్యత్ ఉంటుందని మధ్యప్రదేశ్ పీసీసీ ఉపాధ్యక్షుడు, కాంగ్రెస్‌పార్టీ బాపట్ల జిల్లా పరిశీలకుడు షారద్ ఆహర్ అన్నారు. పర్చూరులోని మహాలక్ష్మీ కన్వెన్షన్‌లో ఆదివారం పర్చూరు నియోజకవర్గ ఇన్‌చార్జి నల్లగొర్ల శివ శ్రీలక్ష్మి జ్యోతి ఆధ్వర్యంలో కాంగ్రెస్‌పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఇన్‌చార్జి నియామక ప్రక్రియలో భాగంగా సమావేశం నిర్వహించి. నాయకులు, కార్యకర్తల అభిప్రాయ సేకరణ చేపట్టారు.



మాట్లాడుతున్న పరిశీలకుడు ఆహర్

రెస్టారెంట్‌లు, దాబాలలో మద్యం అమ్మకాలు

● బార్ నడపలేమంటూ మూసివేసి నిర్వాహకుల నిరసన

అద్దంకి,నవంబరు30(ఆంధ్రజ్యోతి):అద్దంకి పట్టణంలోని రెస్టారెంట్‌లు, దాబాలలో మద్యం అమ్మకాలు చేస్తున్న నేపథ్యంలో లైసెన్స్‌డ్ రెస్టారెంట్ అండ్ బార్ నిర్వహణ తమ వల్ల కాదంటూ ఆదివారం మధ్యాహ్నం నుంచి మూసి వేసి ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. అద్దంకి పట్టణంలోని శింగరకొండ రోడ్డులో దామావారిపాలెం వద్ద కేఎస్‌బీ రెస్టారెంట్ అండ్ బార్‌ను ఏర్పాటు చేశారు. పట్టణంలోని పలు రెస్టారెంట్‌లు, దాబాలలో షరా మాములు గానే మద్యం అమ్మకాలు చేస్తుండటం, అక్కడే మద్యం సేవించేందుకు అవకాశం ఉండటంతో ఆశించిన స్థాయిలో అమ్మకాలు లేకుండా పోయాయి. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకు పోయినా స్పందించలేదు. దీనికి నిరసనగా ఆదివారం మధ్యాహ్నం నుంచి కేఎస్‌బీ రెస్టారెంట్ అండ్ బార్‌ను మూసివేసి ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. ఈ విషయమై అద్దంకి ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ భవానీని వివరణ కోరగా విచారించి తగు చర్యలు తీసుకుంటామన్నారు.



అద్దంకిలోని శింగరకొండ రోడ్డు దామావారిపాలెం వద్ద మూసివేసి ఫ్లెక్సీ ఏర్పాటు చేసిన కేఎస్‌బీ రెస్టారెంట్ అండ్ బార్ నిర్వాహకులు




తుమ్మలపెంటలో కోతకు గురైన సముద్రతీరం

కసురు మీదున్న సముద్రం

కావలి రూరల్ : దిత్వా తుఫాన్ ప్రభావంతో కసురు మీదున్న సాగరతీరం కల్లోలంగా మారింది. కావలి మండలం తుమ్మలపెంట, కొత్తసత్రం సముద్రతీరం ఆదివారం 50 అడుగుల మేర ముందుకు రావటంతోపాటు 5 అడుగుల మేర అలలు ఎగసి పడుతున్నాయి. దీంతో మెరైన్ పోలీసులు పర్యాటకులను సముద్రస్నానాలకు రాకుండా బీచ్ సందర్శనను నిలిపివేసి రోడ్డుకు తాళ్లు, బారికేడ్లు అడ్డుపెట్టి గస్తీ నిర్వహిస్తున్నారు. మెరైన్ ఎస్ఐ జానకిరామయ్య సిబ్బందితో గస్తీ నిర్వహిస్తూ మత్స్యకారులను వేటకు వెళ్లకుండా చూడటంతో పాటు బోట్లు కొట్టుకు పోకుండా తీరానికి దూరంగా చేర్చారు.

● సోమశిల నీటిమట్టం తగ్గింపు

అనంతసాగరం: దిత్వా తుఫాన్ ప్రభావంతో ఎగువ నుంచి ఏక్షణమైనా వరద వచ్చే సూచనలు ఉండడంతో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. సోమశిలలో ఉన్న నీటినిల్వను తగ్గించేలా చర్యలు తీసుకున్నారు. ప్రస్తుతం జలాశయానికి వరద కొనసాగుతోంది. ఆదివారం ఉదయం 14,569 క్యూసెక్కులు వస్తుండగా, మధ్యాహ్నానికి తగ్గుముఖం పట్టి 10 వేల క్యూసెక్కులుగా నమోదైనట్లు అధికారులు తెలిపారు

● కండలేరులో నీటి నిల్వ 58.06 టీఎంసీలు

రాపూరు : మండలంలోని కండలేరు డ్యాం నీటి నిల్వ సామర్థ్యం 68 టీఎంసీలు కాగా, ప్రస్తుత నీటి మట్టం 58.06 టీఎంసీలుగా ఉన్నదని ఏఈ అనిల్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. సోమశిల నుంచి 2300 క్యూసెక్కుల ఇన్ ఫ్లో వస్తుండగా, 1080 క్యూసెక్కుల అవుట్ ఫ్లో ఉందని ఆయన తెలిపారు.

విద్యుత్ సిబ్బందికి సెలవులు రద్దు : ఎస్ఈ

నెల్లూరు(జడ్పీ) : దిత్వా తుఫాన్ ప్రభావం జిల్లాపై ఎక్కువగా ఉండే అవకాశమున్నందున, ప్రజలకు విద్యుత్ ఇబ్బందులు ఏర్పడకుండా ఉండేందుకు సిబ్బందికి సెలవులు రద్దు చేశామని ఎస్ఈ రాఘవేంద్రం తెలిపారు. ఆదివారం ఆయన చాంబర్ నుంచి జిల్లా అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తుఫాన్ జిల్లాపై ఎక్కువ ప్రభావం చూపుతున్నదని, దీనిని దృష్టిలో ఉంచుకుని ప్రతి అధికారి, ఉద్యోగి, సిబ్బంది పూర్తి అప్రమత్తంగా ఉంటూ విద్యుత్ అంతరాయం కలగకుండా పటిష్ఠ చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలోని ఐదు విద్యుత్ డివిజన్లలో ప్రత్యేకంగా కంట్రోల్‌రూంలు ఏర్పాటు చేశామని, అవి 24 గంటలు పని చేస్తాయన్నారు. వర్షాలు తగ్గే వరకు ప్రతి సబ్ స్టేషన్‌లో ఇద్దరు సిబ్బందిని మాత్రమే ఉంచి, మిగిలిన వారిని అత్యవసర సేవలకు వినియోగించుకోవాలన్నారు.


నెల్లూరు : పెన్నానదిలో ప్రవహిస్తున్న వరద నీరు

ముసురు వాన

- తుఫాన్ వాతావరణంతో ప్రజల అవస్థలు
- నేడు విద్యాసంస్థలకు సెలవు
- విద్యుత్ ఉద్యోగులకు సెలవుల రద్దు
- నేడు, రేపు భారీ నుంచి అతిభారీ వర్షసూచన
- ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : మంత్రులు ఆనం, నారాయణ

నెల్లూరు(హరనాథపురం), నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : దిత్వా తుఫాన్ ప్రభావంతో ఆదివారం జిల్లా వ్యాప్తంగా ముసురేసింది. ఆగాగి రోజంతా వర్షం కురుస్తూనే ఉంది. దిత్వా తుఫాన్ ప్రభావంతో భారీ వర్షాలు కురుస్తాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, పొంగూరు నారాయణ, జిల్లా అధికారులు సూచించారు. వర్షంతో నెల్లూరులోని రోడ్లనీ చిత్తడి చిత్తడిగా మారాయి. మురుగు కాలువల్లో నీరు రోడ్డుపై పారింది. జిల్లాలో సగటు వర్షపాతం 3.3 మి.మీగా నమోదైంది. అత్యధికంగా పొదలకూరులో 15.8 మి.మీ, అత్యల్పంగా మనుబోలులో 0.8 మిమీ వర్షపాతం నమోదైంది. సోమ, మంగళవారాల్లో కూడా భారీ నుంచి అతి భారీవర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ తెలిపింది.

● అధికారులు అప్రమత్తంగా ఉండండి : ఆనం

దిత్వా తుఫాన్‌ను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర దేవదాయశాఖమంత్రి ఆనం రామనారాయణరెడ్డి అధికారులను ఆదేశించారు. ఆదివారం జిల్లా ప్రత్యేకాధికారి యువరాజ్‌తో కలిసి ఆయన కలెక్టరేట్‌లోని తిక్కనభవన్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వ్యవసాయ అనుబంధ రంగాలు, రోడ్లు, భవనాలశాఖ, విద్యుత్‌శాఖ అధికారులంతా అప్రమత్తంగా ఉంటూ, జిల్లాలో నష్ట నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. రిజర్వాయర్లకు గండ్లు పడకుండా ఇరిగేషన్ అధికారులు నీటిని వాగుల ద్వారా ఎప్పటి కప్పుడు విడుదల చేస్తూ సముద్రంలో కలిసేలా చర్యలు తీసుకోవాలని ఆనం అన్నారు. జిల్లాలో ప్రాణ నష్టం ఆస్తినష్టం జరగకుండా అధికారులు అప్రమత్తతో వ్యవహరించాలన్నారు. వర్షాలకు అంటువ్యాధులు ప్రబలకుండా చూడాలన్నారు. ఈ సమావేశంలో ఎస్పీ అజిత, జేసీ మొగిలి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యా సంస్థలకు సెలవు

నెల్లూరు(విద్య) : భారీ వర్షాల కారణంగా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటూ జేసీ మొగిలి వెంకటేశ్వర్లు ఆదేశాలతో డిసెంబరు 1(నేడు) అన్నీ ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు సెలవు ప్రకటించినట్లు డీఈవో డాక్టర్ ఆర్.బాలాజీరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే జిల్లాలోని అన్నీ ప్రభుత్వ, ప్రైవేట్ జూనియర్ కళాశాలలకు కూడా సెలవు ప్రకటిస్తున్న ఆర్ఐవో వరప్రసాద్‌రావు తెలిపారు.

● నదీ పరివాహకంలో జాగ్రత్త : నారాయణ

జిల్లాకు వాతావరణశాఖ ఆరెంజ్ అలెర్ట్‌ను జారీ చేసిందని, అధికారులు అప్రమత్తంగా వ్యవహరించి ఎలాంటి ఆస్తి, ప్రాణ నష్టం జరగకుండా జాగ్రత్త చర్యలు తీసుకోవాలని మంత్రి నారాయణ అధికారులను ఆదేశించారు. ఆయన క్యాంపు కార్యాలయం నుంచి అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. పెన్నా పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. దిత్వా వల్ల ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు.


టెలీకాన్ఫరెన్స్‌లో ఎస్ఈ రాఘవేంద్రం


కావలి వైకుంఠపురంలోని చాకలివీధిలో నిల్వ చేరిన వర్షపునీరు


కావలి-ఉదయగిరి రహదారిలో మినీ స్టేడియం ఎదురుగా రోడ్డుపై ఉన్న వర్షపునీరు


కలెక్టరేట్‌లోని తిక్కన భవన్‌లో అధికారులతో మాట్లాడుతున్న మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, పక్కన ప్రత్యేక అధికారి యువరాజ్, ఎస్పీ అజిత, జేసీ వెంకటేశ్వర్లు తదితరులు

ఇన్‌ఫార్మర్లలో భయం

- పెంచలయ్య హత్యతో ఉలికిపాటు
- పోలీసులపై దాడితో పెరిగిన ఆందోళన
- సమాచారం ఇచ్చేందుకు వెనుకడుగు



నెల్లూరు(క్రైం), నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ప్రశాంతతకు మారుపేరుగా ఉన్న నెల్లూరు జిల్లా కొన్నేళ్లుగా నేరాలకు అడ్డాగా మారింది. హత్యలు, హత్యాయత్నాలు, దొంగతనాలు, దోపిడీలు, కత్తులతో బెదిరింపు, గంజాయి మత్తులో రక్తపాతం... ఇలా చెప్పుకుంటూపోతే జిల్లా నిత్యం నేరాలతో రాష్ట్రస్థాయి వార్తల్లో నిలుస్తోంది. జిల్లాలో జరుగుతున్న వరుస ఘటనలతో ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. నెల్లూరు రూరల్ పోలీసు స్టేషన్ పరిధిలో జరిగిన సీపీఎం నేత పెంచలయ్య హత్యతో పోలీసులకు ఆయా ప్రాంతాల్లో ఇన్‌ఫార్మర్లుగా పని చేస్తున్న వారు ఉలిక్కిపడ్డారు.

● భరోసా ఏదీ..?

పెంచలయ్య హత్యతో జిల్లాలో ఆయా పోలీసు స్టేషన్‌ల పరిధిలో పోలీసులకు దగ్గరగా ఉంటూ, నేరాల నియంత్రణకు కృషి చేస్తున్న ఎంతోమంది సామాన్యులు, ఇన్‌ఫార్మర్లలో భయాందోళన చోటు చేసుకుంది. అంతేకాక పెంచలయ్యను హత్య చేసిన నిందితులు పోలీసులపైనే కత్తితో దాడి చేయడంతో ఆ భయం మరింత పెరిగింది. పెంచలయ్య హత్య జరక్క ముందు, ఆయనకు కామాక్షి గ్యాంగ్‌తో గొడవలున్నాయని, వారి వల్ల పెంచలయ్య ప్రాణాలకు ముప్పు ఉందన్న విషయం పోలీసులకు ముందే తెలిసినా, నిర్లక్ష్యం వహించారని స్థానికులు చెబుతున్నారు. పెంచలయ్య హత్యకు ముందే పోలీసులు కామాక్షి గ్యాంగ్‌ను పిలిపించి వార్నింగ్ ఇవ్వడం, బైండోవర్ చేసుకోవడం చేసుంటే, ఇంతగా వారు బరితెగించి ఉండేవారు కాదని పెంచలయ్య కుటుంబ సభ్యులు, వామపక్షాల నాయకులు చర్చించుకుంటున్నారు. నేరాల నియంత్రణ, అసాంఘిక కార్యకలాపాలు జరుగుతుంటే పోలీసులకు సమాచారం అందించండి... మీ వివరాలు బయటకు రావు.. మీకు ఎలాంటి హాని జరగదు... అంటూ పోలీసులు నిత్యం చెబుతుంటారు. అయితే మేమున్నామన్న భరోసాను మాత్రం ప్రజలకు ఇవ్వడంలో వారు విఫలమవుతున్నారు.

పెంచలయ్య హత్య కేసు నిందితుల అరెస్టు



రూరల్ పోలీస్‌స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడుతున్న రూరల్ డీఎస్పీ శ్రీనివాస్‌రావు, హత్యకు వాడిన కత్తులను పరిశీలిస్తున్న డీఎస్పీ

నెల్లూరురూరల్ : సీపీఎం నేత వీ. పెంచలయ్య హత్య కేసులో నిందితులను పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. ఇందులో 14 మందికి ప్రమేయం ఉండగా, ఏడుగురిని రూరల్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మరో ఐదుగురిని పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయి. ఈ ఘటనకు కారకురాలైన అరవ కామాక్షిని నవాబుపేట పోలీసులు గంజాయి కేసులో అరెస్ట్ చేశారు. పోలీసు కాల్పుల్లో గాయపడ్డ జేమ్స్ జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్నారు. ఈ కేసు వివరాలను రూరల్ డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐ గుంజి వేణు విలేకరులకు వెల్లడించారు. అరెస్టు అయిన వారిలో రూరల్లోని 4వ మైలుకి చెందిన నాగుల జానకిరాం, తడికల బజార్‌కి చెందిన ధారా విష్ణువర్ధన్, ఆర్టీటీ కాలనీ వాసి హత్య కేసులో ముద్దాయిగా ఉన్న అరవ సంతోష్, రంగనాయకులపేట వద్ద ఉన్న ఉప్పరపాళెం వాసి మిందాల లోహిత్ అలియాస్ చింటు, శెట్టిగుంట రోడ్డులో ఉంటున్న సస్పెక్ట్ షీట్ ఉన్న ఈగ వినయ్, నవాబుపేట పాత చెక్‌పోస్టు ప్రాంతానికి చెందిన కల్లూరు సంతోష్, బోడిగాడితోటకి చెందిన అరవ జోసెఫ్ ఉన్నారు. వీరి దగ్గర నుంచి ఒక్కొక్క కత్తి, హత్యకు వినియోగించిన మరో రెండు కత్తులు, మూడు బైకులను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసు అధికారులు పేర్కొన్నారు. మృతుడి భార్య దుర్గ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వేదాయపాళెం సీఐ శ్రీనివాసులు, రూరల్ ఎస్సైలు లక్ష్మణరావు, సుధీర్, సిబ్బంది పాల్గొన్నారు.

● ఆ కీలక వ్యక్తి ఎవరు ?

పెంచలయ్యను హతమార్చడంలో అరవ కామాక్షితో పాటు మరో కీలక వ్యక్తి సహాయ, సహకారాలు అందించారని రూరల్ పోలీసులు పేర్కొన్నారు. ఆ వ్యక్తి ఎవరన్నది కీలకంగా మారింది. కామాక్షికి అడుగడుగునా రాజకీయంగా సహకరిస్తువస్తున్నది ఎవరనేది రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. వెనుకబడిన తరగతుల పేరిట సంఘాలు స్థాపించిచి, రాజకీయంగా లబ్ధి పొందుతూ కామాక్షికి సహకరిస్తూ, ఆమెను నేర సామ్రాజ్యానికి అధిపతిని చేసింది ఇతనేనన్న ప్రచారం పెంచలయ్య హత్య సంఘటనతో వెలుగులోకి వచ్చింది. అతని ప్రమేయంపై పోలీసులు లోతుగా ఆరా తీస్తున్నారు. త్వరలోనే అతన్ని అదుపులోకి తీసుకునే అవకాశం ఉంది.

● కామాక్షిపై పీటీ వారెంట్ ?

పెంచలయ్య హత్యలో అరవ కామాక్షి పాత్ర కీలకం కావడంతో ఆమెను అదుపులోకి తీసుకుని సమగ్రంగా విచారించేందుకు రూరల్ పోలీసులు సిద్ధమవుతున్నారు. ఈ మేరకు న్యాయస్థానంలో పీటీ వారెంట్ వేసి, ఆమెను అదుపులోకి తీసుకునేందుకు రంగం సిద్ధ చేశారు. కాగా, జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న నిందితుడు జేమ్స్ డిశ్చార్జి కాగానే అరెస్ట్ చేసేందుకు రూరల్ పోలీసులు ఏర్పాట్లు చేశారు.

ఎట్టకేలకు మోక్షం!



- ఇఫ్కో భూముల్లో ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటుకు అనుమతి
- రూ.870 కోట్లతో అభివృద్ధి చేసేందుకు నిర్ణయం
- ఈ భూముల్లోనే రూ.356 కోట్లతో ఇథనాల్ పరిశ్రమ
- డిసెంబరు 30న ప్రజాభిప్రాయ సేకరణకు సన్నాహాలు

నెల్లూరు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): సుమారు మూడు దశాబ్దాల నిరీక్షణకు తెరపడబోతోంది. ఎట్టకేలకు ఇఫ్కో కిసాన్ సెజ్ భూములకు మోక్షం లభించింది. భూములిచ్చిన వారికి పరిహారం చెల్లింపు అంశాలు ఇంకా కొన్ని కోర్టులో పెండింగ్ ఉన్నా, ఆ భూముల్లో పరిశ్రమల ఏర్పాటుకు ఉన్న అడ్డంకులు మాత్రం తొలగాయి. తొలుత భూములను కేటాయించింది ఎరువుల పరిశ్రమ కోసం కాగా, ఇప్పుడు ఆ భూములను పారిశ్రామిక పార్కుగా మార్చి వివిధ రకాల పరిశ్రమలు నెలకొల్పేందుకు ఇఫ్కో యాజమాన్యం ప్రతిపాదించింది. ఈ మేరకు ఇటీవల విశాఖలో జరిగిన పారిశ్రామిక సదస్సులో ప్రభుత్వంతో ఎంవోయూ కుదుర్చుకున్నట్లు ఇఫ్కో వర్గాలు చెబుతున్నాయి.

● రూ.870 కోట్లతో నిర్మాణం

ఇఫ్కో ఆధీనంలోని 2,776 ఎకరాల్లో కొత్త పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన మౌలిక వసతులను రూ.870 కోట్లతో కల్పించేలా అధికారులు సిద్ధమవుతున్నారు. ఇందుకు సంబంధించి పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణకు నోటీసు కూడా జారీ చేశారు. డిసెంబరు 30న ఈ అభిప్రాయ సేకరణ ప్రక్రియ జరగనుంది. అన్నీ వసతులతో పారిశ్రామిక పార్కు ఏర్పాటు పూర్తయితే అనేక పరిశ్రమలు ముందుకొచ్చే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. ఇప్పటికే ఇఫ్కో కిసాన్ సెజ్‌లో 29 ఎకరాల్లో ఇథనాల్ పరిశ్రమ నెలకొల్పేందుకు రామ్కీ బయో ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ముందుకొచ్చింది. రూ.356 కోట్లతో నిర్మాణం కాబోతున్న ఈ పరిశ్రమకు సంబంధించి కూడా డిసెంబరు 30న పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ జరగనుంది. ప్లగ్ అండ్ ప్లే విధానంతో ఇఫ్కో భూముల్లో పరిశ్రమలు ఏర్పాటు చేసి సుమారు 70 వేల ఉద్యోగాలు సృష్టించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

● కేసుల పరిష్కారం

కొడవలూరు మండలంలోని రేగడిచెలిక, రాచర్లపాడు, బొడ్డువారిపాలెం గ్రామాలు, దగదర్తి మండలంలోని చౌటపుత్తేడు, ఊచగుంటపాలెం, తడకలూరు గ్రామాలు, అల్లూరు మండలంలోని నార్త్ ఆములూరు గ్రామాల పరిధిలో ఇఫ్కో కిసాన్ సెజ్‌కు 30 ఏళ్ల క్రితం భూములు కేటాయించారు. అయితే అనుకున్న విధంగా ఎరువుల పరిశ్రమ ఏర్పాటు కాలేదు. ఆ తర్వాత భూములిచ్చిన రైతులు తమకు పరిహారం అందించలేదని హైకోర్టును ఆశ్రయించారు. ఇంకొందరు భూములు తీసుకున్న లక్ష్యానికి విరుద్ధంగా పరిశ్రమలు ఏర్పాటు చేయాలని చూస్తున్నారంటూ కేసులు వేశారు. ఈ కారణాలతో ఆ భూములు నిరుపయోగంగా మారాయి. ఆయా కేసులు ఇటీవల పరిష్కారమైన నేపథ్యంలో ఇఫ్కో భూముల్లో పారిశ్రామిక పార్కు ఏర్పాటుకు సన్నాహాలు మొదలయ్యాయి.


శ్రద్ధాంజలి
ప్రజాసేవలో ధన్యం మీ జీవితం
ప్రజల గుండెల్లో మీ స్థానం శాశ్వతం
కీ॥ శే॥ శ్రీ మాగుంట సుబ్బరామరెడ్డి గారు
ఒంగోలు పార్లమెంటు మాజీసభ్యులు
30వ వర్ధంతి సందర్భంగా
వారి పవిత్రాత్మకు శాంతి కలగాలని ప్రార్థిస్తూ...
కుటుంబ సభ్యులు
మరియు బంధుమిత్రులు
తేది: 1-12-2025 సోమవారం ఉ॥ 10.30 గం॥లకు నెల్లూరు, పొగతోటలోని M1 సినిమాస్(S2 సినిమాస్)లో
మహనీయులు కీ॥శే॥ మాగుంట సుబ్బరామరెడ్డి గారికి స్మృత్యంజలి ఘటిస్తారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	132
స్కిన్ చికెన్	240
స్కిన్‌లెస్	264

కోడిగుడ్ల ధర (100) : 650

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)
ఒక గ్రాము ధర రూ.12257
వెండి కిలో ధర రూ. 176300
వెండి ఒక గ్రాము రూ.181.30

వైభవంగా అయ్యప్ప పడిపూజ

జలదంకి, నవంబరు30(ఆంధ్రజ్యోతి): జలదంకి మండలం బ్రాహ్మణక్రాక శివాలయంలో ఆదివారం అయ్యప్పస్వామి పడిపూజ వైభవంగా జరిగింది. వందలాది మంది అయ్యప్ప భక్తులు పూజల్లో భాగంగా భజన చేశారు. అయ్యప్పస్వామి, గణపతి, సుబ్రహ్మణ్య స్వామి ప్రతిమలను ప్రత్యేకంగా అలంకరించారు. 18 మెట్లు ఏర్పాటు చేసి శాస్త్రోక్తంగా పూజలు చేశారు. అనంతరం నిర్వాహకులు అన్నదానం ఏర్పాటు చేశారు.

కావలిలో భారీ వర్షం.. రోడ్లు జలమయం

కావలి, నవంబరు30 (ఆంధ్రజ్యోతి) దిత్వా తుఫాన్ ప్రభావంతో ఆదివారం కావలిలో భారీ వర్షం కురిసింది. దీంతో కాలువలు, రోడ్లన్నీ జలమయమయ్యాయి. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఆదివారం మధ్యాహ్నం నుంచి వర్షం దంచి కొట్టడంతో ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. మరికొందరు పనులపై బయటికి వచ్చి ఇబ్బందులు పడ్డారు. పట్టణంలో కాలువలన్నీ ఆక్రమణలకు గురై పూడికతో నిండిపోవటంతో వర్షపు నీరంతా రోడ్లపై నిల్వ ఉంటోంది. కావలి-ఉదయగిరి జాతీయ రహదారికి ఇరువైపులా ఉన్న కాలువలు ఆక్రమణలకు గురి కావటంతో జనతాపేట, వెంగళరావునగర్ ప్రాంతంలో ఉన్న ఆ రోడ్డుపూర్తిగా జలమయమైంది. దీంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. అలాగే ట్రంకు రోడ్డుకు ఇరువైపులా ఉన్న కాలువలు సైతం మూత బండలు, పూడికతో నిండిపోవటంతో అనేక ప్రాంతాలు జలమయమయ్యాయి. వైకుంఠపురంలోని అన్నపుగుంట ప్రాంతం ,శివాలయం రోడ్డు, సబ్‌కోర్టు వీధి, తుమ్మలపెంట రోడ్డు తదితర ప్రాంతాలలో ప్రజలు రాకపోకలకు ఇబ్బంది.

అల్లూరు : మండలంలో శనివారం రాత్రి నుండి ప్రారంభమైన వర్షం ఆదివారం రాత్రి వరకు ఎడతెరిపి లేకుండా కురుస్తోంది. ఇప్పటికే రైతులు వరినాట్లులో నిమగ్నమై ఉండడంతో వర్షం వ్యవసాయ పనులకు అడ్డంకిగా మారిందని రైతులు అంటున్నారు. లోతట్టు ప్రాంతాల్లోని భూముల్లో వరినాట్లుకు తీవ్ర ఆటంకం ఏర్పడనుంది. వరద నీరు ప్రవహిస్తే వేసిన నార్లు దెబ్బతినే అవకాశం ఉండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.


పెదపవనిరోడ్డు- ఉదయగిరి రోడ్డులో ప్రవహిస్తున్న వాననీరు

జలదంకి: దిత్వా తుఫాను నేపథ్యంలో జలదంకి మండల తహసీల్దారు సీతామహాలక్ష్మి, ఎస్ఐ లతీఫున్నీసా, ఏఓ శ్రీవాణిలు ప్రజలకు సోషల్ మీడియా ద్వారా సూచనలు ఇస్తున్నారు. జోరు వానలోనూ రైతులు మాగాణి భూముల్లో వరినాట్లు వేసేందుకు సిద్ధమయ్యారు. మరికొందరు కూలీలచే వరినాట్లు వేయిస్తున్నారు. నాటిన మడులలో నీరు బయటకు తీసి నాట్లు కుళ్ళిపోకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. వర్షం అధికమైతే సోమవారం పలు రోడ్లపై వాహన రాకపోకలు నిలిచిపోయే అవకాశాలున్నా యని మండల అధికారులు, వీఆర్వోలు తెలిపారు. వాగుల వద్ద గస్తీ ఏర్పాటు చేస్తున్నట్లు తహసీల్దారు, ఎస్ఐలు పేర్కొన్నారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

కలిగిరి, నవంబరు30 (ఆంధ్రజ్యోతి): కలిగిరి పంచాయతీ పరిధిలోని జిర్రావారిపాలెంలో శనివారం అర్ధరాత్రి ఇంట్లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. ఈ ఘటనలో విద్యుత్ తీగలు పూర్తిగా దగ్ధం కావడంతో మంటలు చెలరేగాయి. సామాగ్రి, కొంత నగదు పూర్తిగా కాలిపోయాయి. ఇంటి యజమాని పాశం కొండలరావు అప్రమత్తమై తన ఇద్దరు పిల్లలతో ప్రాణాలతో బయటపడ్డాడు. భార్య చనిపోయి కూలి చేసుకుంటూ ఇద్దరు పిల్లల్ని పోషించుకుంటున్నానని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు విన్నవించాడు.

నేడు పింఛన్ల పంపిణీ

ఉలవపాడు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు సోమవారం ఉదయం ఉలవపాడుకు వస్తున్నట్లు మండల టీడీపీ అధ్యక్షుడు రాచగల్లు సుబ్బారావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉలవపాడులోని మసీదు సెంటర్‌లో లబ్ధిదారుల ఇళ్ల వద్ద ఎమ్మెల్యే పింఛన్ల పంపిణీ చేపట్టనున్నందున మండలంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని ఆయన కోరారు.

బీజేపీ మండల కన్వీనర్‌గా రాము


రాముతో మండల పార్టీ నాయకులు

ఉలవపాడు, నవంబరు 30 (ఆంధ్ర జ్యోతి): బీజేపీ మండల కార్యకర్తల సమావేశం ఆదివారం జరిగింది. మండల కన్వీనర్‌గా జీటీ రాముని ఎన్నుకున్నట్లు నాయకులు తెలిపారు.. ఈ కార్యక్రమంలో పొందూరి కృష్ణారెడ్డి, ఎలమంద, పాలూరి వెంకట్రావు, సత్యం, గాగేంద్ర, శ్రీధర్, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

కందుకూరు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): కందుకూరులోని బూడిదపాలెం వెళ్లే రోడ్డు పక్కన ఆదివారం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు సీఐ అన్వర్ బాషా తెలిపారు. అపస్మారక స్థితిలో ఉన్న వ్యక్తిని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించగా, ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. పరిశీలించిన డాక్టర్ అప్పటికే అతను మరణించినట్లు నిర్ధారించారన్నారు. అతని గుండెలపై నరసింహా, యముడు అని పచ్చబొట్లు ఉన్నాయని, తెలిసిన వారు 9121102202, 9121102203 నెంబర్లకు సమాచారమివ్వాలని కోరారు.

ప్రజలకు నాణ్యమైన సేవలు అందించాలి

- మొబైల్ టెక్నీషియన్లతో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

కందుకూరు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : మొబైల్ టెక్నీషియన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రజలకు నాణ్యమైన సేవలు అందించాలని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు సూచించారు. ఆదివారం పట్టణంలోని వెంగమాంబ కల్యాణ మండపంలో జరిగిన కందుకూరు మొబైల్ టెక్నీషియన్ అసోసియేషన్ ఆవిర్భావ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని లోగోను, ఐడీ కార్డులను పంపిణీ చేశారు. నేటి ప్రపంచంలో మొబైల్ రంగం కీలమని, విప్లవాత్మక మార్పులు చోటుచేసుకుంటున్నాయన్నారు. కందుకూరులో రూముల అద్దెలు ఎక్కువగా ఉన్నాయని, నెల్లూరు తరహాలో స్ట్రీట్ బజార్ పెట్టి తక్కువ కిరాయికి రూములు అందించే ఆలోచన ఉన్నట్లు పేర్కొన్నారు. అదేవిధంగా పట్టణంలో ఆటోనగర్ ఏర్పాటుకు కృషి చేస్తానని తెలిపారు. బీపీఎల్‌కు దిగువన ఉన్న అసోసియేషన్ బాధ్యులకు ఇళ్ల స్థలాలు ఇవ్వడానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఎస్సై శివనాగరాజు, అసోసియేషన్ అధ్యక్షుడు షేక్ సలాం, శ్రీనివాస్, రియాజ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఏపీ రెవెన్యూ సర్వీస్ అసోసియేషన్ అభినందనలు

కందుకూరు నియోజకవర్గాన్ని తిరిగి ప్రకాశం జిల్లాలో కలపడంలో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు కృషి ఎంతో ఉందని ఏపీ రెవెన్యూ సర్వీస్ అసోసియేషన్ కందుకూరు డివిజన్ సభ్యులు పేర్కొన్నారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో వారు ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందచేసి అభినందనలు తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వం నియోజకవర్గ ప్రజల మనోభావాలను పరిగణలోకి తీసుకోకుండా ఏకపక్షంగా నెల్లూరు జిల్లాలో కలపడం వలన ప్రజలతోపాటు, ఉద్యోగులు కూడా అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. ప్రస్తుత సీఎం చంద్రబాబు ఇచ్చిన మాట ప్రకారం తిరిగి ప్రకాశంలో కలుపుతున్నందుకు ప్రభుత్వానికి రెవెన్యూ ఉద్యోగస్తుల తరఫున ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు ఎస్ విజయ భాస్కర్, అసోసియేషన్ ప్రెసిడెంట్ మధుసూదన్‌రావు, ట్రెజరర్ రమణయ్య, కార్యవర్గ సభ్యులు సాయితేజ, శ్రీకాంత్, సింగయ్య పాల్గొన్నారు.


మొబైల్ టెక్నీషియన్ అసోసియేషన్ లోగోను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ఇంటూరి

రక్షణ కల్పించండి!

- డీఎస్పీని ఆశ్రయించిన ప్రేమజంట


ప్రేమజంటతో మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీధర్

కావలి రూరల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రేమ వివాహం చేసుకున్న ఓ జంట తమకు కుటుంబ సభ్యుల నుండి రక్షణ కల్పించాలని ఆదివారం కావలి డీఎస్పీ శ్రీధర్‌ను ఆశ్రయించింది. జలదంకి మండలం లింగరాజు అగ్రహారానికి చెందిన అన్నం కార్తీక్, ప్రకాశం జిల్లా కొత్తపట్నం మండలం మన్నూరుకు చెందిన సూరగం ప్రసన్న ప్రేమించుకున్నారు. అయితే ఇరు కుటుంబాల పెద్దలు ఒప్పుకోరని ఇంటి నుండి వచ్చేశారు. ఇద్దరూ మేజర్లు కావటంతో ఈ నెల 26వ తేదీన కావలి చెరువు వద్ద ఉన్న మాల్యాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో వివాహం చేసుకున్నారు. అనంతరం ఈ విషయాన్ని కార్తీక్ కుటుంబ సభ్యులకు తెలపటంతో వారు అంగీకరించారు. దీంతో వారు లింగరాజు అగ్రహారంలో ఉంటున్నారు. ఇదిలా ఉండగా ప్రసన్న కనిపించటం లేదని కుటుంబ సభ్యులు కొత్తపట్నం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ప్రసన్న, లింగరాజు అగ్రహారంలో ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. శనివారం కుటుంబసభ్యులు పోలీసులను వెంటబెట్టుకుని అక్కడికి వెళ్లి ప్రసన్నతో మాట్లాడారు. అయితే తాను ఇష్టపడే కార్తీక్‌ను వివాహం చేసుకున్నానని చెప్పిన ప్రసన్న తన కుటుంబసభ్యులతో ఇంటికి వెళ్లడానికి నిరాకరించింది. దీంతో పోలీసులు అక్కడినుంచి వెళ్లిపోయారు. అనంతరం కార్తీక్ కుటుంబ సభ్యులతో కలిసి నూతన దంపతులు డీఎస్పీని కలిసి రక్షణ కోరారు. ఇద్దరూ మేజర్లు కావటంతో ప్రసన్న కుటుంబ సభ్యులను పిలిపించి, ఇరు కుటుంబాలతో మాట్లాడి రక్షణ కల్పిస్తామని డీఎస్పీ తెలిపారు.

పెంచలయ్య హత్యకు నిరసనగా కొవ్వొత్తులతో ర్యాలీ


కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న నాయకులు

కావలి (టౌన్), నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): సీపీఎం నాయకుడు పెంచలయ్య హత్యకు నిరసనగా ఆదివారం ట్రంకు రోడ్డులోని అంబేడ్కర్ విగ్రహం వద్ద కొవ్వొత్తులతో నిరసన కార్యక్ర మం నిర్వహించారు. పార్టీ పట్టణ కార్యదర్శి పసుపులేటి పెంచలయ్య మాట్లాడుతూ గంజాయి, మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా నెల్లూరు నగరంలో పెంచలయ్య పోరాటం చేస్తూ యువతను చైతన్యపరుస్తున్నారని, అది సహించలేని గంజాయి బ్యాచ్ పెంచ లయ్యను పథకం ప్రకారం హత్య చేయడం అమానుషమన్నారు. హంతకులను కఠినంగా శిక్షించేవరకు పోరాటం చేస్తామన్నారు. డిసెంబరు 2న జిల్లా బంద్‌ను జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో నేతలు తిరుపాలు, బి కృష్ణయ్య, మేడ వెంకటేశ్వర్లు, చెన్నయ్య, కె నారాయణ, అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

కామేశ్వరరావుకు ఘన నివాళి

కావలి (టౌన్) నవంబరు 30(ఆంధ్రజ్యోతి): కామేశ్వరరావు బలిదానంతోనే విద్యుత్ కార్మికుల జీవితాల్లో వెలుగులు వచ్చాయని విద్యుత్ శాఖ ఈఈ బెనర్జీ పేర్కొన్నారు. ఆదివారం కామేశ్వరరావు 52వ వర్ధంతి పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో జరిగిన వర్ధంతి సభకు ఆయన హాజరై కామేశ్వరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. యూనియన్ నాయకులు ఎస్‌కె సందాని బాష, లక్ష్మీరెడ్డి మాట్లాడుతూ వేలాదిమంది ఉద్యోగులకు కామేశ్వరరావు భద్రత, భరోసా కల్పించారన్నారు. కార్యక్రమంలో ఏఈలు నాగార్జున, వసంతరావు, సామాజిక కార్యకర్తలు నారపరెడ్డి, వేణుగోపాల్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య

ఉలవపాడు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో ఉరివేసుకుని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆదివారం ఉలవపాడులో జరిగింది. ఎస్సై అంకమ్మ తెలిపిన వివరాల మేరకు.. ఉలవపాడు గ్రామానికి చెందిన ఓగుబోయిన ప్రసాదు మన్నేటికోట అడ్డరోడ్డు వద్ద రొయ్యల చెరువులు సాగు చేస్తున్నాడు. వేటపాలెం మండలం జగన్నాధపురం గ్రామానికి చెందిన రాపూరి సాంబశివరావు (50) రొయ్యల చెరువుల వద్ద పనిచేయడానికి కుదిరాడు. సుమారు 17 ఏళ్లుగా తన భార్యతో దూరంగా ఉంటూ మరో మహిళలతో అక్రమ సంబంధం పెట్టుకుని జీవనం సాగిస్తున్నాడు. ఈనేపథ్యంలో కుటుంబ సభ్యులు, కుమారుడు ఇటీవల సాంబశివరావుతో గొడవలు పెట్టుకున్నారు. దీంతో మనస్తాపం చెంది, తను పనిచేస్తున్న రొయ్యల చెరువు వద్ద నివాసం ఉంటున్న రేకుల షెడ్డులోని ఇనుప కమ్మీకు ఉరివేసుని ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న కందుకూరు సీఐ అన్వర్‌బాషా సంఘటనా స్థలంకు చేరుకొని ఎస్సై అంకమ్మతో కలిసి అక్కడ పనిచేస్తున్న వ్యక్తులను విచారించారు. మృతుడి భార్య రాపూరి కోటేశ్వరమ్మ ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉలవపాడు సీహెచ్‌సీకి తరలించినట్లు పోలీసులు తెలిపారు.

దిత్వా తుఫాన్ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి


సోమశిల జలాశయాన్ని సందర్శించిన తహసీల్దారు జయవర్ధన్‌రెడ్డి

అనంతసాగరం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): దిత్వా తుఫాన్ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అనంతసాగరం తహసీల్దారు జయవర్ధన్‌రెడ్డి తెలిపారు. ఆయన ఆదివారం సోమశిల జలాశయాన్ని సందర్శించి నీటి వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. లోతట్టు ప్రాంత ప్రజలను అప్రమత్తం చేసేలా రెవెన్యూ ఉద్యోగులకు సూచనలు చేశారు. ఆయన వెంట ఆర్ఐ రవి ఉన్నారు.

- **చేజర్ల:** తుపాను పట్ల మండలంలోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ తిరుమలరావు సూచించారు. రెండు రోజుల పాటు భారీ వర్షాలు కురుస్తాయని, అధికారుల అదేశాల మేర కు పెన్నానది పరీవాహక గ్రామాలలోని ప్రజలు నదివైపు వెళ్ళరాదని సూచించారు. అత్యవసరమైతే తప్ప ప్రజలు ఇళ్ల నుండి బయటకు రావద్దని, ముఖ్యంగా వాగులు, చప్టాలు, నీరు ప్రవహిస్తున్న ప్రదేశాలు దాటే ప్రయత్నాలు చేయవద్దని తెలిపారు. ఏదైనా అత్యవసర పరిస్థి తులు ఎదురైతే డయల్ 112, లేదా పోలీస్‌స్టేషన్‌కు ఫోన్ చేయాలని కోరారు.

హంతకులను కఠినంగా శిక్షించాలి : సీపీఎం


ఆందోళన చేస్తున్న సీపీఎం నాయకులు

అనంతసాగరం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): నెల్లూరులో సీపీఎం సభ్యుడు పెంచలయ్యను హత్యచేసిన వారిని కఠినంగా శిక్షించాలని స్థానిక బస్టాండ్ సెంటర్‌లో ఆదివారం సీపీఎం నాయకులు ఆందోళన చేశారు. గంజాయి, మాదకద్రవ్యాల ముఠా అతన్ని హతమార్చినట్లు ఆరోపించారు. వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో నాయకులు అన్వర్‌బాషా, సుబ్బారాయుడు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం


పాఠశాలలో సమావేశమైన పూర్వ విదార్థులు

అనంతసాగరం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రేవూరు ఉన్నత పాఠశాలలో 1992-93 పదవ తరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు ఆదివారం పాఠశాలలో కలిశారు. ఈసందర్భంగా అప్పుడు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులు చలమయ్య, దశయ్య, షంషుద్దీన్‌లను సన్మానించారు.

వర్షాలతో వీధులు బురదమయం

- అవస్థలు పడుతున్న జనం

ఆత్మకూరు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): దిత్వా తుఫాన్ ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు ఆత్మకూరు మున్సిపాల్టీ పరిధిలోని పలు వీధులు, లోతట్టు ప్రాంతాలు, వీవర్స్ కాలనీలో రోడ్లు బురదమయమై అధ్వానంగా తయారవడంతో ఆ ప్రాంతవాసులు ఇబ్బందులు పడుతున్నారు. వీవర్స్ కాలనీలో రోడ్లు, మురుగు కాలువలు సక్రమంగా లేకపోవడంతో చిన్నపాటి వర్షానికైనా ఇబ్బందులు తప్పడం లేదని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాగా, తుఫాన్ నేపథ్యంలో గత రెండు రోజులుగా వర్షం కురుస్తుండడంతో అధికార యంత్రాంగం అప్రమత్తమయ్యారు. వాగులు, వంకల వద్ద ప్రత్యేక బృందాలను ఏర్పాటుచేసి పర్యవేక్షిస్తున్నారు. ఆర్డీవో బి పావని అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండి ప్రజలు ఇబ్బందులు పడకుండా తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. దిత్వా తుఫాన్ ప్రభావం తీవ్రంగా ఉండనుండడంతో ఆత్మకూరు పట్టణ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ కమిషనర్ కోరారు. తుఫాన్ సహాయక చర్యలు నిమిత్తం ఆత్మకూరు మున్సిపల్ కార్యాలయంలో అత్యవసర కాల్ సెంటర్ ఏర్పాటు చేశామన్నారు. ఎటువంటి విపత్కర పరిస్థితులు ఎదురైనా 0827- 220385 నెంబర్‌కు ఫోన్ చేయాలని కోరారు.

- **సంగం:** మండలంలో దిత్వా తుఫాన్ ప్రభావంతో శనివారం రాత్రి నుంచి ఆదివారం సాయంత్రం వరకు ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. దీంతో వీధులన్నీ జలమయమయ్యాయి. జనజీవనం స్తంభించింది.


వీవర్స్ కాలనీలో బురదమయమై అధ్వానంగా ఉన్న రోడ్డు

- **ఉదయగిరి:** దిత్వా తుఫాన్ ప్రభావంతో మెట్ట ప్రాంతమైన ఉదయగిరిలో శనివారం రాత్రి నుంచి చిరుజల్లులు కురుస్తున్నాయి. వర్షానికి వీధులు, బస్టాండ్ ప్రాంతం బురదమయంగా మారింది. భారీ వర్షాలు కురిస్తే నీటివనరులకు ప్రమాదం పొంచి ఉందని రైతులు అభిప్రాయపడుతున్నారు.

గంగమ్మకు ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో గంగమ్మతల్లి

ఉదయగిరి, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని గండిపాళెం జలాశయం ఆవరణలో ఉన్న గంగమ్మతల్లి ఆలయంలో ఆదివారం మార్గశిర మాసం దశమి తిథి కావడంతో అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. ఈసందర్భంగా భక్తులు అమ్మవారికి కాయా కర్పూరం అందజేసి ప్రత్యేక పూజలు చేపట్టి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ఘనంగా గంధ మహోత్సవం

చేజర్ల, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన చేజర్లలోని హజరత్ ఖాదర్‌వలియా గంధ మహోత్సవాన్ని ఆదివారం ముస్లింలు ఘనంగా నిర్వహించారు. మేళతాళాలు, ఫకీరుల వాయిద్యాలతో ఊరేగింపుగా ఫాతిహా సామాగ్రిని దర్గా వద్దకు తీసుకువచ్చి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. గంధ మహోత్సవం సందర్భంగా నజీర్ బ్రదర్స్, వంగవరపు ఆనంద్ రెడ్డి ఆధ్వర్యంలో భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. చేజర్ల ఎస్ఐ తిరుమలరావు, పలు గ్రామాల నాయకులు దర్గాలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కాంగ్రెస్ పార్టీ పటిష్టతకు కృషిచేయాలి : చేవూరు


సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్‌పార్టీ జిల్లా అధ్యక్షుడు చేవూరు దేవకుమార్‌రెడ్డి

ఆత్మకూరు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం రాబోతుందని, నేతలు, కార్యకర్తలు సమన్వయంతో పార్టీ పటిష్టతకు కృషిచేయాలని పార్టీ జిల్లా అధ్యక్షుడు చేవూరు దేవకుమార్‌రెడ్డి సూచించారు. స్థానిక శ్రీధర్ గార్డెన్స్‌లో దేశవ్యాప్తంగా పార్టీ సంస్థగత నిర్మాణం (సంఘటన్ సృజనా అభియాన్) కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఏఐసీసీ పరిశీలకులు, తమిళనాడు ఎమ్మెల్యే అసన్ మౌలానా, ఏపీసీసీ స్పోర్ట్స్ సెల్ చైర్మన్, సమన్వయకర్త జీవీవీఎస్ కమలాకర్‌రావు, సీనియర్ నాయకులు ఎం బుల్లిబాబు పాల్గొని ప్రసంగించారు. ప్రజల సమస్యలపై పోరాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా యూత్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ వన్నం నాగరాజు, నియోజకవర్గంలోని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు షేక్ ఖాజారంతుల్లా, పీర్ల శికుమార్, కొల్లూరు ప్రసాద్, కాకి తిరిపాలు, మద్దాల మల్లికార్జునరెడ్డి, షేక్ ఖాదర్‌నిషా, పి దివ్యజ్యోతి, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భగవద్గీత జాతికి ఆదర్శం


శాకాహార ర్యాలీ నిర్వహిస్తున్న ధ్యానులు

వింజమూరు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): భగవద్గీత భరత జాతికి, యావత్ ప్రపంచానికి ఆదర్శనీయమని, దీనిని అర్థం చేసుకుని ఆచరించినట్లయితే మానవ జన్మ ధన్యమవుతుందని సీనియర్ పిరమిడ్ మాస్టర్ విజయలక్ష్మీ అన్నారు. వింజమూరులోని వేదవ్యాస వశిష్ట పిరమిడ్ ధ్యాన మహాశక్తి క్షేత్రంలో ఆదివారం ఆత్మజ్ఞానం కార్యక్రమంలో ఆమె పాల్గొని భగవద్గీత శ్లోకాలు, వాటి అర్థాలు, అంతరార్థాలను వివరించారు. ధ్యానంపై అవగాహన కల్పించారు. శాకాహారం ప్రాముఖ్యతపై కరపత్రాలు పంచుతూ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ధ్యానులు తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి : యూటీఎఫ్

వింజమూరు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): విద్యారంగ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జీవి చలపతి శర్మ డిమాండ్ చేశారు. పట్టణంలోని జడ్పీ బాలుర హైస్కూల్‌లో ఆదివారం యూటీఎఫ్ మండల శాఖ ఆధ్వర్యంలో నూతన కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి జీవి చలపతి శర్మ పాల్గొని మాట్లాడుతూ ఉపాధ్యాయులకు బోధనేతర పనుల నుంచి విముక్తి కలిగించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. ఈ సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా నాయకులు బాలరాఘవులు, చంచలబాబు, సీనియర్ నాయకులు కామాక్షయ్య, పెద్దవంగయ్య, చిన్నవెంకయ్య, మండల నాయకులు వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గురజాడకు ఘన నివాళి


గురజాడ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న విద్యార్థులు

అనంతసాగరం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక శాఖా గ్రంథాలయంలో ఆదివారం ప్రముఖ కవి గురజాడ అప్పారావు వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా గ్రంథపాలకుడు నారాయణరావు గురజాడ చేసిన సేవలను విద్యార్థులకు వివరించి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో కేడీపల్లి పుస్తక కేంద్రం నిర్వాహకుడు భానుప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

కోన కాలువ నీటితొట్టె శుభ్రం


తొట్టెను శుభ్రం చేస్తున్న పంచాయతీ సిబ్బంది

ఉదయగిరి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఉదయగిరి పట్టణ ప్రజల దాహార్తి తీర్చే కోనకాలువ నీటితొట్టెను పంచాయతీ సర్పంచ్ సామ్రాజ్యం, ఉప సర్పంచ్ ముర్తుజాల ఆదేశాల మేరకు ఆదివారం పంచాయతీ ఈవో కరీముల్లా సిబ్బందిచే శుభ్రం చేయించారు. వర్షాలు కురుస్తున్నందున తాగునీటికి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తుగా తొట్టిని శుభ్రం చేసి నీరు సజావుగా సరఫరా అయ్యేలా చేశారు.

నేడు గాంధీజన సంఘంలో మంత్రి ఆనం పర్యటన

సంగం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గాంధీజన సంఘం గ్రామ పంచాయతీలో సోమవారం ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో దేవదాయ ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పాల్గొంటారని మండల పార్టీ అధ్యక్షుడు బాణా శ్రీనివాసులురెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. పింఛన్ల పంపిణీ కార్యక్రమం అనంతరం గ్రామంలో రూ. 32 లక్షలతో నిర్మాణం చేపట్టనున్న పంచాయతీ భవనానికి, రూ. 5 లక్షలతో రామాలయం ప్రహరీ, రూ. 14 లక్షలతో చేపట్టే సీసీ రోడ్డు పనులకు ఆయన భూమి పూజ చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ నాయకులు, అధికారులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

నేటి నుంచి వీపీఆర్ నేత్ర శిబిరం

ఉదయగిరి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలో సోమవారం నుంచి శనివారం వరకు నెల్లూరు పార్లమెంట్ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నేత్ర శిబిరం నిర్వహించనున్నట్లు మండల టీడీపీ కన్వీనర్ చింతనబోయిన బయ్యన్న ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సోమవారం గండిపాళెం, మంగళవారం వెంగళరావునగర్, బుధవారం తిరుమలాపురం, గురువారం అప్పసముద్రం, శుక్రవారం దాసరిపల్లి, శనివారం ఉదయగిరి పంచాయతీల్లో ఈ శిబిరాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కంటి సమస్యలతో బాధపడుతున్న వారు శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.